Pubilshed from Kadapa

PRGI NO : APTEL/25/A1220

ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com



కడప KADAPA | సంపుటి : 03 | సంచిక : 42 | గురువారం | నవంబర్ 12, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ

Vol.No : 03 | Issue No : 42 | Thursday | 12 November 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



కుల్గాంలో ఉగ్రవాదుల కాల్పులు..


- ముగ్గురు జవాన్లకు గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం
- ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాల గాలింపు

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లోని కుల్గాంలో ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ముగ్గురు సిఆర్‌పిఎఫ్ జవాన్లకు గాయాల య్యాయని అధికారులు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం కుల్గాం జిల్లాలోని ఒక తనిఖీ కేంద్రం వద్ద

- మిగతా 2లో..

అన్ని లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు వినియోగంలోకి రావాలి

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా రాష్ట్రంలో నిర్వీర్యమైన ఎత్తిపోతల పథకాలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించి జూన్ నాటికి వాటి ద్వారా నీరు విడుదల చేసేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఖరీఫ్‌కు పునరుద్ధరణ పరిధిలో ఉన్న 789 ఎత్తిపోతల పథకాల మరమ్మతులన్నీ ఎట్టిపరిస్థితుల్లోనూ పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో వాటి స్థితిగతులను పరిశీలించి, వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణ, నిర్వహణ, ఇరిగేషన్ భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు తదితర అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం క్యాంప్ కార్యాలయంలో సమీక్షించారు.



జలహారతి కార్పొరేషన్ ద్వారా ఎత్తిపోతల పథకాల పర్యవేక్షణ

- ప్రభుత్వం నిర్దేశించుకున్న 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులు 2.5 ఏళ్లలో పూర్తవ్వాలి
- 4,171 ఎకరాల్లో సోలార్ ప్లాంట్లు.. 903.1 మె.వా విద్యుత్ ఉత్పత్తికి అవకాశం
- ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ తరహాలో వాటర్ రెగ్యులేటరి కమిషన్
- సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

జలహారతి కార్పొరేషన్ ద్వారా నిరంతర పర్యవేక్షణ

రాష్ట్రంలో 789 ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు రూ.632.07 కోట్లు అవసరమవుతాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వీటి పునరుద్ధరణ ద్వారా 7.49 లక్షల ఎకరాలకు సమృద్ధిగా సాగునీటి సదుపాయం కల్పించవచ్చని తెలిపారు. ఇక ఎత్తిపోతల పథకాల నిర్వహణకు పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ఎత్తిపోతల పథకాల పర్యవేక్షణ బాధ్యతను జలహారతి కార్పొరేషన్ ద్వారా చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

2 లో



2024తో పోలిస్తే స్థానిక పోరులో వైసీపీ ఓటింగ్ శాతం పెరిగింది

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో పలు జిల్లాల నేతలతో జగన్ కీలక భేటీ స్థానిక సంస్థల ఎన్నికల్లో చంద్రబాబు ప్రభుత్వం తీవ్ర అక్రమాలకు పాల్పడిందని ఆరోపణ ఎన్నికల నిర్వహణలో సరికొత్త ఆవిష్కరణలు తీసుకొచ్చారంటూ వ్యంగ్యం

ప్రజాభూమి ప్రతినిధి,తాడేపల్లి : ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కూటమి ప్రభుత్వం తీవ్ర అక్రమాలకు పాల్పడిందని వైసీపీ అధినేత జగన్ ఆరోపించారు. ఎన్నికల అక్రమాల్లో చంద్రబాబు సరికొత్త ఆవిష్కరణలు తీసుకొచ్చారంటూ వ్యంగ్యం ప్రదర్శించారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో పలు జిల్లాలకు చెందిన పార్టీ నేతలతో జగన్ ఈరోజు సమావేశమయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగిన తీరు, ఫలితాలపై నేతలతో ఆయన చర్చించారు.ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ...

2 పేజీలో..

ఫుడ్ ప్రాసెసింగ్‌కు ఏపీలో అపారమైన అవకాశాలు

- మారిటైమ్ రంగంలోనూ యూఏఈతో కలిసి పనిచేసేందుకు సిద్ధం
- యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రితో సీఎం చంద్రబాబు భేటీ

2 పేజీలో..



ప్రపంచ అజెండా నుండి అదృశ్యమైన 'గ్లోబల్ వార్మింగ్'

- బ్రెజిల్ అధ్యక్షుడు లూలా

అంటాలియా : ప్రపంచ అజెండా నుండి గ్లోబల్ వార్మింగ్ అంశం అదృశ్యమైందని బ్రెజిల్ అధ్యక్షుడు లూలా ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ దేశాలు గ్లోబల్ వార్మింగ్‌పై చర్యలు చేపట్టకపోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

2 పేజీలో..



రతన్ టటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహిస్తున్నాం

- ఆవిష్కరణలకు మరింత ప్రోత్సాహాన్నిచ్చేలా వరల్డ్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఆర్గనైజేషన్ సహకారించాలి
- స్టార్టప్‌లకు మేధో సంపత్తి హక్కులపై WIPO ప్రతినిధులతో సీఎం చంద్రబాబు చర్చలు



ప్రజాభూమి ప్రతినిధి,విశాఖపట్నం: ఆవిష్కరణలు, పరిశోధన, సృజనాత్మకతకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడం, రాష్ట్రంలోని స్టార్టప్‌లు-పారిశ్రామికవేత్తలకు మేధో సంపత్తి హక్కులపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వరల్డ్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఆర్గనైజేషన్-డబ్ల్యూఐపీఓ డైరెక్టర్ జనరల్ డారెన్ టాంగ్‌తో సమావేశమయ్యారు.

2 లో



బంగాళాఖాతంలో అల్పపీడనం

ప్రజాభూమి ప్రతినిధి, తాడేపల్లి: దక్షిణ అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శుక్రవారం నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఇది శనివారానికి సుస్పష్టమైన అల్పపీడనంగా, ఆదివారానికి వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ, ఎండీ, ఆర్టీజీఎస్ సీఈవో ప్రభర్ జైన్ తెలిపారు. నివారం నుండి మంగళవారం వరకు సముద్రం అలజడిగా ఉంటుంది.

వివరాలు 2లో..

తెలంగాణ విద్యా వ్యవస్థలో భారీ మార్పులు..

వచ్చే ఏడాది నుంచే 10+2 విధానం!

- వచ్చే విద్యా సంవత్సరం నుంచే తెలంగాణలో 10o2 విధానం
- అమలుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు
- నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యకు ప్రాధాన్యం
- 12వ తరగతి నుంచే నైపుణ్య శిక్షణ
- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా మౌలిక వసతులు

ప్రజాభూమి ప్రతినిధి, తెలంగాణ : రాష్ట్ర విద్యా వ్యవస్థలో భారీ మార్పులకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచే పాఠశాల విద్యలో 10o2 విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఆధునిక అవసరాలకు అనుగుణంగా విద్యా విధానాన్ని మార్చడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.



మంగళవారం విద్యాశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో సీఎం పలు కీలక సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. సంస్కరణల అమలులో ఏ ఒక్క విద్యార్థికి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు పాఠశాల విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం పేర్కొన్నారు. 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉన్నత విద్యగా పరిగణించి విద్యార్థులకు ప్రత్యేక విద్య అందించాలని సూచించారు. విద్యార్థులకు 12వ తరగతి నుంచే నైపుణ్య శిక్షణ (స్కిల్లింగ్) అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని సీఎం స్పష్టం చేశారు.



ఏపీలో మిగిలిన 23 పురపాలికల ఎన్నికల షెడ్యూల్ నేడే విడుదల

- మధ్యాహ్నం 12:30 గంటలకు మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్
- 4 కార్పొరేషన్లు 15 మున్సిపాలిటీలు 4 నగర పంచాయతీలకు ఎన్నికలు
- షెడ్యూల్ ప్రకటించనున్న ఎస్ఈసీ అనిల్ చంద్ర పునీఠ
- హైకోర్టు చిక్కులు తొలగడంతో లైన్ క్లియర్

2 పేజీలో..

ఆంధ్రాలో నాన్-స్పైసీ అనే ఆప్షనే ఉండదు



- సీఐఐ సదస్సు వేళ నారా లోకేశ్ ఆసక్తికర పోస్ట్
- విశాఖలో 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు
- ఆంధ్రాలో నాన్-స్పైసీ అనే ఆప్షన్ లేదంటూ చమత్కారం
- స్పైసీ ఫుడ్ తో పాటు స్వీడీ అప్రూవల్స్ ఇస్తామని వెల్లడి

ప్రజాభూమి ప్రతినిధి, విశాఖపట్నం : విశాఖపట్నంలో రేపటి నుంచి జరగనున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు హాజరయ్యేందుకు విచ్చేసిన అంతర్జాతీయ ప్రతినిధులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ వినూత్న రీతిలో స్వాగతం పలికారు. గ్లోబల్ డెలిగేట్స్‌ను ఆహ్వానిస్తూ ఆయన సోషల్ మీడియా వేదికగా చేసిన ఓ ఆసక్తికర పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది.రాష్ట్ర ప్రత్యేకతను వివరిస్తూ మంత్రి లోకేశ్ తనదైన శైలిలో చమత్కరించారు. "ఆంధ్రాలో 'నాన్-స్పైసీ' అనేది మెనూలో ఆప్షన్ కాదు" అంటూ ఆంధ్రప్రదేశ్ ఆహారపు ఘాటును, విశిష్ట రుచులను విదేశీ ప్రతినిధులకు పరిచయం చేశారు.

4 లో..

ప్రజాభూమి
గురువారం, నవంబర్ 12, 2026

2024తో పోలిస్తే స్థానిక పోరులో

వైసీపీ ఓటింగ్ శాతం పెరిగింది

"చంద్రబాబు ప్రభుత్వం చేసిన అక్రమాలను ప్రజలంతా చూశారని, వాస్తవాలను ప్రజలు కూడా బాగా అర్థం చేసుకున్నారని" పేర్కొన్నారు. ఎన్నికలు ఏమాత్రం సజావుగా జరిగి ఉన్నా వైసీపీకి అనుకూలంగా ఇంకా భారీగా ఓటింగ్ శాతం నమోదయ్యేదని అన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి నామినేషన్లు, పోలింగ్, ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశలోనూ అడ్డంకులు సృష్టించి అక్రమాలకు తెగబడ్డారని ఆరోపించారు.అన్ని రకాల అవకతవకలు, దాడులు జరిగినప్పటికీ వైసీపీకి ప్రజా మద్దతు తగ్గలేదని జగన్ స్పష్టం చేశారు. "2024 ఎన్నికలతో పోలిస్తే వైసీపీ ఓటింగ్ శాతం పెరిగింది" అని ఆయన వెల్లడించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశలోనూ అరాచకాలు, అన్యాయాలు చోటుచేసుకున్నప్పటికీ పార్టీ ఓటింగ్ శాతం పెరగడం వైసీపీ పట్ల ప్రజల్లో ఉన్న ఆదరణకు స్పష్టమైన నిదర్శనమని జగన్ వ్యాఖ్యానించారు. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం శ్రమించిన నేతలు, కార్యకర్తలకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ప్రపంచ అజెండా నుండి అదృశ్యమైన 'గ్లోబల్ వార్మింగ్'

నాలుగవ సారి బ్రెజిల్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన లూలా బుధవారం టర్కీలో జరిగిన కాప్31 సదస్సులో వాతావరణ మార్పులపై మాట్లాడారు. ఈ ఏడాది ప్రారంభం నుండి, ప్రపంచ స్థాయి నేతల ప్రసంగాల నుండి పత్రాల నుండి 'పర్యావరణ మార్పులు' అనే అంశం మాయమైపోయిందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా గ్రీన్ హౌస్ వాయువులను అత్యధికంగా విడుదల చేసే దేశాలను ఒక్క చోట చేర్చే వేదికలైన జి7, జి20 సదస్సుల్లోనూ గ్లోబల్ వార్మింగ్‌పై చర్చ లేకుండా పోయిందని అన్నారు. భవిష్యత్ తరాల మనుగడ గురించి కాకుండా అత్యాధునిక ఆయుధాలు, టారిఫ్‌ల గురించి చర్చించుకుంటున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంధన పరివర్తనను కొందరు జాతీయ భద్రతకు, శ్రేయస్సుకు అడ్డంకిగా చూడటం మొదలుపెట్టారని లూలా అన్నారు. నేడు యుద్ధం, ద్రవ్యోల్బణం మన ముంగిట తడుతున్నప్పుడు, రేపటి వాతావరణ విపత్తు గురించి ఆలోచించడం మరింత కష్టమవుతుందని అన్నారు. కానీ, కరువులు, వరదలు, పెరుగుతున్న సముద్ర మట్టాలు ఇప్పటికే లక్షలాది మంది ప్రజలకు వాస్తవంగా మారినప్పుడు, ఆధిపత్య పోరాటాల దయాదాక్షిణ్యాల మీద ఈ అంశాన్ని వదలివేయలేమని అన్నారు. వీటో అధికారం, ధనబలం రాజకీయ ముఖచిత్రాన్ని మార్చగలవని, అదే సమయంలో బహుళపాక్షికత దౌత్యానికి ద్వారాలు తెరుస్తుందని లూలా అన్నారు. వాతావరణ సవాళ్లకు కొత్త పరిష్కారాలు కనుగొనడానికి రాజకీయ సంకల్పం అవసరమని ఆయన చెప్పారు. వాతావరణ సంక్షోభం అనేది ప్రజలకు అన్యాయం చేయడమేనని అన్నారు. దేశాల మధ్య అసమానతలు, అలాగే లింగ, జాతి వివక్షలు కొనసాగుతున్నాయని అన్నారు. ధనిక దేశాలు వనరులను ఉపయోగించుకోవడం ద్వారా అభివృద్ధి చెందాయని, ఇప్పుడు అవి తమ బాధ్యతలను నెరవేర్చాలని లూలా అన్నారు.

కుల్గాంలో ఉగ్రవాదుల కాల్పులు..

మోహరించిన భద్రతా బలగాలపై మోటార్ సైకిల్‌పై వచ్చిన దుండగులు కాల్పులు జరిపినట్లు సిఆర్‌పిఎఫ్ డిజి జి.పి.సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు.

కాల్పులు జరిపిన అనంతరం దుండగులు అక్కడినుండి పారిపోయారని అన్నారు. ఈ ఘటనలో ముగ్గురు జవాన్లు గాయపడ్డారని చెప్పారు. గాయపడిన సిబ్బందిని అనంతనాగ్ జిల్లాలోని ఆస్పత్రికి తరలించామని, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం, నిందితుల కోసం గాలింపు కొనసాగుతోందని అన్నారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం



మత్స్యకారులు ఆగ్నేయ, నైరుతి, మధ్య బంగాళాఖాతం వైపు వేటకు వెళ్లరాదని పేర్కొన్నారు. ప్రస్తుతానికి ఆంధ్రప్రదేశ్‌పై దీని ప్రభావం లేదని రానున్న రోజుల్లో ఇది ఏటు వైపు పయనిస్తుందనే అంశంపై స్పష్టత రానుందని ఆయన తెలిపారు.

ఆంధ్రాలో నాన్-స్పైసీ అనే ఆప్షనే ఉండదు

రాష్ట్రంలో ఆహారం ఎంత ఘాటుగా ఉంటుందో, వ్యాపార పెట్టుబడులకు ఇచ్చే అనుమతులు కూడా అంతే వేగంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు.రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, ప్రభుత్వ పనితీరును ప్రస్తావిస్తూ లోకేశ్ ఓ ఆకర్షణీయమైన నినాదాన్ని తెరపైకి తెచ్చారు. "స్పైసీ ఫుడ్.. స్పీడీ అప్రూవల్స్.. ఇదే ఆంధ్ర విధానం" అంటూ ప్రపంచ పారిశ్రామికవేత్తలకు బలమైన సందేశాన్ని పంపారు. అతిథి మర్యాదలతో పాటు పరిశ్రమల ఏర్పాటుకు అత్యంత వేగంగా అనుమతులు మంజూరు చేస్తామనే స్పష్టమైన భరోసాను ఆయన కల్పించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందనే విషయాన్ని స్పష్టం చేస్తూ మంత్రి చేసిన ఈ ట్వీట్ అందరినీ ఆకట్టుకుంటోంది.



అన్ని లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు వినియోగంలోకి రావాలి

ఇందుకోసం కార్పొరేషన్‌లో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైతే ప్రతి జిల్లాకు ఒక చీఫ్ ఇంజినీర్ లేదంటే సూపరింటెండింగ్ ఇంజినీర్‌ను నియమించి పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. మరమ్మతుల కోసం అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలన పూర్తి చేసిన వెంటనే టెండర్లు పిలవాలని, ఆలస్యం చేయకుండా పనులు ప్రారంభించాలని సీఎం సూచించారు. వచ్చే జూన్ నాటికి అన్ని ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణ పనులు పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎం స్పష్టం చేశారు.

ఇరిగేషన్ భూముల్లో 903.1 మెగావాట్ల సౌర విద్యుత్

జలవనరుల శాఖ పరిధిలో అందుబాటులో ఉన్న 5,565 ఎకరాల భూమిలో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు 4,061 ఎకరాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. వీటి ద్వారా 877.3 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని వివరించారు. ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పరిధిలో 84 ప్రాంతాలను గుర్తించగా, వాటిలో 110 ఎకరాలను సౌర విద్యుత్ ప్లాంట్లకు వినియోగించుకోవచ్చని అధికారులు తెలిపారు. దీని ద్వారా 25.8 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉందని తెలిపారు. మొత్తంగా 4,171 ఎకరాల భూమిని సౌర విద్యుత్ ప్లాంట్లకు వినియోగించడం ద్వారా 903.1 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని అధికారులు వివరించారు. కేవలం భూములకే పరిమితం కాకుండా కాలువలపై కూడా సౌర విద్యుత్, జలవిద్యుత్ ఉత్పత్తి అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. సాగు సీజన్‌లో ఎత్తిపోతల పథకాలకు నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా ప్రణాళిక రూపొందించడంతో పాటు మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు సరఫరా చేయడం ద్వారా ఆదాయం పొందే విధానాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. రవాణా, విద్యుత్ ఉత్పత్తి, సౌర విద్యుత్, వ్యవసాయ రంగాలను అనుసంధానం చేయడం ద్వారా సంపద సృష్టికి అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటుపై అధ్యయనం

ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ తరహాలోనే జలవనరుల రంగంలోనూ వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. పోర్టులు, విద్యుత్ రంగాల్లో ఉన్న విధంగానే సాగునీటి రంగంలోనూ నియంత్రణ వ్యవస్థను తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. గంగా-కావేరి అనుసంధానం వంటి భారీ ప్రాజెక్టుల ద్వారా రవాణా, విద్యుత్, పరిశ్రమలు, వ్యవసాయ రంగాలకు నీటి వనరులను అందుబాటులోకి తీసుకురావచ్చని, ఆయా రంగాలకు నీటి వినియోగంపై రెగ్యులేటరీ కమిషన్ నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని సీఎం అన్నారు.

నిధులకు కొరత రానివ్వను... ప్రాజెక్టులు పూర్తవ్వాలి

ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మంగా తీసుకున్న 36 సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన నిధులను వెంటనే విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేసిన సీఎం... నిర్దేశించుకున్న గడువులోగా పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. వచ్చే రెండున్నరేళ్లలో ప్రభుత్వం నిర్దేశించుకున్న 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు.

ఫుడ్ ప్రాసెసింగ్‌కు ఏపీలో అపారమైన అవకాశాలు

ప్రజాభూమి ప్రతినిధి,విశాఖపట్నం: రాష్ట్రంలోని ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులు పెట్టాలని దుబాయ్-యూఏఈలకు చెందిన వివిధ ప్రముఖ కంపెనీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆహ్వానించారు. సీఐఐ సదస్సులో పాల్గొనేందుకు విశాఖ వచ్చిన యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. రాయలసీమకు చెందిన ఫలాలు ఇప్పటికే విదేశాలకు ఎగుమతి అవుతున్నాయని సీఎం చంద్రబాబు తౌక్ అల్ మర్రీ దృష్టికి తెచ్చారు. రూ.1 లక్ష కోట్లతో రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నట్టు వివరించారు. యూఏఈ ఏర్పాటు చేయనున్న ఫుడ్ క్లస్టర్‌లో ఆ దేశానికి చెందిన అగ్రిఫుడ్ కంపెనీ సిలాల్‌ను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. రాష్ట్రంలోని ఏపీ, వ్యవసాయ, ఆహార ఉత్పత్తుల సేకరణ, ప్రాసెసింగ్, ఎగుమతుల రంగాల్లో పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు. చిత్తూరు జిల్లాలో దుబాయికి చెందిన ఫ్లోర్‌మాస్టర్ పరిశ్రమ గ్రౌండింగ్ విషయం కూడా ఇరువురి మధ్య ప్రస్తావనకు వచ్చింది. ఫుడ్ క్లస్టర్ లో త్వరితగతిన నిర్ణయం తీసుకునేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు యూఏఈ



మంత్రి తౌక్ మర్రిని కోరారు. అలాగే మారిటైమ్, ఏరో స్పేస్, డిఫెన్స్ సహా వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. యూఏఈతో కలిసి పనిచేసేందుకు ఏపీ సిద్ధంగా ఉంటుందని ముఖ్యమంత్రి తెలిపారు.

భోగాపురం విమానాశ్రయం అద్భుతంగా ఉంది: యూఏఈ మంత్రి : ఏపీలో నూతనంగా నిర్మించిన భోగాపురం విమానాశ్రయం అద్భుతంగా ఉందని యుఏఈ మంత్రి అబ్దుల్లా బిన్ అల్ తౌక్ మర్రి ముఖ్యమంత్రితో అన్నారు. సుందరమైన విమానాశ్రయాన్ని ఏపీలో నిర్మించిన సీఎం చంద్రబాబుకు అభినందనలు తెలిపారు. భారత తూర్పు తీరంలో పెట్టుబడులు పెట్టేందుకు యూఏఈ ఆసక్తిగా ఉందని.. తమ దేశ పెట్టుబడులకు ఏపీ కీలక ప్రాంతం అవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఏపీకి బ్లూచిప్ కంపెనీలు, గూగుల్ లాంటి డేటా సెంటర్లు రావటం శుభపరిణామం అని అన్నారు. పెట్టుబడులను రాబట్టే విషయంలో ఏపీకి ఉన్న సామర్థ్యం ఏమిటో తెలుస్తోందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి రొయ్యలతో పాటు ఇతర ఆక్వా ఉత్పత్తుల దిగుమతులపై ఆలోచన చేస్తున్నట్టు యూఏఈ ప్రతినిధి బృందం తెలిపింది. ఏపీలో పెట్టనున్న ఫుడ్ క్లస్టర్ లో పెట్టుబడులు పెట్టేందుకు యూఏఈకి చెందిన మరో 12 కంపెనీలు ఆసక్తిగా ఉన్నాయని సీఎంకు వివరించారు. ఈ భేటీలో యూఏఈకి చెందిన అధికారులు, కంపెనీల ప్రతినిధులు, ఏపీ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

రతన్ టటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా

స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహిస్తున్నాం

గురువారం నుంచి రెండు రోజుల పాటు సీఐఐ భాగస్వామ్య సదస్సులో జరగనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖ చేరుకున్నారు. నోవోటెల్ హోటల్లో వరుస సమావేశాలు నిర్వహించారు. దీంట్లో భాగంగా సీఎం చంద్రబాబు ఔస్రూ డీజీతో భేటీ అయ్యారు. ఔస్రూ--ఆంధ్రప్రదేశ్ అకాడమీ ఏర్పాటు, భాగస్వామ్య కార్యక్రమం ద్వారా విద్యార్థులు, పరిశోధకులు, స్టార్టప్ వ్యవస్థాపకులు, సూక్ష్మ-చిన్న-మధ్యతరహా పరిశ్రమలకు మేధో సంపత్తి హక్కులు (ఖూ=), పేటెంట్లు, ట్రేడ్‌మార్క్‌లు, డిజైన్లు, సాంకేతిక పరిజ్ఞాన పరిరక్షణపై శిక్షణ అందించే అవకాశాలను చర్చించారు. రాష్ట్రంలోని చేనేత, హస్తకళలు, స్థానిక ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపు (+× ఘస్త్ర) సాధించడం, ఇప్పటికే గుర్తింపు పొందిన ఉత్పత్తుల మార్కెట్ విస్తరణ, వాటి నాణ్యత-బ్రాండింగ్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే అంశాలపై ఔస్రూ సహకారాన్ని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రంలో స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహించేందుకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా యువతకు సహకరిస్తున్నామని తెలిపారు. స్టార్టప్ కంపెనీలకు మరింత ప్రోత్సాహాన్నిచ్చేలా... రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని ఔస్రూ ప్రతినిధులను సీఎం చంద్రబాబు ఆహ్వానించారు.



స్టార్టప్ ఎకోసిస్టమ్ బలోపేతమే లక్ష్యం

ఔస్రూ డైరెక్టర్ జనరల్ డారెన్ టాంగ్‌తో భేటీ సందర్భంగా రాష్ట్రంలో అమలు చేస్తున్న వివిధ పాలసీల గురించి చర్చించారు. ముఖ్యంగా స్టార్టప్ ఎకో సిస్టం బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చేపడుతున్న విధానాలను వివరించారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి కోసం సదస్సులు అద్భుతంగా నిర్వహిస్తున్నారని డారెన్ టాంగ్ చంద్రబాబుతో అన్నారు. అనేక రంగాల్లో ప్రముఖులను, ప్రముఖ సంస్థలను ఒకే వేదికపైకి తీసుకురావడం మంచి పరిణామమని...

దీని వల్ల వివిధ రంగాలకు సంబంధించిన అంశాలపై అందరికీ అవగాహన కలుగుతుందని అభిప్రాయపడ్డారు. తాము ఇప్పటికే ఏపీలో జరుగుతున్న వివిధ కార్యక్రమాల గురించి విన్నామని... క్వాంటం టెక్నాలజీని ప్రోత్సహించడంలో ఏపీ ముందు వరుసలో ఉందని... అమరావతి క్వాంటం గురించి కూడా తమకు అవగాహన ఉందని డారెన్ టాంగ్ ముఖ్యమంత్రి దగ్గర ప్రస్తావించారు. ఏపీని మూడు రీజియన్లుగా అభివృద్ధి చేసేలా కార్యాచరణ చేపట్టినట్టు సీఎం చంద్రబాబు డారెన్ టాంగ్‌కు వివరించారు. క్వాంటం, ఏఐ వంటి టెక్నాలజీలను అందిపుచ్చుకునేలా ఏపీ యువతను సిద్ధం చేస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. ప్రైవేటు రంగంతో పాటు.. పాలనలో కూడా టెక్నాలజీని వినియోగించడం ద్వారా ప్రగతి సాధించడంతోపాటు... ప్రభుత్వ సేవలు ప్రజలకు సులభతరంగా అందించేలా చేస్తున్నామన్నారు. గ్రీన్ ఎనర్జీ, స్పేస్ టెక్నాలజీ, క్వాంటం, నాచురల్ ఫార్మింగ్ సహా అనేక రంగాల్లో ఏపీలో పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయని సీఎం తెలిపారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని... 10 లక్షల మంది మహిళలను వ్యాపార వేత్తలుగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. స్థానికంగా మహిళలు తీర్చిదిద్దే ఉత్పత్తులకు స్వయం ఏపీ పేరుతో బ్రాండింగ్ చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. మహిళా సాధికారత కోసం తాము అమలు చేసే విధానాల్లో ఔస్రూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో ఔస్రూ ప్రతినిధుల, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఏపీలో మిగిలిన 23 పురపాలికల

ఎన్నికల షెడ్యూల్ నేడే విడుదల

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో గతంలో వాయిదా పడిన 23 పట్టణ స్థానిక సంస్థలకు (యూఎల్‌బీ) ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) పూర్తిస్థాయిలో సన్నద్ధమైంది. గురువారం (నవంబరు 12) మధ్యాహ్నం 12:30 గంటలకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అధికారికంగా ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించనున్నారు. దీంతో రాష్ట్రంలోని పలు కీలక నగరాలు, పట్టణాల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి రానుంది.

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థలు ఉండగా, వాటిలో 100 సంస్థలకు ఇప్పటికే ఎన్నికల ప్రక్రియ పూర్తయింది. మిగిలిన 4 కార్పొరేషన్లు, 15 మున్సిపాలిటీలు, 4 నగర పంచాయతీలకు సంబంధించి హైకోర్టులో కేసులు పెండింగ్‌లో ఉండటంతో అక్టోబర్ 14న విడుదల చేసిన సాధారణ నోటిఫికేషన్‌లో వీటికి చోటు దక్కలేదు. ప్రస్తుతం వీటికి సంబంధించిన న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోవడం, వార్డుల పునర్విభజన మరియు రిజర్వేషన్ల ప్రక్రియను ప్రభుత్వం పూర్తి చేయడంతో ఎస్ఈసీ ఎన్నికల ప్రక్రియను ప్రారంభించనుంది.

నాలుగు కార్పొరేషన్ల రిజర్వేషన్ల వివరాలు

ఎన్నికలు జరగనున్న నాలుగు ప్రధాన కార్పొరేషన్లలో మొత్తం 260 డివిజన్లు ఉన్నాయి. వీటిలో బీసీలకు 90, ఎస్సీలకు 35, ఎస్టీలకు 5, జనరల్ మహిళలకు 68, ఓపెన్ కేటగిరీకి 62 డివిజన్లు కేటాయించారు.

మేయర్ పదవుల రిజర్వేషన్లను పరిశీలిస్తే:

- శ్రీకాకుళం: బీసీ మహిళ (బీసీ జనరల్)
- కాకినాడ: బీసీ మహిళ
- రాజమహేంద్రవరం: ఎస్సీ (జనరల్)
- మంగళగిరి--తాడేపల్లి : ఎస్టీ

ఈ నాలుగు కార్పొరేషన్లతో పాటు మిగిలిన 19 పురపాలక సంస్థల పరిధిలో మొత్తం 749 వార్డులు ఉండగా, వాటిలో 174 వార్డులను ఓపెన్ కేటగిరీ కింద ఖరారు చేశారు.

ఎన్నికలు జరగనున్న పట్టణ సంస్థల జాబితా (ప్రాంతాల వారీగా):

ఉత్తరాంధ్ర: శ్రీకాకుళం కార్పొరేషన్ (60 డివిజన్లు), అమదాలవలస మున్సిపాలిటీ (శ్రీకాకుళం జిల్లా), రాజాం మున్సిపాలిటీ (విజయనగరం జిల్లా).

గోదావరి - ఏలూరు పరిధి: కాకినాడ కార్పొరేషన్ (66 డివిజన్లు), రాజమహేంద్రవరం కార్పొరేషన్ (72 డివిజన్లు), పాలకొల్లు, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు మున్సిపాలిటీలు (పశ్చిమ గోదావరి జిల్లా), చింతలపూడి నగర పంచాయతీ (ఏలూరు జిల్లా).

కృష్ణా - గుంటూరు - పల్నాడు పరిధి: మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ (62 డివిజన్లు), పొన్నూరు మున్సిపాలిటీ (గుంటూరు జిల్లా), గుడివాడ మున్సిపాలిటీ (కృష్ణా జిల్లా), వైఎస్ఆర్ తాడిగడప మున్సిపాలిటీ (ఎన్టీఆర్ జిల్లా), నరసరావుపేట మున్సిపాలిటీ (పల్నాడు జిల్లా), బాపట్ల మున్సిపాలిటీ (బాపట్ల జిల్లా). ప్రకాశం - నెల్లూరు పరిధి: కందుకూరు మున్సిపాలిటీ, పొదిలి నగర పంచాయతీ (ప్రకాశం జిల్లా), కావలి మున్సిపాలిటీ, అల్లూరు నగర పంచాయతీ (ఎస్పీఎస్ నెల్లూరు జిల్లా).

రాయలసీమ పరిధి: గూడూరు, శ్రీకాళహస్తి మున్సిపాలిటీలు (తిరుపతి జిల్లా), బి. కొత్తకోట నగర పంచాయతీ (అన్నమయ్య జిల్లా).



ఎన్నికల కమిషనర్ నిర్వహించే మీడియా సమావేశంలో నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ గడువులతో పాటు పోలింగ్, కౌంటింగ్ తేదీల వివరాలు అధికారికంగా వెల్లడి కానున్నాయి. దీర్ఘకాలంగా పాలకవర్గాలు లేని ఈ పురపాలక సంఘాల్లో ఎన్నికల ప్రకటన వెలువడనుండటంతో స్థానికంగా రాజకీయ సందడి మొదలైంది.

యువతలో నాయకత్వ లక్షణాలు, విశాల దృక్పథాన్ని పెంపొందించేందుకు

యూత్ పార్లమెంట్ పోటీలు దోహదం

పోటీల్లో పాల్గొనడమే విద్యార్థులకు గొప్ప అభ్యాస అనుభవం

విద్యార్థులకు దిశానిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః
భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ – 2027 కార్యక్రమంలో భాగంగా యూత్ పార్లమెంట్ పోటీలు – 2027 నిర్వహణకు కృష్ణా జిల్లాలో ఎలక్యూషన్ కాంపిటీషన్ ఏర్పాట్లు చేపట్టారు. ఈ పోటీల్లో భాగంగా జిల్లాలోని వివిధ కళాశాలలకు చెందిన 18 నుంచి 25 సంవత్సరాల వయస్సు గల దాదాపు 50 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొననున్నారు.ఈ సందర్భంగా పోటీలకు ముందు విద్యార్థులను ఉద్దేశించి నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ, ఇలాంటి పోటీల్లో పాల్గొనడమే విద్యార్థి దశలో ఒక గొప్ప అభ్యాస అనుభవమని పేర్కొన్నారు.

పుస్తకాలు, విద్యా సంబంధిత అంశాల ద్వారా పొందే అకాడమిక్ పరిజ్ఞానం మాత్రమే నేటి పోటీ ప్రపంచంలో ఉద్యోగ అవకాశాలను సాధించేందుకు సరిపోదని, దానికి అనుబంధంగా క్షేత్రస్థాయి అనుభవం, ఆచరణాత్మక పరిజ్ఞానం, వివిధ అంశాలపై అవగాహన ఎంతో అవసరమని తెలిపారు. విద్యార్థులు ఇలాంటి పోటీల్లో చురుకుగా పాల్గొనడం ద్వారా తమ ఆలోచనా పరిధిని విస్తరించుకోవడంతో పాటు, విశాల దృక్పథం, విశ్లేషణాత్మక ఆలోచన, విషయ పరిజ్ఞానం, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవచ్చని వివరించారు. పోటీల్లో గెలుపోటముల కంటే పాల్గొనడం ద్వారా పొందే అనుభవం, నేర్చుకునే విషయాలే భవిష్యత్తులో మరింతగా ఉపయోగపడతాయని సూచించారు.ప్రస్తుతం మనం డేటా ఆధారిత సమాజంలో జీవిస్తున్నామని, సమాచార సాంకేతికత అభివృద్ధి కారణంగా ప్రపంచవ్యాప్తంగా అనేక రకాల సమాచారం ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి వచ్చిందని కలెక్టర్ పేర్కొన్నారు. అయితే అందుబాటులో ఉన్న సమాచారాన్ని యథాతథంగా స్వీకరించడం కాకుండా, మనకు అవసరమైన సమాచారాన్ని గుర్తించి, సరైన రీతిలో విశ్లేషించి, లక్ష్య సాధనకు ఉపయోగించుకోవడం నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ లక్ష్యాలను ముందుగానే నిర్దేశించుకుని, వాటిని సాధించేందుకు అవసరమైన నైపుణ్యాలను గుర్తించి, ఒక క్రమబద్ధమైన ప్రణాళికతో ముందుకు సాగాలని తెలిపారు. ప్రస్తుతం చాట్‌జీపీటీ, క్లాడ్, జెమినీ వంటి కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత సాంకేతిక వేదికలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా అవసరమైన సమాచారాన్ని సేకరించడం, అంశాలను విశ్లేషించడం, తమ ఆలోచనలకు స్పష్టమైన రూపం ఇవ్వడం సాధ్యమవుతుందని వివరించారు. అయితే ఏఐ సాధనాలను ఉపయోగించేటప్పుడు సరైన ప్రశ్నలు అడగడం (ప్రాంప్టింగ్), అవసరాలకు అనుగుణంగా సమాచారాన్ని పొందడం, దానిని విశ్లేషించి సరైన నిర్ణయాలు తీసుకోవడం వంటి నైపుణ్యాలను అలవర్చుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ, ఇలాంటి పోటీలు, క్షేత్రస్థాయి అనుభవాల ద్వారా తమ సామర్థ్యాలను పెంపొందించుకుంటే భవిష్యత్తులో ఉద్యోగ, వృత్తి జీవితాల్లో ఎంతో ప్రయోజనం కలుగుతుందని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.ఈ యూత్ పార్లమెంట్ పోటీల్లో పాల్గొనే దాదాపు 50 మంది విద్యార్థుల్లో ప్రతిభ కనబరిచిన ముగ్గురిని ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కృష్ణా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ కె. రాంజీ, రిజిస్ట్రార్ డాక్టర్ ఉషా, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రావణి, జిల్లా ఎస్ఎస్ఎన్ కోఆర్డినేటర్, ఇతర అధ్యాపకులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



భారతరత్న మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ ఆశయాలు, విద్యా సేవలు చిరస్మరణీయం

జాతీయ సమైక్యత, విద్యాభివృద్ధికి ఆయన చేసిన కృషి ఆదర్శనీయం

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకల్లో నివాళులర్పించిన జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:
భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను బుధవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ మాట్లాడుతూ, భారత స్వాతంత్ర్య సమరయోధుడిగా, స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి విశేష సేవలందించారని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన పోరాటం, జాతీయ సమైక్యత కోసం చూపిన నిబద్ధత చిరస్మరణీయమని తెలిపారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ప్రజలందరూ ఐకమత్యంతో జీవించాలన్న ఆయన సందేశం నేటికీ ఎంతో ప్రాసంగికమని పేర్కొన్నారు. విద్య ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమని విశ్వసించిన మౌలానా ఆజాద్, దేశంలో విద్యా రంగ అభివృద్ధికి పునాదులు వేశారని తెలిపారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ఆయన చేసిన కృషి భావితరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని విద్యాభివృద్ధికి, సామాజిక సమానత్వానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మన్నం నరసింహం, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ ఎన్.అరవింద్, సీనియర్ అసిస్టెంట్ ఎం.మణికుమార్, జూనియర్ అసిస్టెంట్ జి.నిర్మల కుమారి, సిబ్బంది ఎస్.దివ్య, అబ్దుల్ రహీమాన్, ఉర్దూ అకాడమీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మౌలానా అబ్దు ల్ కలాం ఆజాద్ జయంతి

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః
స్వాతంత్య్ర సమరయోధులు, స్వతంత్ర భారత తొలి విద్యా శాఖ మంత్రి జనాబ్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతిని పురస్కరించుకొని, మచిలీపట్నం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్, కార్పొరేటర్ హసీం బేగ్ మాట్లాడుతూ, "మౌలానా అబుల్ కలాం ఆజాద్ కేవలం ఒక స్వాతంత్య్ర సమరయోధులు మాత్రమే కాదు, ఈ దేశ భవిష్యత్తుకు పునాదులు వేసిన దార్శనికుడు. దేశం స్వాతంత్య్రం కోసం పోరాడుతున్న సమయంలోనే, చదువు లేకుండా స్వాతంత్ర్యానికి అర్థం ఉండదని ఆయన గ్రహించారు" అని అన్నారు."హిందూ ముస్లిం ఐక్యత కోసం ఆయన జీవితాంతం కృషి చేశారు. దేశ విభజనను చివరి వరకు వ్యతిరేకించిన నాయకుల్లో ఆయన ఒకరు. స్వతంత్ర భారత తొలి విద్యా శాఖ మంత్రిగా ఆయన పునాది వేసిన విద్యా వ్యవస్థే నేడు మనం చూస్తున్న ఐఐటీలు, యూజీసీ, సాహిత్య అకాడమీ వంటి సంస్థలకు మార్గం చూపింది. ఉచిత ప్రాథమిక విద్య అందరికీ అందాలన్నది ఆయన కల" అని హసీం బేగ్ గుర్తు చేశారు."ఆయన గొప్ప పండితుడు, రచయిత, పాత్రికేయుడు కూడా. 'అల్-హిలాల్' పత్రిక ద్వారా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం రగిలించారు. చిన్న వయసులోనే కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన ఆయన, దేశ సేవ కోసం తన జీవితాన్ని అంకితం చేశారు. ఆయన సేవలకు గుర్తింపుగా 1992లో మరణానంతరం దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' లభించింది" అని ఆయన తెలిపారు."ఆయన జయంతిని దేశవ్యాప్తంగా జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకోవడం ఆయనకు మనం ఇచ్చే నిజమైన గౌరవం. నేటి యువత, ముఖ్యంగా మైనార్టీ వర్గాల విద్యార్థులు ఆయన స్ఫూర్తితో చదువుకు ప్రాధాన్యం ఇచ్చి, సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలి. ఆ దిశగా మన ప్రభుత్వం మైనార్టీల అభ్యున్నతికి కట్టుబడి ఉంది" అని హసీం బేగ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు వెంకటస్వామి, సయ్యద్ ఖాజా, ఇలియాస్ పాషా, గనిపిశెట్టి గోపాల్, సలీం, ఖలీల్, ఫహీమ్, మౌలాలి, గున్నం నాగబాబుతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎస్పీ కార్యాలయంలో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి





ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః
మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని బుధవారం కృష్ణా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) వి.వి. నాయుడు, అడిషనల్ ఎస్పీ (ఏఆర్) బి.చంద్ర శేఖర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ భారత స్వాతంత్ర్య సమరంలో కీలక పాత్ర పోషించిన మహనీయుడని, స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా దేశ విద్యారంగ అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. విద్య ద్వారానే సమాజంలో సమానత్వం, సామాజిక చైతన్యం, అభివృద్ధి సాధ్యమవుతాయని విశ్వసించిన ఆయన ఆశయాలు నేటికీ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.దేశ ఐక్యత, సమగ్రత, మతసామరస్యం, విద్యా వికాసం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, భావితరాలకు ఆయన జీవితం, ఆశయాలు మార్గదర్శకంగా నిలుస్తాయని ఈ సందర్భంగా స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో సత్తా చాటిన విద్యార్థినికి మంత్రి కొల్లు, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల అభినందనలు

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః
25వ నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్–2026 పోటీల్లో ప్రథమ బహుమతి సాధించి మచిలీపట్నం ఖ్యాతి నిచాటిన నిర్మల పాఠశాల విద్యార్థిని చిన్నం నవరత్న



జ్యోతిని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు ఘనంగా సత్కరించి అభినందించారు.మచిలీపట్నంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆరో తరగతి 'ఏ' సెక్షన్‌లో చదువుతున్న నవరత్న జ్యోతిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. చిన్నం నాగేంద్ర వరప్రసాద్ మనవరాలైన నవరత్న జ్యోతి సాధించిన విజయంపై వారు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. గత ఆరేళ్లుగా కరాటే పోటీల్లో పాల్గొంటూ పది మందికి పైగా పతకాలు, గోల్డ్ మెడల్స్ సాధించడం సామాన్యమైన విషయం కాదన్నారు. చిన్న వయసులోనే క్రీడల పట్ల ఆసక్తి, పట్టుదలతో ఈ స్థాయి విజయాలు సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి మచిలీపట్నం పేరును దశదిశలా వ్యాప్తి చేయాలని ఆకాంక్షించారు.ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. అతి చిన్న వయసులోనే కరాటేపై మక్కువ పెంచుకుని పది మందికి పైగా పతకాలు సాధించడం ఎంతో అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించి మచిలీపట్నానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం నవరత్న జ్యోతికి శిక్షణ అందిస్తున్న కరాటే మాస్టర్ వెంకటేశ్వరరావుతో పాటు నిర్మల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులను మంత్రి కొల్లు రవీంద్ర ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో గొపు సత్యనారాయణ, ఎన్టీఆర్ చారిటబుల్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నం వెంకటేశ్వరరావు, సొసైటీ కోశాధికారి చింత శ్రీనివాసరావు, మట్ట అశోక్, బచ్చుల బోసు, వాటపల్లి రమేష్, కాగిత వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచే నాని, లంకె శేషగిరిరావు, బలగం విజయశేఖర్, కరాటే మాస్టర్ వెంకటేశ్వరరావు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా అంకాలమ్మ ప్రతిష్టా మహోత్సవం

ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, మండలి వెంకట్రామ్

ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ
నాగాయలంక మండలం పేర్లవానిలంక 6వ వార్డులో నూతనంగా నిర్మించిన శ్రీ అంకాలమ్మ దేవత దేవాలయ ప్రతిష్ట మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. కమిటీ పెద్దల ఆహ్వానం మేరకు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, జనసేన పార్టీ నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ నూతన దేవాలయ ప్రతిష్ట మహోత్సవానికి విచ్చేశారు. వారికి కమిటీ పెద్దలు ఘనంగా స్వాగతం పలికారు. వేద ఘోష నడుమ నూతన ఆలయంలో ప్రతిష్ట కావింపబడిన శ్రీ అంకాలమ్మ దేవత అమ్మవారి నూతన విగ్రహాన్ని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, వెంకట్రామ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో నాగాయలంక మండల ప్రముఖులు, వందలాదిగా భక్తులు పాల్గొన్నారు.





అబ్దుల్‌కలామ్ ఆజాద్‌కు ఘన నివాళి

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః
భారతరత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి సందర్భంగా కృష్ణాజిల్లా కలెక్టరేట్లో బుధవారం పీజీఆర్ఎస్ హాల్ నందు అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ డికే బాలాజీ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

మేయర్ దృష్టికి నగర పార్కు సమస్యలు.. వాకర్స్ అసోసియేషన్ వినతి



పార్కు అభివృద్ధికి తక్షణ చర్యలు తీసుకుంటామని మేయర్ అబ్దుల్ అబీద హామీ

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః
నగర ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతూ, ఆరోగ్య పరిరక్షణకు వేదికగా నిలవాల్సిన మాచర్ల వెంకటస్వామి నాయుడు మున్సిపల్ పార్కు ప్రస్తుతం పలు సమస్యలతో సతమతమవుతోంది. పార్కులో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, పూర్వ వైభవాన్ని తీసుకురావాలని వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆమె నివాసంలో బుధవారం మచిలీపట్నం నగర మేయర్ అబ్దుల్ అబీద దృష్టికి తీసుకెళ్లారు.ప్రతిరోజూ వందలాది మంది ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ కోసం పార్కును వినియోగించుకుంటున్నారని, అయితే వాకింగ్ ట్రాక్ పూర్తిగా దెబ్బతినడంతో నడక సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు వివరించారు. ఇటీవల తుఫాను ప్రభావంతో వేలాది మొక్కలు నేలకొరిగి పార్కు సౌందర్యం దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు, చిన్నారులతో కలిసి ఆహ్లాదంగా గడిపేందుకు వచ్చే ప్రజలకు సైతం ఇబ్బందులు తప్పడం లేదని తెలిపారు. పార్కులో సిబ్బంది కొరతను అధిగమించి, మొక్కల సంరక్షణకు తగినంత మంది మున్సిపల్ సిబ్బందిని నియమించాలని కోరారు. అలాగే వ్యాయామం, శారీరక దృఢత్వం కోసం ఏర్పాటు చేసిన జిమ్‌లో నిపుణులైన శిక్షకులను (ట్రైనర్లను) నియమించాలని విజ్ఞప్తి చేశారు. పార్కు నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపకపోవడంతో ఆహ్లాదకరమైన వాతావరణం క్రమంగా కనుమరుగవుతోందని కార్పొరేటర్ హసీం బేగ్‌కు వివరించారు.వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలపై మేయర్ అబ్దుల్ అబీద సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో తక్షణమే మాట్లాడి, పార్కులో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏ. వెంకటేశ్వరరావు సామాజిక కార్యకర్త చందమామ బాబు, ఎం. బ్రహ్మం, పి. నాగయ్య, కొల్లు సాయి మోహన్, పి. ధర్మరాజు, ఎస్ కే ఖన్, రాజా, ఏ. అర్జున రావు, శ్రీనివాసరావు, ఎన్. సుబ్రహ్మణ్యం, ప్రసాద్, రాఘవేంద్రరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

యువ నాయకత్వం నిజాయితీతో ఎదగాలి

మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు బాలాజీ



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః
ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో ఎక్కువ మంది యువకులు ఎంపిక కావడం ఆనందదాయకమని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ అన్నారు. బుధవారం మచిలీపట్నం సౌత్ మండలం కూటమి ఎంపీపి అభ్యర్థి తాళ్లపాలెం సెగ్మెంట్ ఎంపీటీసీ కూనపురెడ్డి ప్రసాదును, గూడూరు మండలం పోసినవారి పాలెం ఎంపీటీసీ మెంబర్ గా ఎంపికైన పేరే చిన్నస్వామిని బాలాజీ అభినందించారు.సాఫ్ట్‌వేర్ కంపెనీ సీఈఓ గా ఉండి పవన్ కళ్యాణ్ కటౌట్ తో తాళ్లపాలెం సెగ్మెంట్లో అతి తక్కువ కాలంలో మంచి మెజార్టీతో కూనపరెడ్డి ప్రసాద్ ఎన్నిక కావడం యువతకు ఆదర్శప్రాయం అని బాలాజీ అన్నారు. విద్యావంతులు రాజకీయ రంగంలోకి రావాలని అవినీతి ప్రక్షాళన జరగాలని బాలాజీ అన్నారు. ఓటర్లలో కూడా మార్పు రావాలని నోటుకు ఓటు అమ్ముకునే పద్ధతికి స్వస్తి పలికినప్పుడే నిజాయితీగల నాయకత్వం పైకి వస్తుందని బాలాజీ అన్నారు. నూతనంగా ఎంపికైన అభ్యర్థులు మున్సిపల్ చట్టాలు, పంచాయతీ చట్టాలు పట్ల అవగాహన పెంచుకోవాలని బాలాజీ సూచించారు. గెలిచిన ప్రతి అభ్యర్థి తన యొక్క హక్కులను బాధ్యతలను తెలుసుకొని తమ పదవికే వన్నె తీసుకురావాలని బాలాజీ అన్నారు. పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో ఐటీ టీమ్ సహకారంతో ఎంపీ బాలశౌరి, మంత్రి కొల్లు రవీంద్ర,జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ,మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు సంపూర్ణ సహకారాలతో ఎంపీటీసీగా పనిచేసే అవకాశం దక్కిందని కూన పరెడ్డి ప్రసాద్ అన్నారు. తన పదవి కాలంలో మచిలీపట్నం సౌత్ మండలం అభివృద్ధి కొరకు నిజాయితీతో పని చేస్తానని అన్నారు.

గోపు సత్యనారాయణ దంపతులకు ఘన సన్మానం



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః
ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి తరపున విజయం సాధించిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులందరూ బుధవారం ఉదయం కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణని ఆయన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎన్నికల్లో విజయం సాధించిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ విజేతలందరూ గోపు సత్యనారాయణకి, వారి సతీమణికి ఘనంగా శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు.అనంతరం గోపు సత్యనారాయణ విజయం సాధించిన అభ్యర్థులందరికీ అభినందనలు తెలియజేస్తూ, ప్రజలు తమ పై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాకర భవాని – కాకర కాంతారావు, ఎర్రంశెట్టి నాని, కొక్కిలిగడ్డ శ్రీను, బొలిశెట్టి నాని, పసుపులేటి నాగరాజు, వంక రమేష్, వంక నందేశ్వరరావు, వంక నాగమల్లేశ్వరరావు, వంక రాంబాబు, వీర శ్రీనివాసరావు తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.



ప్రజాభూమి


ఏలూరు, పశ్చిమగోదావరి 4

గురువారం 12 నవంబర్ 2026

తుపానుగా మారనున్న అల్పపీడనం

ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా.

బంగాళాఖాతంలో కొత్తగా ఏర్పడనున్న అల్పపీడనం వచ్చే వారం నాటికి తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. నవంబర్ (12వ తేదీ) నేటికీ ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈ వ్యవస్థ ఏర్పడనుంది.ఇది క్రమంగా బలపడి శ్రీలంక వైపు ప్రయాణించి, ఆపై తుపానుగా మారేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని ప్రాథమిక సమాచారం ద్వారా తెలుస్తోంది.ప్రస్తుతం సముద్ర మట్టంలో ఏర్పడిన వాతావరణ మార్పుల వల్ల ఈశాన్య రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. గత నెల రోజుల గణాంకాలను పరిశీలిస్తే సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైనట్లు



స్పష్టమవుతోంది. ముఖ్యంగా దక్షిణ కోస్తా జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ అయ్యాయి. నవంబర్ 15 నాటికి ఈ అల్పపీడన వ్యవస్థ మరింత బలపడి తీరం వైపు కదిలే అవకాశం ఉంది. దీని ప్రభావంతో నవంబర్ 15 నుంచి 20 మధ్య పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఒకవేళ ఇది తుపానుగా రూపాంతరం చెందితే, నవంబర్ 19వ తేదీ నాటికి తీరాన్ని సమీపించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.అయితే ఈ వాతావరణ వ్యవస్థ యొక్క ఖచ్చితమైన మార్గం తీవ్రతను నిపుణులు నిశితంగా గమనిస్తున్నారు. సముద్రంలో ఏర్పడే మార్పుల ఆధారంగా తుపాను ప్రభావం ఏయే ప్రాంతాలపై ఎక్కువగా ఉంటుందనేది త్వరలో వెల్లడి కానుంది. ప్రస్తుతానికి వర్షాలు కొనసాగే అవకాశం ఉన్నందున తీర ప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



రెండేళ్లలో ఏలూరు నియోజకవర్గంలో

అభివృద్ధి పనులకు వేగం

- ఎమ్మెల్యే బడేటి చంటి

ప్రజాభూమి ఏలూరు

గత రెండేళ్లలో ఏలూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు ఏలూరు ఎమ్మెల్యే, జిల్లా టీడీపీ అధ్యక్షుడు బడేటి చంటి తెలిపారు. అభివృద్ధి పనుల్లో భాగంగా మంగళవారం స్థానిక 53వ డివిజన్‌లో నూతనంగా నిర్మిస్తున్న రహదారి పనులను, అనంతరం నిర్మాణంలో ఉన్న జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ పనులను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారుల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనతో పాటు సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం కొనసాగిస్తోందన్నారు.ఏలూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్,కార్పొరేటర్లు అమరావతి అశోక్,పెద్దాడ వెంకట రమణ,నాయకులు గూడవల్లి శ్రీనివాస్,త్రిపర్ణ రాజేష్,ఆర్నేపల్లి తిరుపతిరావు పాల్గొన్నారు.

ఫెమినా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో

ఘనంగా పలు సేవా కార్యక్రమాలు



ప్రజాభూమి ప్రతినిధి,పాలకొల్లు:

స్థానిక ఫెమినా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జెడ్సీ () విజిట్ ఘనంగా జరిగింది. క్లబ్ ప్రెసిడెంట్ యిమ్మిడి లలిత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జోన్ చైర్మన్) డాక్టర్ జయభారత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 100 మందికి ఐ స్క్రీనింగ్ (కంటి పరీక్షలు) చేయగా, వారిలో అవసరమైన 24 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. అలాగే మరో ఎనిమిది మందికి ఉచిత క్యాటరాక్ట్ ఆపరేషన్ల నిమిత్తం ఆర్థిక సాయం అందించారు. వీటితో పాటు తుఫాను బాధితులకు, క్యాన్సర్ రోగులకు రూ.1,500 విలువైన నిత్యావసర కిట్లను పంపిణీ చేశారు. జి వి ఎస్ వి ఆర్ ఎం మున్సిపల్ మోడల్ ప్రైమరీ స్కూల్ కు స్టీల్ వాటర్ ఫిల్టర్ ను ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీ ప్రసాద్ కు అందజేశారు, అన్నదానానికి 25 కేజీల బియ్యం బస్తాను విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏలూరు సమగ్ర అభివృద్ధికి

కూటమి ప్రభుత్వం కృషి

- ప్రజల సంక్షేమమే మా ప్రధాన ధ్యేయం
- ఎమ్మెల్యే బడేటి చంటి



ప్రజాభూమి ఏలూరు

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి,సంక్షేమం సాధ్యమని ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (బడేటి చంటి) అన్నారు.నగరంలోని అన్ని డివిజన్లలో రహదారులు,డ్రైనేజీ, తాగునీరు,పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి,ప్రజా సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు.ఏలూరు నగర సమగ్ర అభివృద్ధితో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు.బుధవారం క్యాంపు కార్యాలయంలో టీడీపీ 5వ డివిజన్ ఇన్‌చార్జి జాలా బాలాజీ ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్యే బడేటి చంటిని కలిసి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు,5వ డివిజన్ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికార పార్టీలో చింతలపూడి నగర పంచాయతీ టికెట్ కోసం పోటా పోటి

- ప్రయత్నాలను ముమ్మరం చేసిన ఆశావహులు
- టికెట్ మాదే అంటూ ఎవరికి వారు ధీమా

ప్రజాభూమి ప్రతినిధి చింతలపూడి

చింతలపూడి నగర పంచాయతీగా రూపుదిద్దుకున్న తదుపరి తొలిసారిగా జరుగుతున్న ఎన్నికలకు ముందుగా ఓసికి రిజర్వ్ అవుతుందని ఎంతోమంది ఆశించారు. కానీ ప్రభుత్వం ఎస్సీ మహిళకు రిజర్వ్ చేయడంతో ఎంతో కాలంగా నగర పంచాయతీ దక్కించుకోవాలని ఆశించిన వారికి అడియాసే మిగిలింది. చింతలపూడిలో స్వల్ప కాలంలో శాసనసభ్యులు రోషన్ కుమార్ చేసిన అభివృద్ధి, చేపట్టిన పనులతో పట్టణ ప్రజలు సంతృప్తి తో ఉన్నారు. ఈ నేపథ్యంలో నగర పంచాయతీ విజయం నల్లేరు మీద నడకే అంటూ భావిస్తూ ఎక్కువమంది పోటీ పడుతున్నారు. చింతలపూడి నగర పంచాయతీ లో మొత్తం ఓటర్లు సుమారు 23300 పైచిలుకు వున్నారు .అయితే ఇక్కడ ఉన్న సామాజిక వర్గాలను పరిశీలిస్తే యస్ సి ఓటర్లు సుమారు 6 వేలమంది మాత్రమే . మిగిలిన 17000 మంది ఇతర సామాజిక వర్గాలకు చెందినవారు కావటం గమనార్హం .దీంతో ఇక్కడ ఆశావాహులు కేవలం తమ సామాజిక వర్గానికి చెందిన ఓట్లతోనే విజయం సాధించవచ్చు అని భావించడం జరుగుతుంది. అలా భావిస్తే ఎడారిలో ఓయాసీస్ చూసి ముంతలో నీళ్లు వలకపోసు ఉన్నట్లు అవుతుందని వారు గ్రహించ లేక పోతున్నారు. చింతలపూడి నగర పంచాయతీ టికెట్ ఆశించే అధికారపార్టీ అభ్యర్థులకు మిగిలిన సామాజిక వర్గాల ప్రజలు ,నాయకులతో వున్న పరిచయాలు,సంబంధాలు కీలకంగా మారనున్నాయి. చింతలపూడి నగర పంచాయతీ చైర్మన్ అభ్యర్థి రేసు లో వున్న వారిలో ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న కంభం రమేష్ సతీమణి ఎస్తేరు రాణి గట్టిగా ప్రయత్నంచేస్తున్నారు. శాసనసభ ఎన్నికల నాటినుంచి తెలుగు దేశం పార్టీలో చురుకుగా పాల్గొన్నారు. దాంతో పార్టీ టికెట్ సొంత చేసుకోవాలనే ప్రయత్నం లో వున్నారు. మిగిలిన సామాజిక వర్గాలతో పరిచయాలు పెంచుకొని ముందుకు వెళ్లాలని గట్టిగా కృషి చేస్తున్నారు. టిడిపి టికెట్ ఆశిస్తున్న మరో అభ్యర్థిని మట్టా. సునీత పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తుంది. చైర్మన్ పీఠం కోసం గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నారు . సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి సొంగ రోషన్ కుమార్, గెలుపు కోసం చేసిన కృషి లో తనదైన శైలిలో ముద్ర వేసుకున్న అబ్దుల్ గపూర్ అందరికీ సుపరిచితం. ఆయన సతీమణి మట్టా. సునీత కావటం గమనార్హం .నగర పంచాయతీ లో జరుగుతున్న అభివృద్ధి ,పార్టీ కార్యక్రమాలలో క్రియాశీలకంగా ఉంటూ అన్ని సామాజిక వర్గాలకు చెందిన యువత ,సీనియర్ తెలుగు దేశం పార్టీ నాయకులతో సత్సంబంధాలు కలిగి ఉన్నారు. చింతలపూడి నగర పంచాయతీ లో గల మైనార్టీ ,వైశ్య ,కాపు,యస్టీ ,లతో పాటు బిసి సామాజిక వర్గానికి చెందిన అధికశాతం మంది తో పార్టీ లకు అతీతంగా అందరికి అందుబాటులో ఉండే వ్యక్తి గా గఫూర్కి గెలుపు గుర్రం గా ప్రజలలో అంచనాలు వేస్తున్నారు. నగర పంచాయతీ లో ఉన్న ప్రజలలో వివిధ వర్గాలతో వ్యాపార లావాదేవీలు వలన ఆయావర్గాల నుంచి పూర్తి స్థాయిలో గఫూర్, సతీమణి మట్టా సునీత పేరు ప్రముఖంగా వినిపిస్తున్న వినిపిస్తుంది . మట్ట సునీతకు తన సామాజిక వర్గంతో పాటు తన భర్త సామాజిక వర్గం నుండి ఇతర సామాజిక వర్గాలతో వారికి ఉన్న పరిచయాలు మరింతగా తోడ్పడతాయని గెలుపు సునాయాసం కాగలదని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. అలాగే చింతలపూడి నగర పంచాయతీ చైర్మన్ ఆశిస్తున్న వారిలో సందీపాం కిషోర్ సతీమణి దేవమణి, అభ్యర్థత్వం కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు . అయితే వీరి కుటుంబం ప్రభుత్వ ఉద్యోగులు గా మరియు యస్సీ లో తమ సామాజిక వర్గంలో సుపరిచితులు. వీరికి క్రియాశీల రాజకీయలలో ప్రత్యక్షంగా సంబంధాలు నామమాత్రమే అయిన అన్ని కోణాలలో వీరి ప్రయత్నాలు సాగుతున్నాయి. ఈ ముగ్గురిలో పార్టీ అభ్యర్థిత్వం ఎవరికి ఇస్తుందని ఉత్కంఠ అందరిలో కొనసాగుతోంది

ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి

- నివాళులు అర్పించిన జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ వై ప్రసాద్ రావు

ప్రజా భూమి బ్యూరో ఏలూరు జిల్లా



భారత దేశంలో విద్యాభివృద్ధికి, జాతీయ సమైక్యతకు ఆజాద్ చేసిన సేవలు చిరస్మరణీయం అని ఏలూరు జిల్లా అదనపు ఎస్పి అడ్మిన్ వై ప్రసాద రావు అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ విద్యావేత్త, స్వతంత్ర భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్వై. ప్రసాద్ రావు ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ వై. ప్రసాద్ రావు మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్య సాధనకు, విద్యారంగ అభివృద్ధికి, జాతీయ సమైక్యతకు మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. విద్య ద్వారానే సమాజంలో సానుకూల మార్పు సాధ్యమని విశ్వసించిన ఆయన, అందరికీ విద్యావకాశాలు అందుబాటులో ఉండాలని కృషి చేశారని తెలిపారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ 1888 నవంబర్ 11న జన్మించారన్నారు. స్వతంత్ర భారత తొలి విద్యాశాఖ మంత్రిగా 1947 నుంచి 1958 వరకు బాధ్యతలు నిర్వర్తించి, దేశ విద్యావ్యవస్థ బలోపేతానికి విశేష చేసిన సందర్భాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమములో ఏ ఆర్ అదనపు ఎస్పీ జి మునిరాజా, ఎస్ బి ఇన్స్పెక్టర్ మల్లేశ్వర రావు, డి సి ఆర్ బి ఇన్స్పెక్టర్ హబీబ్ భాష, పోలీస్ ప్రధాన కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



కె కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

ప్రజా భూమి ప్రతినిధి,కామవరపుకోట

స్థానిక కామవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె విజయబాబు సూచనలు మరియు కళాశాల ఉన్నత విద్య అకడమిక్ క్యాలెండర్ ప్రకారం నేడు ఎన్ ఎస్ ఎస్ విభాగం అధ్వర్యంలో "జాతీయ విద్యా దినోత్సవం" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ఇంఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం మధు ముందుగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం ఇంఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం మధు ప్రసంగిస్తూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యారంగానికి చేసిన సేవలను, దేశంలో విద్యాభివృద్ధికి ఆయన అందించిన కృషిని వివరించారు. అనంతరం ఎన్.ఎస్.ఎస్ విభాగం కో-ఆర్డినేటర్ డాక్టర్ జి శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యక్తిగత అభివృద్ధికి మాత్రమే కాకుండా సమాజ అభివృద్ధికి విద్య ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం మధు , ఎన్ ఎస్ ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ జి శ్రీనివాసరావు, అధ్యాపకులు కె శంకర్ నారాయణ, ఎస్ సుశ్యలత, కె ఇందిరా కుమారి, ధారావతు మల్లేష్, ఎం విజయ కృష్ణ, పి కల్పన మరియు సిబ్బందితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం

- జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కొనియాడారు. బుధవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని వాడపాలెంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా అబుల్ కలాం ఆజాద్ దేశ విద్యారంగ అభివృద్ధికి పటిష్టమైన పునాదులు వేశారని పేర్కొన్నారు. విద్యాభివృద్ధి పట్ల ఆయనకు ఉన్న దూరదృష్టి, అంకితభావం దేశ ప్రగతికి ఎంతగానో దోహదపడ్డాయని తెలిపారు. విద్యారంగంలో ఆయన చేసిన కృషి భావితరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. నేటి యువత మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలు, ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని విద్యతో పాటు అన్ని రంగాల్లో ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే సూచించారు.

ప్రజాస్వామ్యాన్ని రక్షించండి..

ఎన్నికల హింసను నిరసించండి

- కూటమి ప్రభుత్వ చర్యలపై సీపీఐ,సీపీఎం నాయకుల ఆగ్రహం

ప్రజాభూమి ఏలూరు

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అవలంబించిన హింసాత్మక విధానాలను నిరసిస్తూ సీపీఐ,సీపీఎం ఆధ్వర్యంలో ఏలూరు పాత బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దేగా ప్రభాకర్ మాట్లాడుతూ, స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేసి, నామినేషన్ పత్రాలను చింపివేసి ఏకగ్రీవాలకు పాల్పడ్డారని ఆరోపించారు.ఎన్నికల్లో పోలీసు యంత్రాంగం,ఎన్నికల కమిషన్ అధికార కూటమికి సహకరించాయని విమర్శించారు.సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ,ఎన్నికల్లో దాడులు, బెదిరింపులతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని



ఆరోపించారు.సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కే. శ్రీనివాస్ మాట్లాడుతూ, డబ్బు,మద్యం పంపిణీతో పాటు అధికార యంత్రాంగాన్ని ఉపయోగించుకుని ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు.ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజలంతా ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ప్రజాభూమి

కోనసీమ 5

గురువారం 12 నవంబర్ 2026

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- శ్రీరఘురామ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా



ప్రజా భూమి,ప్రత్తిపాడు

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీరఘురామ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు కావడం సంతోషకరమని అన్నారు. ఈ ఆస్పత్రి అందుబాటులోకి రావడంతో ప్రత్తిపాడు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు స్థానికంగానే పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. అత్యవసర సమయాల్లో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గడంతో పాటు ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఆస్పత్రి నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ఆస్పత్రి నిర్వాహకులు, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ అభివృద్ధి పోరుకు షేక్ మీరాబీ సిద్ధం

ఈసారి తగ్గేదే లేదు!

- ప్రజాసేవే లక్ష్యం.. గ్రామాభివృద్ధి, ఐక్యతే ధ్యేయం
- సర్పంచ్ బరిలోకి షేక్ మీరాబీ



ప్రజాభూమి ప్రతినిధి:-పరవాడ

అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో గ్రామ సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. గ్రామ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా షేక్ మీరాబీ సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్నారు. గ్రామ ప్రజల ఆదరణ, ఆశీర్వాదంతో ప్రజాసేవకు ముందడుగు వేస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ సందర్భంగా షేక్ మీరాబీ మాట్లాడుతూ.. పరవాడ గ్రామ ప్రజలకు హృదయపూర్వక నమస్కారాలు తెలియజేస్తూ, తనపై నమ్మకం ఉంచి సర్పంచ్‌గా చూడాలని ఆశిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ పదవి అనేది అధికారం కోసం కాదని, ప్రజలకు సేవ చేసే బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

గ్రామాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత

పరవాడ గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తానని మీరాబీ తెలిపారు. ప్రధాన, అంతర్గత రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం, ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన తాగునీరు, అన్ని వీధుల్లో వీధి దీపాల ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తానన్నారు. విద్యార్థులకు మెరుగైన వసతులు, యువతకు క్రీడా సదుపాయాలు, మహిళల సంక్షేమం కోసం ప్రత్యేకంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. అలాగే గ్రామానికి వచ్చే ప్రభుత్వ నిధులు, చేపట్టే అభివృద్ధి పనుల వివరాలను ప్రజలకు తెలియజేస్తూ పారదర్శక పాలన అందిస్తానని హామీ ఇచ్చారు.

మాటలు కాదు.. చేతల్లో అభివృద్ధి చూపిస్తా!

ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం సులభమేనని, గెలిచిన తర్వాత ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడమే నిజమైన నాయకత్వమని మీరాబీ పేర్కొన్నారు. కులమతాలు, రాజకీయ విభేదాలు, వ్యక్తిగత కక్షలకు తావులేకుండా గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ముందుకు సాగుతానన్నారు. పేదలు, వృద్ధులు, మహిళలు, యువత సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వాన్ని అందిస్తానని తెలిపారు.

ఈసారి పరవాడలో మార్పు రావాలి!

మన గ్రామానికి కావాల్సింది రాజకీయాలు కాదని, అభివృద్ధి అని మీరాబీ అన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే ప్రజా ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇవ్వాలని, మాటలకే పరిమితం కాకుండా ప్రజల మధ్య ఉంటూ పనిచేసే నాయకత్వం రావాలని ఆకాంక్షించారు. ప్రజల ఆశీర్వాదం, సహకారం ఉంటే పరవాడ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తానని వెల్లడించారు.

"పరవాడ ప్రజలారా.. ఈసారి మన గ్రామ భవిష్యత్తు కోసం ఆలోచించండి. అభివృద్ధికి, ఐక్యతకు, పారదర్శక పాలనకు ప్రాధాన్యత ఇవ్వండి. ప్రజల ఆశీర్వాదమే నా బలం.. గ్రామాభివృద్ధే నా లక్ష్యం. సిద్ధమంటే సిద్ధం.. ఈసారి తగ్గేదే లేదు!" అంటూ షేక్ మీరాబీ ప్రజలకు పిలుపునిచ్చారు.



ఘనంగా వేద పండితులచే

చండీహోమం

ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలోని లాకు దిగువ కొత్తపేటలో కొలువై ఉన్న శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి వారి ఆలయ ఆవరణలో శ్రీ నీలకంఠేశ్వర స్వామి శ్రీ శ్రీ శ్రీ చౌడేశ్వరి అమ్మవారి ప్రాంగణంలో బుధవారం వేద పండితుల చే చండీహోమం కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగినది. ఆలయ చైర్మన్ వట్టం గణేశ్వరరావు మాట్లాడుతూ అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఈ చండీ హోమం చేయడం జరిగిందని ఈ కార్తీకమాస నాలుగు సోమవారములు ఉదయం భక్తులకు వారి వారి గోత్రనామాలతో స్వామివారికి అభిషేకములు మరియు సాయంత్రం 7 గంటలకు పంచహారతులు జరుగునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లు బాసిన గుణేశ్వరరావు, బాసిన సత్యనారాయణ, కార్యదర్శి మానెం బసవరాజు, ట్రెజరర్ ఆనెం భాస్కరరావు, యర్రా శివాజీ, బొండపల్లి చంద్రశేఖర్, బాసిన మోహన్, మానెం రాము, జగురోతు రాంబాబు, మానెం ధనుంజయ శ్రీనివాసరావు, మానెం గణేష్ మాస్టర్, కుడకా సోమేశ్వరరావు, వట్టం కిరణ్, బాసిన భార్గవి, మానెం గంగాభవాని, వట్టం అమ్ము, కూర్మా ప్రసన్న తదితరులు ఈ పవిత్ర కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సర్పంచ్‌గా పోటీ చేయాలంటే

అదే గ్రామంలో

ఓటు హక్కు కల్గి ఉండాలి

- 21 సంవత్సరాలు నిండి ఉండాలి
- ఆర్డీవో దాసి రాజు





ప్రజాభూమి ప్రతినిధి పాలకొల్లు

గ్రామ సర్పంచ్‌గా పోటీ చేసే అభ్యర్థి 21 సంవత్సరాలు వయసు నిండి ఉండాలని, అలాగే ఏ గ్రామం లో పోటీ చేయాలనుకున్నారో అదే గ్రామంలో ఓటు హక్కును కలిగి ఉండాలని ఆర్డిఓ దాసిరాజు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ సర్పంచ్ ఎన్నికల నిమిత్తం స్టేజ్ 1,స్టేజ్ టు అధికారులకు శిక్షణ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆర్డిఓ దాసిరాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రిటర్నింగ్ అధికారి పి మురళీకృష్ణ మాట్లాడుతూ సర్పంచ్ గా పోటీ చేసే జనరల్ అభ్యర్థులు రూ.3000, ఎస్సీ ఎస్టీ బీసీ అభ్యర్థిలు రూ.1500, వార్డ్ మెంబర్లు జనరల్ అభ్యర్థులు రూ.1000 రూపాయలు, ఎస్సీ ఎస్టీ బీసీ అభ్యర్థులు రూ.500 రూపాయలు చెల్లించాలని తెలిపారు.. ఎస్సీ ఎస్టీ బీసీ అభ్యర్థులు క్యాస్ట్ సర్టిఫికెట్ తప్పనిసరిగా అందజేయాలని కోరారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ ట్రైని గిరిబాబు, లక్ష్మీనారాయణ, జిల్లా నోడల్ ఆఫీసర్ అప్పారావు, స్టేజ్ వన్, స్టేజ్ టు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాలి : ఎమ్మెల్యే బడేటి చంటి

ప్రజాభూమి ఏలూరు

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అధికారులను ఆదేశించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించి,సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం సంక్షేమం,అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తోందన్నారు.కార్యక్రమంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన కార్పొరేటర్ చౌటపల్లి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పైథాన్ ఎస్సెన్షియల్స్‌పై రెండు రోజుల వర్క్‌షాప్



ప్రజాభూమి ఏలూరు

స్థానిక సర్ సి.ఆర్.రెడ్డి మహిళా కళాశాల, వట్లూరులో కంప్యూటర్ విభాగం, IQAC సంయుక్త ఆధ్వర్యంలో శాండ్ స్పేస్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సౌజన్యంతో నవంబర్ 10,11 తేదీల్లో రెండు రోజుల పాటు "పైథాన్ ఎస్సెన్షియల్స్" అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో శాండ్ స్పేస్ టెక్నాలజీస్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ డెవలపర్లు వి. దుర్గా ప్రసాద్,జి. విజయ్ కుమార్ విద్యార్థినులకు పైథాన్ ప్రోగ్రామింగ్ భాష ప్రాధాన్యత,వినియోగాలు, ప్రాథమిక అంశాలపై అవగాహన కల్పించారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్,డేటా సైన్స్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో పైథాన్ ఉపయోగాలు, భవిష్యత్తులో అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలను వివరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కిలారు ప్రభాకరరావు,ప్రిన్సిపాల్ జి. సరళ,IQAC కోఆర్డినేటర్ పి.హిమబిందు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

విదేశీ విద్యపై విద్యార్థినులకు అవగాహన సదస్సు



ప్రజాభూమి ఏలూరు

స్థానిక సర్ సి.ఆర్.రెడ్డి మహిళా కళాశాల, వట్లూరులో కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్, IQAC సంయుక్త ఆధ్వర్యంలో డిగ్రీ ఫైనలియర్ విద్యార్థినులకు "విదేశీ విద్య" అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి విజయవాడకు చెందిన అకడమిక్ ఓవర్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ కౌన్సిలర్ వి.శ్యామ్ గోపాల్ ముఖ్య అతిథిగా హాజరై విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు అందుబాటులో ఉన్న అవకాశాలు,అమెరికా, యూకే,కెనడా, ఆస్ట్రేలియా,జర్మనీ వంటి దేశాల్లో విద్యాప్రకాశాలు, ప్రవేశ అర్హతలు, ×జుూూ, TOEFL పరీక్షలు, స్కాలర్‌షిప్‌లు,వీసా విధానాల గురించి వివరించారు.విదేశీ విశ్వవిద్యాలయాల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని,నకిలీ కన్సల్టెన్సీల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కిలారు ప్రభాకరరావు, ప్రిన్సిపాల్ జి. సరళ, IQAC కోఆర్డినేటర్ పి. హిమబిందు, అధ్యాపకులు,డిగ్రీ ఫైనలియర్ విద్యార్థినులు పాల్గొన్నారు.



ధర్మవరంలో ఉచిత

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

- తండ్రి జ్ఞాపకార్థం సొంత నిధులతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన మురళీకృష్ణంరాజు

ప్రజా భూమి, ప్రత్తిపాడు

ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు, ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీ ముదునూరి మురళీకృష్ణంరాజు తన తండ్రి ముదునూరి రామరాజు జ్ఞాపకార్థం సొంత నిధులతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు ఉచితంగా శుద్ధి చేసిన మినరల్ వాటర్ అందుబాటులోకి తీసుకురావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యం, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని చేపట్టిన ఈ సేవా కార్యక్రమం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ధర్మవరం గ్రామ సర్పంచ్ అభ్యర్థి శ్రీ ముదునూరి సీతారామరాజు పాల్గొన్నారు. అలాగే మాజీ సొసైటీ అధ్యక్షులు జువ్వల చిన్నబాబు, మాజీ వైస్ సర్పంచ్ బొల్లు సీతారామరాజు, జువ్వల దొరబాబు, మాజీ ఎంపీటీసీ నానిపల్లి చంటి, మాజీ 14వ వార్డు సభ్యులు గదుల శివ, 3వ వార్డు సభ్యులు కొప్పిన శ్రీను, చవగాని శ్రీను, మాజీ సొసైటీ అధ్యక్షులు బొల్లు రాజుబాబు, కోన బాబ్జి, గోనగాని రామకృష్ణ, నానిపల్లి సత్తిబాబు (చిరంజీవి), కొప్పుల చిన్న, గళ్ళ నాగరాజు, దెందుకూరి సత్యనారాయణ రాజు, చేకూరి రాంబాబు రాజు తదితర గ్రామ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైభవంగా కార్తీక మాస

ఆధ్యాత్మిక కార్యక్రమాలు

- ఆంధ్రా అరుణాచలంలో భక్తిశ్రద్ధలతో గోపూజ, రుద్రాభిషేకం, ఆకాశదీపోత్సవం

ప్రజాభూమి, ప్రత్తిపాడు

ఆంధ్రా అరుణాచలంగా ప్రసిద్ధి చెందిన రాచపల్లిలోని శ్రీ అపీతకుచాంబా సమేత అరుణాచలేశ్వర స్వామివారి దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా మంగళవారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి సన్నిధిలో గోపూజ, విఘ్నేశ్వర పూజ నిర్వహించిన అనంతరం శ్రీ అరుణాచలేశ్వర స్వామివారికి సామూహిక రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి హోమం భక్తిపూర్వకంగా జరిపించారు. అనంతరం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కార్తీక మాస ఆకాశదీపోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆకాశదీపం వెలిగించడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. ఆకాశదీపోత్సవం అనంతరం శ్రీ గంగా మాత పుష్కరిణి వద్ద ప్రత్యేకంగా గంగా పూజ, హారతులు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్తీక మాస పవిత్రతను చాటుతూ నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో రాచపల్లి ఆంధ్రా అరుణాచలం భక్తి పారవశ్యంలో మునిగిపోయింది.

ఆర్టీసీ డ్రైవర్ సస్పెండ్!

ప్రజాభూమి – మంగళగిరి

గత నెల 15వ తేదీన మంగళగిరి ఏపీఎస్ఆర్టీసీ బస్ స్టేషన్ నందు అమరావతి నుంచి వచ్చిన బస్సు అదుపుతప్పడంతో బస్టాండ్ లో ఉన్న ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఏడవ నెంబర్ ప్లాట్ఫామ్ వద్ద బస్సు నిలుపుదల చేసే క్రమంలో అదుపు తప్పి ప్లాట్ఫారం పైకి దూసుకు వెళ్లడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనలో పట్టణంలోని బాలాజీ నగర్ కు చెందిన పేర్ల దాక్షిత్ అనే నాలుగేళ్ల బాలుడు ఎడమ కాలుకు తీవ్ర గాయమైంది సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. ఈ క్రమంలో డ్రైవర్ నిర్లక్ష్యం వల్లనే ప్రమాదం జరిగిందని అధికారులు నిర్ధారించారు. గుంటూరుకు చెందిన డ్రైవర్ ఆర్ వి రెడ్డిని బాధ్యునిగా చేస్తూ, విధుల నుంచి 7వ తేదీన గత శనివారం సస్పెండ్ చేసినట్లు ఆర్టీసీ డిఎం సునీల్ తెలిపారు. సస్పెండ్ అయిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాగా డ్రైవర్ పై బాలుడి తల్లి రత్న పూజిత ఫిర్యాదు మేరకు మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్ నందు క్రైమ్ నెంబర్ 287/2026 క్రింద సెక్షన్ 125 (ఏ) బి.ఎన్.ఎస్ క్రింద పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రజాభూమి

అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6

గురువారం 12 నవంబరు 2026

ఆసుపత్రిలోనే అపరిశుభ్రతపై డిఎంహెచ్ఓ ఆగ్రహం

-బోయపేట యూపీహెచ్సీలో ఆకస్మిక తనిఖీ

-విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు

ప్రజాభూమి, హిందూపురం టౌన్



రోగులకు వైద్యం అందించాల్సిన ప్రభుత్వ ఆసుపత్రులే అపరిశుభ్రతకు నిలయాలుగా మారితే ప్రజల ఆరోగ్యానికి రక్షణ ఎక్కడ ఉంటుందనే ప్రశ్న తలెత్తుతోంది. ఆసుపత్రి ఆవరణలో పారిశుద్ధ్య నిర్వహణ లోపించడంపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ ఫైరోజాబేగం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



బుధవారం హిందూపురం పట్టణంలోని నింకంపల్లి రోడ్డులో ఉన్న బోయపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. తనిఖీల్లో భాగంగా ఆరోగ్య కేంద్రంలోని వివిధ విభాగాలను పరిశీలించిన ఆమె వైద్య సేవల నిర్వహణ, రికార్డుల తీరును క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆసుపత్రికి వస్తున్న రోగులకు ఎలాంటి వైద్య సేవలు అందుతున్నాయి, మందులు అందుబాటులో ఉన్నాయా.. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా అనే అంశాలపై ఆరా తీశారు. అయితే ఆసుపత్రి ఆవరణ అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన డీఎంహెచ్ఓ అక్కడ విధులు నిర్వహిస్తున్న స్వీపర్పై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రోగుల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన ఆసుపత్రిలోనే అపరిశుభ్రత ఉండటం ఏమిటని ప్రశ్నించారు. ఆసుపత్రి పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యతను విస్మరిస్తే సహించేది లేదని, విధుల్లో నిర్లక్ష్యం కొనసాగితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతోపాటు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ పేర్కొన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది విధులకు సకాలంలో హాజరై సమయపాలన పాటించాలని, రోగుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. వైద్య సేవలందించడంలోనూ, ఆసుపత్రుల నిర్వహణలోనూ ఎలాంటి అలసత్వం ప్రదర్శించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అనంతరం పట్టణంలోని లక్ష్మీపురం, ఇందిరానగర్, శ్రీనివాసనగర్, ముద్దిరెడ్డిపల్లి ఆరోగ్య కేంద్రాలను కూడా ఆమె సందర్శించారు. ఆయా కేంద్రాల్లో రికార్డుల నిర్వహణ, రోగులను ఇతర ఆసుపత్రులకు పంపించే రెఫరల్ వివరాలు, ప్రసవాల సంఖ్య తదితర అంశాలను పరిశీలించి వైద్యాధికారులు, సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో నమ్మకం పెరగాలంటే వైద్యం, పారిశుద్ధ్యం, సిబ్బంది పనితీరు అన్నింటిలోనూ నాణ్యత ఉండాలని ఆమె సూచించారు. ఈ తనిఖీల్లో వైద్యాధికారులు డాక్టర్ హిమబిందు, డాక్టర్ ఉషారాణి, డాక్టర్ నవీన్, సీహో రమేష్తోపాటు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి..

ప్రజాభూమి, పుట్లూర



తాడిపత్రి మండలంలోని కొనుగుంటపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పుట్లూరు మండలం కోమటికుంట్ల గ్రామానికి చెందిన ఇస్మాయిల్ (25) మృతి చెందాడు. ఇస్మాయిల్ బైక్పై వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీనిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.

ప్రమాద బాధితులకు అండగా నిలవాలి...

- గుడ్ సమారిటన్లకు చట్టపరమైన రక్షణ ఉంది..
- సహాయం చేసేందుకు ఎవరూ వెనుకాడొద్దు...
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రామ్ గోపాల్.

ప్రజాభూమి – కడప లీగల్



రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని సకాలంలో ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మానవత్వంతో ముందుకు రావాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ్ గోపాల్ పిలుపునిచ్చారు. ప్రమాద బాధితులకు సహాయం చేసే మంచి మనసున్న వ్యక్తులకు (గుడ్ సమారిటన్లు) చట్టపరమైన రక్షణ ఉందని, ఎలాంటి విచారణలు, చట్టపరమైన ఇబ్బందులకు భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. బుధవారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని తన ఛాంబర్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్తో కలిసి నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుడ్ సమారిటన్ అండ్ యాక్సిడెంట్ విక్టిమ్ ప్రొటెక్షన్ చార్టర్లోని అంశాలను వివరించారు. ప్రమాద బాధితులకు ఆసుపత్రులు తక్షణమే అత్యవసర వైద్యం అందించాలని, పోలీసు విచారణ, ఇతర లాంఛనాల పేరుతో చికిత్సలో జాప్యం చేయరాదన్నారు. ముందస్తుగా నగదు చెల్లించాలని కోరడం కూడా సరికాదన్నారు. బాధితులను ఆసుపత్రికి చేర్చిన సహాయకులు తమ వ్యక్తిగత వివరాలు వెల్లడించాల్సిన అవసరం లేదని, ఇష్టమైతే ఆసుపత్రి నుంచి వెంటనే వెళ్లిపోవచ్చని తెలిపారు. వారిని నిర్బంధించడం, వైద్య ఖర్చులు చెల్లించాలని ఒత్తిడి చేయడం, అనవసర ప్రశ్నలతో ఇబ్బంది పెట్టడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. సహాయకులు లేదా బాధితుల హక్కులకు భంగం కలిగితే ఆసుపత్రిలోని నోడల్ అధికారి లేదా వైద్య పర్యవేక్షకుడికి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యతగా గుర్తించాలని, ఒక్క క్షణం స్పందన ఒక నిండు ప్రాణాన్ని కాపాడుతుందని న్యాయమూర్తి పేర్కొన్నారు.

ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా రాజీనామా చేయాలి-సిపిఐ మండల కార్యదర్శి డి. పెద్దయ్య

ప్రజాభూమి, పుట్లూరు.



పుట్లూరు మండల కేంద్రంలోని బస్టాండ్ సర్కిల్ నందు సిపిఐ రాష్ట్ర పిలుపుమేరకు సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం (రాజుజ) కమిషనర్ అనిల్ చంద్ర పునేతా ఎన్నికలను స్వేచ్ఛగా నిషేపక్షాతంగా నిర్వహించడంలో పూర్తిగా విపమయ్యారని వెంటనే రాజీనామా చేయాలి అని నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగినది. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి పెద్దయ్య మాట్లాడుతూ! ఎన్నికల ప్రక్రియలో చోటు చేసుకున్న ప్రజాస్వామ్య వ్యతిరేక పరిణామాలకు నైతిక బాధ్యత వహిస్తూ ఆయన తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నాం. స్వేచ్ఛాయిత ఎన్నికలు నిర్వహించాల్సిన ఎన్నికల కమిషన్ అధికార కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రజల ఓటు హక్కును, అభ్యర్థుల ఎన్నికల హక్కులను పరిరక్షించడంలో ప్రేక్షక పాత్ర వహించడం ప్రజాస్వామ్య వ్యవస్థకే గొడ్డలి పెట్టు, ఎన్నికల అక్రమాలపై కమ్యూనిస్టు పార్టీలు, ప్రతిపక్షం నాయకులు, ఎప్పటికప్పుడు ఫిర్యాదులు చేసినప్పటికీ వాటిపై సమర్థ చర్యలు తీసుకోకపోవడం కమిషనర్ నిర్లక్ష్యానికి నిదర్శనం. అనంతపురం జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనిస్టులు, ప్రతిపక్ష నాయకులు పోటీ చేసిన ప్రాంతాల నుంచి పోలీసులు పక్షపాత వైఖరి ఎన్నికల ఏజెంట్లను అడ్డుకోవడం, బూత్ ఏజెంట్లను లోపలికి అనుమతించకపోవడం ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటనలో అక్రమాలపై అనేక ఫిర్యాదులు చేసినా ఎన్నికల కమిషనర్ స్పందించకపోవడం దారుణం. రాత్రి 10 గంటలకు ప్రకటించిన పోలింగ్ శాతానికి ముసువటి రోజు ఉదయం 10 గంటలకు వెల్లడించిన పోలింగ్ శాతానికి మధ్య 6 నుంచి 7శాతం వరకు వ్యత్యాసం కల్పించడం అనేక అనుమానాలకు తావిస్తుంది. పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులు భద్రపరిచి అనంతరం అదనంగా ఓట్లు ఎలా పెరిగాయి? ఏ ప్రాతిపదికన ఈ గణాంకాలు మారాయి? దీనికి ఎన్నికల కమిషనర్ సమాధానం చెప్పాలి. గెలిచిన అభ్యర్థులకు డిక్లరేషన్ పారాల ఇవ్వకుండా నిలుపుదల చేయడం, పోలీసుల జోక్యంతో ఎన్నికల విశ్వాసనీయతనే ప్రశ్నార్థకం చేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 28 జిల్లాల్లో రౌడీయిజం, గుండాయిజం, సైలెంట్ రిగ్గింగ్, బూతుల అక్రమణలు, నాయకులు, అభ్యర్థులు బెదిరింపులు, కోట్లాది రూపాయలు డబ్బులు పంపిణీ వంటి ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలు కొనసాగుతున్నాయని ఫిర్యాదులు రావడం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. అధికారంలో ఉన్న వారు ఎన్నికలు శాసిస్తే ఎన్నికల కమిషనర్ మౌనంగా చూస్తుంటే,, ప్రజాస్వామ్యానికి రక్షణ ఎక్కడ? పోలీసులే పక్షపాతానికి పాల్పడితే బాధితులు ఎవరికి ఫిర్యాదు చేయాలి? ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాల్సిన కమిషనర్ నిష్క్రియాపరంగా ఉంటే ప్రజలకు న్యాయం ఎలా జరుగుతుంది? అన్ని సూటిగా ప్రశ్నిస్తున్నాం, పదవులు శాశ్వతం కాదని, రాజ్యాంగం బాధ్యతలు అత్యంత పవిత్రమైనవని పేర్కొంటున్నాం. పదవి విరమణ చేసిన పదేళ్ల తర్వాత తిరిగి రాజ్యాంగ బద్ధమైన పదవిని చేపట్టిన వ్యక్తి ఆ పదవికి ఉన్న స్వతంత్ర తను, నిష్పక్షపాత ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యతను విస్మరించకూడదు. అధికార పార్టీ పట్ల విధేయత? లేక రాజ్యాంగం పట్ల నిబద్ధత? అనేది అనిల్ చంద్ర పూనేతా తెలుసుకోవాలి. ఎన్నికల కమిషనర్ గా కొనసాగడానికి కు ఇక నైతిక అర్హత లేదని ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీసినందు కు నైతిక బాధ్యత వహించి తక్షణం రాజీనామా చేయాలి అని డిమాండ్ చేస్తు ఎన్నికల అక్రమాలపై సమగ్ర విచారించి అధికారులు, పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలి, ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును కాపాడాల్సిన రాజ్యాంగ సంస్థలు అధికార పార్టీకి అనుబంధ సంస్థలుగా మారకూడదని తెలియజేస్తున్నాం. ప్రజల ఓటు హక్కు అధికార పార్టీ ఆస్తి కాదు. ప్రజాస్వామ్యం పాలకుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడదవి కాదని స్పష్టం చేస్తున్నాం. పాల్గొన్నవారు:- మండల సహాయ కార్యదర్శి బాలు, బి డి హెచ్ పి ఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు పెద్దన్న, రాఘవేంద్ర, రాజు, సూరి, లింగమయ్య యాదవ్, లక్ష్మయ్య ఓబులేసు, మహేష్, ఓబుళపతి, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు లేదు.. కట్టిన సొమ్ము వెనక్కి..!!

- 1,865 మంది లబ్ధిదారులకు రూ.1.59 కోట్ల వాపసు
- మరో 1,200 ఇళ్లు త్వరలో అప్పగింత
- వివరాలు వెల్లడించిన మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రజాభూమి, హిందూపురం టౌన్



టిడ్కో ఇళ్ల కోసం ఆశతో డబ్బులు చెల్లించి, వివిధ కారణాలతో ఇళ్లు పొందలేకపోయిన లబ్ధిదారులకు ప్రభుత్వం ఊరట కల్పించిందని హిందూపురం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. గతంలో ఇళ్ల నిర్మాణం కోసం లబ్ధిదారుల నుంచి వసూలు చేసిన వాటా సొమ్మును తిరిగి చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. హిందూపురం పురపాలక సంఘం పరిధిలో మూడు క్యాటగిరిల కింద మొత్తం 3,065 ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టగా, వాటిలో 1,200 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, త్వరలో లబ్ధిదారులకు అప్పగించనున్నట్లు వెల్లడించారు. మిగిలిన 1,865 మంది లబ్ధిదారులకు వారు చెల్లించిన వాటా సొమ్ము మొత్తం రూ.1,59,80,500 తిరిగి చెల్లించనున్నట్లు బుధవారం వివరించారు. హిందూపురం పురపాలక సంఘం పరిధిలో టిడ్కో గృహ నిర్మాణాలను క్యాటగిరి-1, క్యాటగిరి-2, క్యాటగిరి-3 విభాగాలుగా చేపట్టారు. ఆయా క్యాటగిరిలకు అనుగుణంగా ప్రభుత్వం నిర్దేశించిన మొత్తాలను లబ్ధిదారుల నుంచి డీడీల రూపంలో వసూలు చేశారు. ఇందులో క్యాటగిరీ-1లో 720, క్యాటగిరీ-2లో 384, క్యాటగిరీ-3లో 96 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మొత్తం 1,200 ఇళ్లు సిద్ధంగా ఉన్నాయని, త్వరలోనే లబ్ధిదారులకు అప్పగించే ఏర్పాట్లు చేస్తున్నామని కమిషనర్ తెలిపారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాలు పూర్తికాని లబ్ధిదారులకు వారు గతంలో చెల్లించిన వాటా సొమ్మును తిరిగి చెల్లించనున్నారు. క్యాటగిరి-1లో 1,430 మంది లబ్ధిదారులకు రూ.7,16,000, క్యాటగిరి-2లో 172 మందికి రూ.35,39,500, క్యాటగిరి-3లో 263 మందికి రూ.1,17,25,000 చొప్పున మొత్తం 1,865 మంది లబ్ధిదారులకు రూ.1,59,80,500 వాపసు చేయనున్నట్లు మల్లికార్జున వివరించారు. వాటా సొమ్ము చెల్లించిన లబ్ధిదారులు మరణించి ఉంటే వారి కుటుంబ సభ్యులు కూడా ఆ మొత్తాన్ని తిరిగి పొందేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఇందుకోసం లీగల్ హెయిర్ సర్టిఫికెట్తో పాటు స్వీయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ నంబర్, మొబైల్ నంబర్, గతంలో చెల్లించిన డీడీ వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలను సమర్పించాల్సి ఉంటుందన్నారు. అదేవిధంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన లేదా ప్రస్తుతం అందుబాటులో లేని లబ్ధిదారుల తరఫున వారి కుటుంబ సభ్యులు లేదా అధీకృత వ్యక్తులు సంబంధిత అధికార పత్రాలు, ఆధార్ కార్డు, కుటుంబ సభ్యుల వివరాలు, డీడీ, బ్యాంకు ఖాతా వివరాలను అందజేయవచ్చని సూచించారు. అర్హులైన లబ్ధిదారులు తమ పేరు, ఆధార్ నంబర్, మొబైల్ నంబర్, డీడీ వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలతో పాటు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను హిందూపురం మున్సిపల్ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో సమర్పించాలని కమిషనర్ కోరారు. ఇందుకు సంబంధిత సీఎల్టీసీ అధికారి ఇ. రామచంద్రను సంప్రదించాలని సూచించారు. లబ్ధిదారులు సమర్పించిన పత్రాలను పరిశీలించిన అనంతరం ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాటా సొమ్ము వాపసు ప్రక్రియ చేపడతామని మల్లికార్జున తెలిపారు.

సామాజిక న్యాయమా...! -రాజకీయ సమీకరణాలా...

- వైస్ చైర్మన్ పదవులపై ఉమ్మడి జిల్లాలో ఉత్కంఠ
- ఈ నెల 23న ఎన్నికలు -18న ప్రత్యేక సమావేశాలకు నోటీసులు
- మైనార్టీలు, దళితులు, వాల్మీకుల నుంచి డిమాండ్లు.
- బాలకృష్ణ నిర్ణయంపై ఆసక్తి
- కూటమి పార్టీల మధ్య తర్జనభర్జన

ప్రజాభూమి, హిందూపురం టౌన్



మున్సిపల్ ఎన్నికలు ముగిసి పాలకవర్గాలు కొలువుదీరిన నేపథ్యంలో ఇప్పుడు వైస్ చైర్మన్ పదవులపై రాజకీయ వేడి రాజుకుంటోంది. సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తారా... లేక రాజకీయ సమీకరణాలు, పార్టీ విధేయత, కౌన్సిలర్ల సంఖ్యాబలానికే ప్రాధాన్యత ఇస్తారా... అన్న చర్చ ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా జోరందుకుంది. మైనార్టీలు, దళితులు, వాల్మీకులు తదితర సామాజిక వర్గాల నాయకులు తమ వర్గాలకు వైస్ చైర్మన్ పదవులు కేటాయించాలని బహిరంగంగా డిమాండ్లు వినిపిస్తున్నారు. ఇప్పటికే పలుచోట్ల విలేకరుల సమావేశాలు నిర్వహించి తమ వాదనలను వెల్లడిస్తున్నారు. ముఖ్యంగా హిందూపురంలో వివిధ సామాజిక వర్గాల నాయకులు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు విజ్ఞప్తులు చేస్తుండటంతో ఆయన నిర్ణయంపై ఆసక్తి నెలకొంది. మరోవైపు అధికార కూటమిలో భాగస్వాములుగా ఉన్న తెలుగుదేశం, జనసేన, బీజేపీల మధ్య పదవుల పంపకం ఎలా ఉంటుందన్నది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని హిందూపురం, ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, పెనుకొండ, మడకశిర, రాయదుర్గం, కళ్యాణదుర్గం, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి మున్సిపాలిటీల్లో వైస్ చైర్మన్ పదవుల ఎన్నికకు రంగం సిద్ధమవుతోంది. రాష్ట్ర ఎన్నికల సంఘం నవంబర్ 4వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఆయా మున్సిపాలిటీల్లో అధికారులు ప్రత్యేక సమావేశాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 18వ తేదీన ప్రత్యేక సమావేశాలకు సంబంధించి నోటీసులు జారీ చేయనున్నారు. నవంబర్ 23వ తేదీ ఉదయం 11 గంటలకు ఆయా మున్సిపాలిటీల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి వైస్ చైర్మన్లను ఎన్నుకోనున్నారు. అనివార్య కారణాలతో ఆ రోజు ఎన్నిక నిర్వహించలేని పరిస్థితి ఏర్పడితే నవంబర్ 24వ తేదీ ఉదయం 11 గంటలకు ఎన్నిక నిర్వహించాలని నోటిఫికేషన్లో పేర్కొన్నారు. ప్రభుత్వ గెజిటెడ్ అధికారులను ఎన్నికల నిర్వహణాధికారులుగా నియమించి ఎన్నికల ప్రక్రియ చేపట్టనున్నారు.

మైనార్టీలకు అవకాశం కల్పించాలంటూ విజ్ఞప్తులు

హిందూపురం మున్సిపాలిటీలో వైస్ చైర్మన్ పదవిని మైనార్టీలకు కేటాయించాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. పట్టణంలో వివిధ పార్టీల తరఫున ముస్లిం కౌన్సిలర్లు ఎన్నికైన నేపథ్యంలో తమ సామాజిక వర్గానికి తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని ముస్లిం ఐక్యవేదిక నాయకులు కోరుతున్నారు. ఈ మేరకు విలేకరుల సమావేశం నిర్వహించి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ రాజకీయాల్లో మైనార్టీల పాత్రను గుర్తించి వైస్ చైర్మన్ పదవిని తమ వర్గానికి కేటాయించాలని కోరుతున్నారు.

దళితులకు న్యాయం చేయాలంటూ మరో డిమాండ్

మరోవైపు మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి దళిత సామాజిక వర్గానికి వైస్ చైర్మన్ పదవి దక్కలేదని, ఈసారి తమకు అవకాశం కల్పించాలని దళిత నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు న్యాయవాది రవికుమార్ తదితరులు విలేకరుల సమావేశం నిర్వహించి తమ వాదనను వినిపించారు. సామాజిక న్యాయం, సమాన రాజకీయ ప్రాతినిధ్యం దృష్ట్యా దళితులకు వైస్ చైర్మన్ పదవి కేటాయించాలని కోరుతున్నారు. ఇదే సమయంలో వాల్మీకి సామాజిక వర్గ నాయకులు సైతం తమ వర్గానికి ప్రాధాన్యత కల్పించాలని ఆశిస్తున్నారు. ఇతర సామాజిక వర్గాల నుంచి కూడా విజ్ఞప్తులు వస్తుండటంతో పదవుల ఎంపిక మరింత ఆసక్తికరంగా మారుతోంది.

కూటమి పార్టీల మధ్య సర్దుబాటు ఎలా...

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలో ఉన్న నేపథ్యంలో వైస్ చైర్మన్ పదవుల పంపకం మరో కీలక అంశంగా మారింది. ఆయా మున్సిపాలిటీల్లో ఏ పార్టీకి ఎన్ని కౌన్సిలర్ స్థానాలు దక్కాయి, కూటమి విజయానికి ఎవరి పాత్ర ఎంత, పార్టీ కోసం పనిచేసిన నాయకులకు ఎలాంటి గుర్తింపు లభిస్తుందన్న అంశాలు చర్చకు వస్తున్నాయి. మూడు పార్టీల మధ్య సమన్వయం పాటిస్తూ పదవుల పంపకం చేపడతారా లేక స్థానికంగా కౌన్సిలర్ల సంఖ్యాబలం, రాజకీయ బలాబలాల ఆధారంగా నిర్ణయం తీసుకుంటారా.. అన్నది వేచి చూడాల్సి ఉంది. ఒకవైపు మిత్రపక్షాల మధ్య రాజకీయ సర్దుబాట్లు చేయాల్సిన పరిస్థితి ఉండగా, మరోవైపు వివిధ సామాజిక వర్గాల నుంచి వస్తున్న డిమాండ్లను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది. ఒక సామాజిక వర్గానికి అవకాశం కల్పిస్తే మిగిలిన వర్గాల నుంచి ఎలాంటి స్పందన వస్తుంది, కూటమిలోని భాగస్వామ్య పార్టీలకు ఏ మేరకు ప్రాతినిధ్యం కల్పిస్తారనే అంశాలు నాయకత్వానికి కీలకంగా మారనున్నాయి.

బాలకృష్ణ నిర్ణయంపై ఆసక్తి

శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోని మున్సిపాలిటీల్లో ఎమ్మెల్యేలు, కూటమి ముఖ్యనేతల నిర్ణయాలు ప్రాధాన్యత సంతరించుకోగా, హిందూపురంలో మాత్రం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నిర్ణయం కోసం వివిధ సామాజిక వర్గాల నాయకులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే మైనార్టీలు, దళిత నాయకులు తమ విజ్ఞప్తులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వాల్మీకి తదితర సామాజిక వర్గాలు కూడా తమకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతున్నాయి. ఎన్నికల సమయంలో కూటమికి అండగా నిలిచిన వర్గాలకు పదవుల పంపకంలో ఎలాంటి గుర్తింపు లభిస్తుందన్నది చర్చనీయాంశంగా మారింది.

కంప చెట్లు తొలగించండి..

ప్రజాభూమి యల్లనూరు



మండల పరిధిలోని కూచివారి పల్లి, బొప్పేపల్లి రెండు గ్రామాల ప్రజలు, మరియు వాహన దారులు పంచాయతీ రోడ్డు మార్గం ద్వారా ప్రయాణించాలంటే తీవ్ర అవస్థలు పడుతూ ప్రాణాలు పణంగా పెట్టి ప్రయాణం చేయాల్సిందే రోడ్డుకు ఇరువైపులా దట్టమైన ముళ్ళ కంపల చెట్లు ఏపుగా పెరగడంతో అందులోనూ అధిక మలుపులు కలిగి ఉండడం వల్ల ఎదురుగా వచ్చే మోటార్ బైక్, ఇతర వాహనాలకు సమీపానికి వస్తే కానీ భారీ వాహనాలు కనిపించని దుస్థితి అంతేకాకుండా నిరంతరం యల్లనూరు మండల కేంద్రానికి వ్యవసాయ రైతులు తమ వ్యక్తిగత పనుల నిమిత్తం ఇదే రోడ్డు మార్గం గుండా ప్రయాణం సాగించాల్సిందే ఏమాత్రం ఏమర పాటుగా ఉన్న ప్రాణాలు పోవాల్సిందే నిరంతరం అధికారులు కూడా పలుమార్లు ఈ రోడ్డు మార్గంలో ప్రయాణించి కూడా వారిలో మాత్రం చలనం లేదని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే రోడ్డుకి ఇవైపులా ముళ్ళ కంపలు తొలగించి ప్రాణం నష్టం జరగకుండా చూడాలని గ్రామ ప్రజలు వాహనదారులు కోరుతున్నారు.

ప్రజాభూమి
వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమ్మయ్య 7
గురువారం 12 నవంబరు 2026

స్థానిక ఎన్నికల్లో ఎన్ని అడ్డంకులు సృష్టించినా వెనక్కి తగ్గేది లేదు

మరానున్న సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు అండగా ఉంటాం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

ప్రజాభూమి పోరుమామిళ్ల :



పోరుమామిళ్లలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బద్వేల్ నియోజకవర్గ ఇంచార్జి, ఎమ్మెల్సీ శ్రీ డీసీ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. స్థానిక సంస్థల ఎన్నికల ప్రారంభం నుంచి మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ మొదలుకొని ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల వరకు బద్వేల్ నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు అనేక ఇబ్బందులు, బెదిరింపులు, రాజకీయ ఒత్తిళ్లు ఎదుర్కొన్నారని ఆరోపించారు. టీడీపీ ఇన్‌చార్జి నూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ దుండగులు పోలీసుల సహకారంతో తమ పార్టీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలను చించివేయడం, అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేయడం వంటి ఘటనలకు పాల్పడ్డారని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ పదవిని ఏకగ్రీవం చేయడంతో పాటు నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థుల నామినేషన్ల సమయంలోనూ అనేక అడ్డంకులు సృష్టించారని పేర్కొన్నారు. ముఖ్యంగా కలసపాడు, కాశినాయన, బి.కోడూరు, గోపవరం మండలాల్లో తమ పార్టీ జడ్పీటీసీ అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచినప్పటికీ ప్రచారం నుంచి పోలింగ్ వరకు వివిధ రకాలుగా ఇబ్బందులకు గురిచేశారని, కలసపాడు మండలంలో పోలింగ్‌కు ముందు రోజు పుత్తా నరసింహారెడ్డి, ఆయన అనుచరులు వందల సంఖ్యలో చేరుకుని తమ పార్టీ అభ్యర్థులను భయపెట్టడం, ఎన్నికల ఏజెంట్లను బయటకు లాగివేయడం, ఎన్నికల పత్రాలను చించివేయడం వంటి ఘటనలకు పాల్పడ్డారని ఆరోపించారు. మిగిలిన మండలాల్లో కూడా తమ పార్టీ అభ్యర్థులు, నాయకులు ఇలాంటి అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 40 సంవత్సరాల రాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబు నాయుడు ప్రజాస్వామ్య వ్యవస్థలను గౌరవించి ఎన్నికలను స్వేచ్ఛగా నిర్వహించాల్సింది పోయి, ప్రజల ఓటు హక్కును అడ్డుకునే విధంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజలపై నమ్మకం ఉంటే ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించి ప్రజల తీర్పును స్వీకరించాలని హితవు పలికారు. మున్సిపల్ చైర్మన్, ఎంపీపీ, జడ్పీటీసీ వంటి పదవులను ఏకగ్రీవం చేసుకోవడానికి రూ.50 లక్షల నుంచి రూ.6 కోట్ల వరకు ముడుపులు చెల్లించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని, పదవులను డబ్బుతో దక్కించుకోవాలనే ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జరిగిన ప్రతి ఘటనను పత్రికా మిత్రులు ప్రజల ముందుకు తీసుకెళ్లారని, ప్రజలు కూడా అన్ని విషయాలను గమనిస్తున్నారని తెలిపారు. రానున్న గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలైనా ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు, బెదిరింపులు, దౌర్జన్యాలు లేకుండా ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభ్యర్థులు, కార్యకర్తలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, పార్టీ నాయకత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బద్వేల్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను బరిలో నిలిపి, వారి విజయానికి నాయకులంతా సమష్టిగా కృషి చేస్తామని, ప్రజల మద్దతుతో కూటమి ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతామని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డి పోరుమామిళ్ల మండల అబ్జర్వర్ ఓబుల్ రెడ్డి ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా జనసేన పార్టీ నూతన కార్యాలయం ప్రారంభం

- పార్టీ బలోపేతానికి గ్రామస్థాయి కార్యాలయాలు కీలకం- జిల్లా అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్

- కూటమి ప్రభుత్వంలో గ్రామీణ అభివృద్ధికి పెద్దపీట.. పవన్ కళ్యాణ్ కృషి అభినందనీయం

ప్రజాభూమి, చక్రాయపేట





మండలంలోని నాగులగుట్టపల్లి గ్రామంలో జనసేన పార్టీ నూతన కార్యాలయాన్ని చాలపతి నాగ మల్లయ్య ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్ రిబ్బన్ కట్ చేసి నూతన కార్యాలయాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. అనంతరం నాగ మల్లయ్య శాలువా కప్పి, పూలమాల వేసి సుంకర శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్ శాఖ ద్వారా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, గోకులాల నిర్మాణం వంటి మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. జనసేన పార్టీ ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తోందని, పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. గ్రామస్థాయిలో పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేసుకోవడం పార్టీ బలోపేతానికి ఎంతో కీలకమని, కార్యకర్తలకు అందుబాటులో ఉండటంతో పాటు ప్రజా సమస్యలపై స్పందించడానికి, పార్టీ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడానికి దోహదపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ తరఫున సురభి గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా నాగ మల్లయ్యను నిలబెడుతున్నట్లు జిల్లా అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్ ప్రకటించారు. నాగ మల్లయ్యకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అండగా నిలిచి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.


నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేస్తూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పులివెందుల నియోజకవర్గ సమన్వయకర్తలు దాసరి రవిశంకర్, హరీష్, నాయకులు తుడిమెళ్ల మురళి, కోనేటి హరి వెంకటరమణ, సి. రామాంజనేయులు, సి. ప్రదీప్, పి. వెంకటరమణ, ఎన్. కిషోర్, ఎల్. కిరణ్, సి. రెడ్డి సాయి, చార్లెస్, ఫ్రాన్సిస్, అజయ్ వర్మ, అలీ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అరటి సాగులో సిగటోక ఆకుమచ్చ తెగులు నివారణపై రైతులకు అవగాహన

- గెలల సంరక్షణ, నాణ్యమైన దిగుబడుల సాధనపై ప్రత్యేక శిక్షణ

ప్రజాభూమి, వేంపల్లె





అరటి సాగులో సిగటోక ఆకుమచ్చ తెగులు నివారణ, గెలల సంరక్షణ, నాణ్యమైన దిగుబడుల సాధనపై తాళ్లపల్లి, బక్కన్నగారిపల్లి గ్రామాల రైతు సేవా కేంద్రాల పరిధిలో రైతులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పులివెందుల అరటి పరిశోధనా స్థానం తెగుళ్ల శాస్త్రవేత్త డాక్టర్ శిరీష, ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు పి. రవిచంద్రబాబు పాల్గొని రైతులకు సాగు సూచనలు అందించారు. ఈ సందర్భంగా రవిచంద్రబాబు మాట్లాడుతూ అరటి మొక్కలు నాటిన 20 రోజుల నుంచే ఎరువుల యాజమాన్యం ప్రారంభించాలని, పంట దశను బట్టి నీటిని అందించాలని సూచించారు. గెలల నాణ్యత పెంచేందుకు తగిన ఎరువులు పిచికారీ చేయడంతో పాటు గెలలకు తొడుగులు వేయాలని తెలిపారు. వీటికి ఉద్యాన శాఖ ద్వారా 50 శాతం రాయితీ, గరిష్ఠంగా రూ.25,500 వరకు సహాయం అందించే అవకాశం ఉందన్నారు. అనంతరం డా. శిరీష మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల కారణంగా అరటి తోటల్లో సిగటోక ఆకుమచ్చ తెగులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, రైతులు ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. తెగులు లక్షణాలను గుర్తించి శాస్త్రీయ సిఫార్సుల మేరకు మందులు పిచికారీ చేయాలని వివరించారు. అలాగే చీని, నిమ్మ తోటల్లో చెట్ల పాదుల వద్ద వీడ్ మ్యాట్ వేయడం ద్వారా కలుపు నివారణతో పాటు నేలలో తేమను కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి జి. రాఘవేంద్ర రెడ్డి, గ్రామ ఉద్యాన సహాయకులు సంతోష్ నాయక్, హారిక, తాళ్లపల్లి, బక్కన్నగారిపల్లి గ్రామాల అరటి రైతులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయితీ ఎన్నికల్లో పోలీసు వ్యవస్థ సక్రమంగా పని చేయాలి-మాజీ ప్రభుత్వ సలహాదారుడు నాగార్జున రెడ్డి

ప్రజాభూమి పోరుమామిళ్ల :



గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోలీసు వ్యవస్థ సక్రమంగా పనిచేయాలని మాజీ పంచాయతీ రాజ్ & రూరల్ డెవలప్మెంట్ ప్రభుత్వ సలహాలు నాగార్జున రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత జడ్పిటిసి. ఎంపీటీసీ ఎన్నికల్లో పోలీస్ శాఖ నిర్వహించిన పాత్ర పై సర్వత్ర దేశవ్యాప్తంగ. నేషనల్ మీడియాలో . ప్రెస్ లలో వచ్చిన వాస్తవాలను చూపించడం జరిగిందని. మేధావులు. ప్రజలు. ప్రతిపక్షాలు. వామపక్షాలు. విమర్శలు చేయడం జరిగింది. పోలీసు వ్యవస్థ కు ఒక మాయని మచ్చగా నిలిచిపోయిందని వామపక్ష నేతలు మేధావులు. ప్రజలు.ఘాటుగా విమర్శించారు. ఇప్పుడు జరగబోయే గ్రామపంచాయతీ ఎలక్షన్లో పార్టీ రహితంగా జరిగే ఎన్నికలు కాబట్టి. అధికార పార్టీకి గతంలో మాదిరిగా జరిగిన సంఘటనలు. మరలా జరగకుండా పోలీస్ శాఖ నిష్పక్షపాతంగా నిర్వహించాలని . పోలీస్ శాఖకు పోయిన పరువును నిలబెట్టుకోవాలని. సామాన్య ప్రజలు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా చూడాలని. గ్రామ ప్రజలు చే ఎన్నుకునే సర్పంచ్ ఎలక్షన్ కాబట్టి . గ్రామాల్లో సక్రమంగా ఎలక్షన్ జరపకపోతే గ్రామాల్లో కక్షలు. ఫ్యాక్షన్ జరిగే అవకాశం ఉన్నదని. దానికి ప్రభుత్వ అధికారులు బాధ్యత వలిచి ఉంటుంది అని. తప్పు చేసినవారికి కర్మ సిద్ధాంతం తప్పదని మరో రెండు సంవత్సరాల మళ్ళీ జగనన్న ముఖ్యమంత్రి కావడం ఖాయమని. అప్పుడు వారి పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవాలని నాగార్జున రెడ్డి అన్నారు.

మాజీ జడ్పీటీసీ లతా రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన పులివెందుల జడ్పీటీసీ భారతి యాదవ్

ప్రజాభూమి, పులివెందుల



ఇటీవల జరిగిన జడ్పీటీసీ ఎన్నికల్లో పులివెందుల మండల జడ్పీటీసీగా ఘన విజయం సాధించిన బొంగాని భారతి యాదవ్ బుధవారం సింహాద్రిపురంలోని పులివెందుల తెలుగుదేశం ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి స్వగృహంలో పులివెందుల మాజీ జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఇరువురు నాయకులు పరస్పరం ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. తన విజయానికి సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు భారతి యాదవ్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. పెద్దల అనుభవాన్ని, సూచనలను తీసుకుంటూ మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. పులివెందుల మండలంలో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులు, గ్రామాల్లో తాగునీటి సమస్య, రోడ్లు, డ్రైనేజీ, విద్య, వైద్య సౌకర్యాల కల్పన, మహిళా సాధికారత, పార్టీ బలోపేతం తదితర అంశాలపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, పార్టీలకు అతీతంగా అందరికీ అందుబాటులో ఉంటూ మండల అభివృద్ధికి కృషి చేస్తామని భారతి యాదవ్ ఈ సందర్భంగా తెలిపారు.అనంతరం మాజీ జడ్పీటీసీ లతా రెడ్డి మాట్లాడుతూ నూతన జడ్పీటీసీ భారతి యాదవ్ కి శుభాకాంక్షలు తెలియజేశారు. మండల అభివృద్ధిలో తన సంపూర్ణ సహకారం ఉంటుందని, ప్రజా సమస్యల పరిష్కారానికి కలిసి పని చేద్దామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పులివెందుల మండల తెలుగుదేశం అధ్యక్షుడు మర్తల జగన్మోహన్ రెడ్డి గారు, కొత్తపల్లె మాజీ సర్పంచ్ గంగాధర్ యాదవ్ , బాబు రెడ్డి , యర్రబల్లె సింగిల్ విండో అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి , లోమడ జయకుమార్ , అమర్నాథ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన న్యూస్ ఛానల్‌పై ఫిర్యాదు



ప్రజాభూమి, సిద్ధవటం: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదెల పవన్ కళ్యాణ్ వ్యక్తిగత, కుటుంబ విషయాలను సామాజిక మాధ్యమాల్లో హేళన చేస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన ఏవీఎం న్యూస్ ఛానల్‌పై సిద్ధవటం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు మాజీ విద్యా కమిటీ చైర్మన్ మునిస్వామి తెలిపారు. జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ ఆధ్వర్యంలో బుధవారం ఎస్పై హారికకు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ వ్యక్తిగత కుటుంబ విషయాలను అవమానకరంగా ప్రస్తావిస్తూ దుర్మామం కలిగించే విధంగా వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల సీనియర్ నేత అతికారి చిన్న వెంకటయ్య, ఏఎంసీ డైరెక్టర్ మహబూబ్ బాషా (బాబి), మైనార్టీ నేత గౌస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు ఘన నివాళి



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని భాకరాపేట సమీపంలోని ఏపీఎస్పీ 11వ పోలీస్ పటాలయం లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. పోలీస్ కమాండెంట్ ఆనంద్‌రెడ్డి ఆదేశాల మేరకు అసిస్టెంట్ కమాండెంట్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ దేశ విద్యారంగ అభివృద్ధి, జాతీయ సమైక్యత, స్వాతంత్ర్య ఉద్యమంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐలు, బెటాలియన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిశ్చితార్థ మహోత్సవానికి హాజరైన అతికారి కృష్ణ



ప్రజాభూమి, సిద్ధవటం: సిద్ధవటం మండలం మాధవరం--1 గ్రామ పంచాయతీ పరిధిలోని పార్వతీపురం గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సుధా మురళి కుమార్తె స్వాతి నిశ్చితార్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి కృష్ణ హాజరై నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి భవిష్యత్తు సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు శ్రీనివాస్ రాజు, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఆర్గనైజేషన్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీ అవ్వారు రవిశంకర్, ఏఎంసీ డైరెక్టర్ మహబూబ్ బాషా (బాబి), మాజీ వార్డు మెంబర్ సామల చెంగయ్య, చిన్న వెంకటయ్య, గౌస్, గంగయ్య, విజయ్, జగన్ తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

కలసపాడు యువకుడికి అంతర్జాతీయ గుర్తింపు



ప్రజాభూమి పోరుమామిళ్ల :

కడప జిల్లా కలసపాడు మండలంలోని తెల్లపాడు గ్రామానికి చెందిన సేవా తత్పరుడు, వివేకానంద ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకుడు పాపిజెన్ని రామకృష్ణారెడ్డికి అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన బెస్ట్ ఇన్స్పిరేషన్ అవార్డు లభించింది. మలేషియాలోని మెలాకాలో ఉన్న యూనివర్సిటీ టెక్నికల్ మలేషియా మెలాకాలో 14 నవంబర్ 2026 న జరగనున్న గ్లోబల్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ మరియు అవార్డ్స్ వేడుకలో భాగంగా గ్లోబల్ జ్ఞాన్ అకాడమీ ఈ అవార్డుకు రామకృష్ణారెడ్డిని ఎంపిక చేసినట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా గ్లోబల్ జ్ఞాన్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రుక్సానా హసన్ మాట్లాడుతూ, రామకృష్ణారెడ్డి సేవా ప్రయాణం మాకు ఎంతో స్ఫూర్తినిచ్చింది. వివేకానంద ఫౌండేషన్ సంస్థ ద్వారా ఆయన చేస్తున్న సేవ, సమాజం పట్ల ఆయనకున్న అంకితభావం, ఎంతో మంది జీవితాల్లో వెలుగు నింపుతోంది. అందుకే ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మంది ప్రముఖుల మధ్య నుండి ఆయనను బెస్ట్ ఇన్స్పిరేషన్ అవార్డుకు ఎంపిక చేయడం మాకు గర్వకారణం అని అన్నారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, తమ సేవలకు గుర్తింపు లభించినందుకు సంతోషంగా ఉందని, మరింత ఉత్సాహంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని అన్నారు. రామకృష్ణారెడ్డి తన సేవా కార్యక్రమాల ద్వారా ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆయనకు ఈ అంతర్జాతీయ గుర్తింపు లభించడం పట్ల కలసపాడు మండల వాసులు, సంస్థ శ్రేయోభిలాషులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు

- విద్యారంగ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం

- ఏపీసీసీ మీడియా చైర్మన్ డా. ఎన్. తులసి రెడ్డి



ప్రజాభూమి, వేంపల్లె

స్వర్గీయ మౌలానా అబుల్ కలాం ఆజాద్ గొప్ప స్వాతంత్ర్య సమర యోధుడని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నరెడ్డి తులసి రెడ్డి కొనియాడారు. బుధవారం వేంపల్లెలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ.. ఆజాద్ 1940 నుంచి 1946 వరకు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా, 1947 నుంచి 1958 వరకు దేశ తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రిగా సేవలందించారని తెలిపారు. విద్యాశాఖ మంత్రిగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, ఐఐటీలు, సంగీత నాటక అకాడమీ వంటి సంస్థల స్థాపనకు కృషి చేశారన్నారు. విద్యారంగ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, వాటికి గుర్తుగా నవంబర్ 11ను జాతీయ విద్యా దినోత్సవంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. భారత ప్రభుత్వం ఆయనకు భారతరత్న పురస్కారంతో గౌరవించిందని పేర్కొన్నారు. ఆజాద్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని, స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, రవీంద్రనాథ్ రెడ్డి, వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 8

గురువారం 12 నవంబరు 2026

రెండో విడత పంచాయతీ ఎన్నికలకు బి.ఎన్ కండ్రిగలో ఏర్పాట్లు పూర్తి!

ఆరు కేంద్రాల్లో నామినేషన్ల స్వీకరణ.. 28 గ్రామ పంచాయతీలకు ప్రత్యేక కేంద్రాల కేటాయింపు



ప్రజాభూమి ప్రతినిధి బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా, బి.ఎన్ కండ్రిగ మండలంలో రెండో విడత గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల స్వీకరణకు సంబంధించి ప్రత్యేక కేంద్రాలను కేటాయిస్తూ మండల అభివృద్ధి అధికారిణి వెంకట రత్నమ్మ, అధికారులు ప్రొఫార్మాను విడుదల చేశారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీలకు సంబంధించి మొత్తం ఆరు కేంద్రాల్లో నామినేషన్ల స్వీకరణ చేపట్టనున్నారు. ఎంపీడీవో కార్యాలయం స్పెషల్ ఆఫీసర్ గది, ఎంపీడీవో కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవో గది, ఆర్బీకే బి.ఎన్ కండ్రిగ, వెలుగు మీటింగ్ హాల్, హౌసింగ్ కార్యాలయం, బి.ఎన్ కండ్రిగ గ్రామ సచివాలయాన్ని నామినేషన్ కేంద్రాలుగా గుర్తించారు.

ముఖ్యమైన ఎన్నికల తేదీలు ఇవే..

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల: నవంబర్ 16, 2026.

నామినేషన్ల స్వీకరణ ప్రారంభం: నవంబర్ 18 నుంచి.

నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ: నవంబర్ 20, మధ్యాహ్నం 3 గంటల వరకు.

నామినేషన్ల పరిశీలన: నవంబర్ 21.

నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ: నవంబర్ 24.

పోలింగ్, ఓట్ల లెక్కింపు: నవంబర్ 29 (ఆదివారం).

పోలింగ్ రోజున ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించి, అనంతరం మధ్యాహ్నం 1 గంట నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏర్పాట్లు ఉంటాయని అధికారులు పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అభ్యర్థులు, రాజకీయ పార్టీలు తప్పనిసరిగా పాటించాలని, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ప్రజలు, అభ్యర్థులు సహకరించాలని అధికారులు సూచించారు.

చంద్రగిరి మండలంలో 16 ఎంపీటీసీ స్థానాలకు గాను 14 స్థానాల్లో టీడీపీ ఘన విజయం..!



ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:

చరిత్రలో ఎన్నడూ గెలవని స్థానాల్లో సైతం తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు విజయం సాధించడం పట్ల ఎమ్మెల్యే పులివర్తి నాని హర్షం వ్యక్తం చేశారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో చంద్రగిరి మండలం నుంచి తెలుగుదేశం పార్టీ తరఫున విజయం సాధించిన ఎంపీటీసీ అభ్యర్థులు ఎమ్మెల్యే పులివర్తి నానిని మర్యాదపూర్వకంగా కలిశారు.ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ....చంద్రగిరి మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఎంపీటీసీ సభ్యులకు సూచించారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డికి ఘన సత్కారం



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్

తిరుపతి రూరల్ మండలం జడ్పీటీసీగా విజయం సాధించిన చెవిరెడ్డి హర్షిత్ రెడ్డిని వలువురు పార్టీ నేతలు మంగళవారం ఘనంగా సత్కరించారు. హర్షిత్‌రెడ్డితో పాటు చంద్రగిరి నియోజకవర్గం పార్టీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డిలకు అభినందనలు తెలిపారు. ఎర్రావారిపాలెం మండలానికి చెందిన వైవీపాలెం యూత్ బబ్లూ ఆధ్వర్యంలో విజయోత్సవ కేక్‌ను కట్ చేయించారు. చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఫొటోతో కూడిన కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అలాగే తిరుపతి రూరల్ మండలం కూపుచంద్రపేట గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ జిల్లా విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి భానుప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు యువకులు గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎర్రావారి పాలెంకు చెందిన యువత సాదిక్, ధనుష్, ఆరీఫ్, బాను, రాజశేఖర్‌లతో పాటు తిరుపతి రూరల్ మండలం నుంచి ఈశ్వర్‌తేజ, విజయ్ భరత్, మోహన్, నవీన్‌రెడ్డి, కులదీప్‌లు పాల్గొన్నారు.

చెవిరెడ్డి హర్షిత్ రెడ్డికి ఘన సత్కారం..!



ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:

తిరుపతి రూరల్ మండలం జడ్పిటిసిగా విజయం సాధించిన చెవిరెడ్డి హర్షిత రెడ్డిని తిరపతి జిల్లా విద్యార్థి విభాగం సెక్రెటరీ నూరి చంద్రగిరి మండల సెక్రెటరీ సిద్ధిక్ భాష శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సత్కరించారు. ఈ నందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతి రూరల్ వైఎస్ఆర్ సిపి జెడ్పిటిసిగా గెలవడం పార్టీ శ్రేణులను మరింత ఉత్సాహాన్ని నింపిందని వారు తెలిపారు.

తాగునీటి నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

- ప్రతి ఆవాసంలో నీటి పరీక్షలు నిర్వహించాలి - జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్
- త్రాగు నీటి ఎద్దడి నివారణ కొరకు జిల్లాలో 13 మండలాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి
- త్రాగునీటి ఎద్దడి నివారణ కొరకు నిధులకు ఎలాంటి కొరత లేదు
- వివిధ సంక్షేమ వసతి గృహాలలో త్రాగునీటి నాణ్యత పై పరీక్షలు నిర్వహించి నివేదికలు సిద్ధం చేయాలి



ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు:

జిల్లాలో ప్రజారోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి నాణ్యతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో త్రాగునీటి ఎద్దడి నివారణపై జిల్లాలో ణజు,=ూూ శాఖకు చెందిన ఇంజనీర్లతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్సీ ఈ, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రతి గ్రామంలోని ప్రతి ఆవాస ప్రాంతంలో తాగునీటి నాణ్యతను పరీక్షించాలని తెలిపారు. ఏ ప్రాంతంలో నీరు సురక్షితంగా ఉంది, ఎక్కడ కలుషితమయ్యే ప్రమాదం ఉందో క్షేత్రస్థాయిలో గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు

కేవలం మౌలిక నదుపాయాల కల్పనకే పరిమితం కాకుండా, తాగునీటి నాణ్యతకు కూడా నమాన ప్రాధాన్యత ఇవ్వాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. నీటి నాణ్యత అనురక్షితంగా ఉన్న ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి కొత్త బోర్‌వెల్లు ఏర్పాటు చేయడం, పాత పైపులైన్లను మార్చడం, లీకేజీలను అరికట్టడం వంటి వనులకు ప్రతిపాదనలు నిద్ధం చేయాలన్నారు. ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూర్చే పనులకే నిధులు ప్రాధాన్యత క్రమంలో ఖర్చు చేయాలని స్పష్టం చేశారు. ప్రజలకు తాగునీటికి ఎక్కడ ఇబ్బంది పడకుండా ప్రజలు సురక్షితమైన తాగునీరు అందజేయాలని జిల్లా కలెక్టర్ హోదాలో ఆదేశించారు, రేపటినుండి త్రాగునీటి పనులు చేపట్టాలని ఆదేశించారు

ప్రతి మండలంలో కనీసం రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు తాగునీటి నరఫరా మెరుగుదలకు సంబంధించిన పనుల అంచనాలు సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన చోట కొత్త పైపులైన్లు వేయడం, తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయడం, నీటి నరఫరా వ్యవస్థకు మరమ్మతులు చేపట్టడం వంటి పనులను గుర్తించాలన్నారు. ముఖ్యంగా మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ కాలనీలతో పాటు జనాభా పెరిగినప్పటికీ తగిన తాగునీటి నదుపాయాలు లేని ఆవాస ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. నీటి ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించడానికి ప్రతి 15 రోజులకు ఒకసారి ట్యాంకులను శు ఖ్రపరచాలి. =ూూ శాఖకు చెందిన ట్యాంకుల శుభ్రతను ధృవీకరించాలి మరియు ఏవైనా అవకతవకలు గమనించినట్లయితే, శాఖకు చెందిన సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు నోటీసులు జారీ చేయాలి మరియు నోటీసులకు స్పందన రాకపోయినా, సంబంధిత ద్వారా జిల్లా కలెక్టర్‌కు తెలియజేయాలి. శాంతిపురం, గుడిపల్లి, వీకోట, యాదమర్రి, పెద్ద పంజాని , కుప్పం, రామ కుప్పం, వ్యాతలవట్టు, తదితర మండలాలు పై సమీక్షించారు. గ్రామ పంచాయతీలకు అందుబాటులో ఉన్న నిధులు పరిమితమైనవని, వాటిని ప్రజల సంక్షేమం కోనం బాధ్యతాయుతంగా వినియోగించాలని కలెక్టర్ పేర్కొన్నారు. గతంలో చేపట్టిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల చెల్లింపులపై సంబంధిత అధికారులతో నమన్వయం చేసుకుని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫైనాన్స్ కమిషన్, జెడ్పీ గ్రాంట్ల ద్వారా చేపట్టిన వనుల బిల్లులను నిబంధనల ప్రకారం పరిశీలించి చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. వివిధ సంక్షేమ వసతి గృహాలలో త్రాగునీటి నాణ్యత పై పరీక్షలు నిర్వహించి నివేదికలు సిద్ధం చేయాలి ఆదేశించారు, ప్రతి రెండు నెలలకు ఒకసారి వసతి గృహాలను సందర్శించి విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందజేయాలని ఆదేశించారు,ఈ కార్యక్రమాలను ఎంపీడీవోలు, సంబంధిత ఇంజినీరింగ్, గ్రామీణ నీటి నరఫరా, వంచాయతీరాజ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు

ఎన్నికల్లో అధికార పార్టీ అక్రమాలపై సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణ నిరసన కార్యక్రమం




ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ అక్రమాలు, ప్రజాస్వామ్య విరుద్ధ విధానాలకు నిరసనగా సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య, సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి మాట్లాడుతూ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధంగా జరిగాయని విమర్శించారు. అధికారాన్ని, పోలీసు యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయడం, యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడటం ప్రజాస్వామ్య వ్యవస్థకు గొడ్డలిపెట్టులాంటిదని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛగా ఓటు వేసే హక్కు, ఎన్నికల్లో పోటీ చేసే హక్కు ఉన్నాయని, ఆ హక్కులను కాలరాయడం సరికాదని పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలుపు కోసం అడ్డదారులు తొక్కడం ప్రజాస్వామ్య విలువలను దిగజార్చడమేనని విమర్శించారు. ప్రభుత్వాలు ప్రజల విశ్వాసాన్ని పొందేలా పాలన సాగించాలి తప్ప అధికార దుర్వినియోగంతో ఎన్నికల్లో గెలవాలని చూడకూడదని హితవు పలికారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం వామపక్ష పార్టీలు నిరంతరం ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తాయని, ఎన్నికల్లో జరిగిన అక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు యువతను, ప్రజాస్వామ్యవాదులను చైతన్యపరుస్తామని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ నియోజకవర్గ నాయకులు మించల శివకుమార్, సిహెచ్ శివ, రోడ్డ గోపి, శ్రీనివాసులు, మణి ,స్టీట్ వెండర్స్ నాయకులు జనార్దన్ మురళి , ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా సహాయ కార్యదర్శి కోగిలి.మునిచందు, సిపిఎం పార్టీ నాయకులు అంగేరి పుల్లయ్య ,సుబ్రహ్మణ్యం, ప్రసాదు ,వెలివేంద్రం అన్వర్ భాష ,ఉస్మాన్ భాష తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎస్ఏ-1 పరీక్షల నిర్వహణను పరిశీలించిన ఎంఈఓ రవీంద్రనాథ్

బి.ఎన్. కండ్రిగ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్ఎల్ఓతో కలిసి పరీక్షల తనిఖీ



ప్రజా భూమి ప్రతినిధి -- బుచ్చినాయుడు కండ్రిగ:

తిరుపతి జిల్లా, బి.ఎన్. కండ్రిగ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్ఏ-1 పరీక్షలను మండల విద్యాశాఖ అధికారి కె. రవీంద్ర నాథ్ ఎస్ఎల్ఓతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరుగుతున్న పరీక్షల నిర్వహణ తీరును క్షుణ్ణంగా పరిశీలించి, విద్యార్థులు పరీక్షలు రాస్తున్న విధానాన్ని పర్యవేక్షించారు.పరీక్షల నిర్వహణలో ఉపాధ్యాయులు తీసుకుంటున్న జాగ్రత్తలు, విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, పరీక్షా కేంద్రంలో నెలకొన్న పరిస్థితులను పరిశీలించారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షల సమయంలో సమయపాలన పాటిస్తూ, నిబంధనలకు అనుగుణంగా పరీక్షలను నిర్వహించాలని ఉపాధ్యాయులకు తెలియజేశారు విద్యార్థుల విద్యా ప్రమాణాలను అంచనా వేయడంలో సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు కీలకమని, విద్యార్థుల్లోని అభ్యసన సామర్థ్యాలను గుర్తించేందుకు ఈ పరీక్షలు దోహదపడతాయని తెలిపారు పరీక్షల ఫలితాల ఆధారంగా విద్యార్థులలో ఉన్న విద్యాపరమైన లోపాలను గుర్తించి, వారికి మరింత మెరుగైన బోధన అందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు నిరంతరం మార్గనిర్దేశం చేయాలని ఎంఈఓ రవీంద్రనాథ్ పేర్కొన్నారు ఈ సందర్భంగా పాఠశాలలో పరీక్షల నిర్వహణకు సంబంధించిన పలు అంశాలను పరిశీలించారు

ప్రశాంతంగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలి...

నాయుడుపేట పట్టణ సీఐ తురక వెంకటరమణ..



ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట

తిరుపతి జిల్లా నాయుడుపేటలో త్వరలో జరగనున్న పంచాయతీ సర్పంచ్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు మండల ప్రజలు సహకరించాలని నాయుడుపేట పట్టణ సీఐ టి. వెంకట రమణ అన్నారు. బుధవారం నాయుడుపేట పట్టణ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా జరిగేలా పోలీసు శాఖ తగు చర్యలు చేపడుతుందని తెలిపారు. ఎన్నికల సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో 30 పోలీస్ యాక్ట్,144 సెక్షన్లు అమలులో ఉంటాయని తెలిపారు.ఎన్నికల సమయంలో అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకూడదని తెలిపారు.రాజకీయ పార్టీల నాయకులు,కార్యకర్తలు,గ్రామ ప్రజలు ఎన్నికల నిబంధనలను పాటించాలని సూచించారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు, వివాదాలకు దూరంగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్సై కె శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హరిహర పుత్రునికి విశేష పూజలు

దీక్షా సమయంలో నియమాలను భక్తిశ్రద్ధలతో పాటించాలి -గురుస్వామి వెంకట్రామిరెడ్డి



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల పట్టణంలోని పార్నపల్లి రోడ్డు కోతి సమాధి సమీపంలో ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారాన్ని పురస్కరించుకుని స్వామివారికి పంచామృతాభిషేకం, అన్నదాన కార్యక్రమాలతో కూడిన విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో భాగంగా స్వామి వారికి గురు స్వామి వెంకటరామిరెడ్డి , ఆలయ ప్రధాన అర్చకులు పుష్పేంద్ర గౌతమ్ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం, అష్టోత్తరం అనంతరం ప్రత్యేక అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అయ్యప్ప శరణు ఘోషతో ఆలయ ప్రాంగణం ధ్వనించింది. ఈ సందర్భంగా గురుస్వామి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ దీక్షా సమయంలో కఠినమైన నియమాలను భక్తిశ్రద్ధలతో , నిబద్ధతతో ఆచరించడం ద్వారానే స్వామి వారి అనుగ్రహం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని వివిధ గ్రామాల నుండి గురుస్వామి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో అనేకమంది మాలాధారణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అయ్యప్ప భక్త జనానికి మధ్యాహ్న భోజనం , రాత్రికి అల్పాహార ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి

ఘన నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్



ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి

దేశ సమైక్యత, మత సామరస్యం, విద్యాభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ విశేష కృషి చేశారని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ మీటింగ్ హాల్ నందు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఘన నివాళులు అర్పించారు. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడతూతూ.. భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, గొప్ప విద్యావేత్త మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని అన్నారు. దేశ సమైక్యత, మత సామరస్యం, విద్యాభివృద్ధికి విశేష కృషి అందించారన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ 1888 నవంబర్ 11న జన్మించారని, స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించి దేశంలో విద్యా రంగ అభివృద్ధికి పునాది వేశారన్నారు. ప్రజలందరికీ నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలని ఆకాంక్షించిన ఆయన, ఉన్నత విద్య, సాంకేతిక విద్య, పరిశోధన రంగాల అభివృద్ధికి విశేష ప్రాధాన్యత ఇచ్చారు. భారతీయ విద్యా వ్యవస్థ అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ఆయన జన్మదినమైన నవంబర్ 11వ తేదీని జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని , విద్య ద్వారానే సమాజ అభివృద్ధి, దేశ ప్రగతి సాధ్యమనే ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు 9
గురువారం 12 నవంబరు 2026

చంద్రగిరిలో ఎన్డీఏ కూటమి ఘన విజయం

ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు -ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

చంద్రగిరి నియోజకవర్గంలో ఎన్డీఏ కూటమికి ఘన విజయం.. ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలను ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతి ప్రెస్ క్లబ్లో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో చంద్రగిరి నియోజకవర్గ ప్రజలు ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు అఖండ విజయాన్ని అందించారని ఎమ్మెల్యే పులివర్తి నాని గారు తెలిపారు. మొత్తం 96 ఎంపీటీసీ స్థానాలకు గాను 82 స్థానాలు, 6 ఎంపీపీ స్థానాలు, 3 జడ్పీటీసీ స్థానాల్లో కూటమి విజయం సాధించిందని, ఈ విజయాన్ని అందించిన ప్రజలందరికీ పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. 1983 నుంచి తెలుగుదేశం పార్టీ గెలవని స్థానాల్లో, 15 నుంచి 40 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ప్రాంతాల్లో సైతం కూటమి జెండా ఎగురవేయడం కార్యకర్తల సత్తాకు నిదర్శనమని పేర్కొన్నారు. ఎంపీటీసీ ఎన్నికల్లో 52.6 శాతం, జడ్పీటీసీ ఎన్నికల్లో 49.6 శాతం ప్రజలు కూటమికి మద్దతుగా నిలిచారని



తెలిపారు. ప్రతి కార్యకర్తకు అవకాశం కల్పిస్తూ అభ్యర్థులకు టికెట్లు ఇచ్చి, వారి గెలుపు కోసం తన సొంత ఖర్చులతో కృషి చేశానని చెప్పారు. ఏకగ్రీవాల కోసం ప్రయత్నించకుండా ప్రజాస్వామ్య వ ద్ధతిలో ప్ర జాక్షేత్రంలోనే ఎన్నికలను ఎదుర్కొన్నామని స్పష్టం చేశారు.

తిరుపతి రూరల్ జడ్పీటీసీ ఫలితంపై న్యాయపోరాటం

తిరుపతి రూరల్ జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ధనలక్ష్మిదే నైతిక విజయమని, ఫలితంపై న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. 538 ఓట్ల తేడా, ఇన్వాలిడ్ ఓట్ల అంశాలపై అనుమానాలు న్నాయని, రీకౌంటింగ్ కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని వెల్లడించారు. చంద్రగిరి, పాకాల, రామచంద్రాపురం, తిరుపతి రూరల్ మండలాల్లో రీకౌంటింగ్కు తాము సిద్ధమని ప్రకటించారు.

ఎన్నికల అక్రమాలపై ఆధారాలు బయటపెడతాం

పోలింగ్, కౌంటింగ్ సమయంలో దొంగ ఓట్లు, రిగ్గింగ్, అధికారులపై ఒత్తిళ్లు, ప్రలోభాలకు సంబంధించిన ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్ను త్వరలో బయటపెడతానని తెలిపారు. అక్రమాలకు పాల్పడిన వారిపై ఆధారాలతో సహా న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి గెలుపుపై ప్రశ్నలు లేవనెత్తుతూ, దొంగ ఓట్లు వేయించలేదని చెవిరెడ్డి కాణిపాకం ఆలయంలో ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. తన సతీమణి పులివర్తి సుధారెడ్డిపై సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేయాలని చెవిరెడ్డే ప్రోత్సహించారని ఆరోపించారు. మహిళల పట్ల తనకు గౌరవం ఉందని, చెవిరెడ్డి సతీమణిని సైతం గౌరవంగా నమస్కరించానని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై అవహేళన వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం చంద్రగిరి నియోజకవర్గం, తిరుపతి రూరల్ మండల పరిధిలో ఎన్డీఏ కూటమి, వైసీపీ, బీజేపీ, జనసేన తదితర పార్టీల తరఫున విజయం సాధించిన అభ్యర్థుల వివరాలను మీడియాకు వెల్లడించారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

ప్రజలు కూటమికే పట్టం కట్టారు..

ధన బలాన్ని ప్రజాబలంతో ఓడించాం

- చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్

– చంద్రగిరి నియోజకవర్గంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ పెద్దల సహకారం, క్షేత్రస్థాయి కార్యకర్తల అలుపెరగని శ్రమ ఫలితంగానే ఎంపీటీసీలు అత్యధిక మెజారిటీలతో చారిత్రాత్మక విజయం సాధించారని చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని స్పష్టం చేశారు. అలుపెరుగని పోరాటంలో అపజయం పొందిన అభ్యర్థులు అధైర్యపడవద్దని ధైర్యం చెప్పారు. చంద్రగిరి మండలంలో ఘన విజయం సాధించిన నూతన ఎంపీటీసీలు, అలుపెరుగని పోరాటం చేసి ఓడిన అభ్యర్థులు నియోజకవర్గ పార్టీ కార్యాలయమైన రఘునాథ రిసార్ట్స్లో ఎమ్మెల్యే పులివర్తి నానిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా గెలుపొందిన ఎంపీటీసీలను ఘనంగా సత్కరించిన ఎమ్మెల్యే, రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత జవాబుదారీతనంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ, ఎన్నికల్లో ప్రత్యర్థులు విచ్చలవిడిగా డబ్బులు వెదజల్లి, ధన బలంతో తనను ఢీకొట్టాలని చూసినప్పటికీ విజ్ఞులైన ఓటర్లు ప్రలోభాలకు లొంగకుండా కూటమికే సంపూర్ణ మద్దతు ప్రకటించారని కొనియాడారు. తాను నమ్ముకున్న ప్రజలు తన నమ్మకాన్ని ఏనాడూ వమ్ము చేయలేదని, ప్రజాస్వామ్యంలో ప్రజాతీర్పే అత్యున్నతమైనదని స్పష్టం చేశారు. గ్రామాల్లోని పెద్దలను, ప్రజలను సమన్వయం చేసుకుంటూ ప్రజాబలంతోనే అభ్యర్థులను రంగంలోకి దించామని, ఎండనక వాననక కష్టపడి పనిచేసిన ప్రతి తెలుగుదేశం, కూటమి కార్యకర్తకు ఈ గెలుపు అంకితమని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రతి గ్రామంలో సమస్యల పరిష్కారానికి నూతన ఎంపీటీసీలు చొరవ చూపి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

వేమూరులో ఘనంగా రైతు సదస్సు

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్

ఎస్ఎంజిఆర్ వ్యవసాయ కళాశాల, ఉదయగిరి ఆధ్వర్యంలో రావెప్ కార్యక్రమంలో భాగంగా బుధవారం తిరుపతి రూరల్ మండలం వేమూరు గ్రామంలో రైతు సదస్సు ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ విద్యార్థులకు క్షేత్రస్థాయి అనుభవాన్ని అందించడంతో పాటు, రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, విద్యార్థినులు, గ్రామ పెద్దలు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా డిపిఎం షణ్ముగం మాట్లాడుతూ, పుస్తక జ్ఞానంతో పాటు ఆచరణాత్మక జ్ఞానం చాలా అవసరమని, రావెప్ ద్వారా పొందిన అనుభవాన్ని భవిష్యత్తులో మంచి వ్యవసాయ పారిశ్రామికవేత్తగా ఎదగడానికి ఉపయోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రముఖ ప్రకృతి వ్యవసాయ రైతు అయ్యప్పనాయుడు మాట్లాడుతూ, ప్రకృతి



వ్యవసాయం ప్రాముఖ్యతను వివరించారు. ప్రకృతిలో లభించే వనరులను ఉపయోగించుకుని, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి ఎలా సాధించాలో రైతులకు తెలియజేశారు. రసాయనాలు లేకుండా భూమిని కాపాడుకుంటూ వ్యవసాయం చేయాలని పిలుపునిచ్చారు. జీవ ఎరువుల అధికారి డా. రవీంద్ర రెడ్డి మాట్లాడుతూ, వ్యవసాయంలో జీవ ఎరువుల వినియోగం, వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి వారు సాగు చేస్తున్న వంటల వివరాలను తెలుసుకున్నారు. కీటక విభాగ శాస్త్రవేత్త డా. హారతి మాట్లాడుతూ, వేరుశనగ పంటలో వచ్చే వివిధ రకాల పురుగులు, తెగుళ్లు, వాటి నివారణ చర్యల గురించి రైతులతో చర్చించారు. ఎస్ఎంజిఆర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా. టి. గోపి కృష్ణ మాట్లాడుతూ, కళాశాల గొప్పతనాన్ని, రావెప్, రైతు సదస్సు ప్రాముఖ్యతను వివరించారు. మొక్కల ప్రజనన శాస్త్రవేత్త డా. కె. జాన్ మాట్లాడుతూ, వేరుశనగలో హిమాని, కోనూరు, టిసిజిఎస్ 2117 రకాల లక్షణాలను సంక్షిప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తల బృందం, మండల వ్యవసాయ అధికారులు, గ్రామ పెద్దలు, రైతులు, విద్యార్థినులు చురుకుగా పాల్గొని విజయవంతం చేశారు.

రూ. 500 లతో తిరుపతి కపిలతీర్థంలో కార్తీకమాసం విశేష హోమాలు, ప్రత్యేక పూజలు

ప్రజా భూమి ప్రతినిధి – తిరుపతి

పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకుని తిరుపతిలోని ప్రముఖ శైవక్షేత్రం శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో నెల రోజుల పాటు విశేష హోమాలు, ప్రత్యేక పూజలు జరుగనున్నాయి. ఈ హోమ మహోత్సవాలకు మంగళవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది.డిసెంబర్ 8వ తేదీ వరకు ఈ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. దీనికి సంబంధించిన ఏర్పాట్లన్నీ ఇప్పటికే పూర్తయ్యాయి. అంకురార్పణలో భాగంగా గణపతి పూజ, పుణ్యాహవచనం, వాస్తుపూజ, పర్యన్నీకరణం, మృత్సంగ్రహణం, అంకురార్పణ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం కలశస్థాపన, అగ్నిప్రతిష్ఠ, లఘుపూర్ణాహుతి చేపట్టారు. బుధవారం శ్రీగణపతి హోమంతో ఈ ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.రేపు, ఎల్లుండి శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారి హోమాన్ని నిర్వహిస్తారు. 14న ధర్మశాస్త్ర హోమం, 15న శ్రీ నవగ్రహ హోమం జరుగనున్నాయి. 16న శ్రీ దక్షిణామూర్తి, 17న శ్రీ కాలభైరవస్వామి హోమాలను చేపడతా



రు. ఆ తర్వాత 18 నుంచి 26వ తేదీ వరకు శ్రీ కామాక్షి అమ్మవారి చండీహోమం నిర్వహిస్తారు. 27 నుంచి డిసెంబర్ 7వ తేదీ వరకు శ్రీ కపిలేశ్వరస్వామివారి రుద్రహోమం, 8న శ్రీ చండికేశ్వరస్వామివారి హోమం ఉంటాయి. ఈ రెండు కీలకమైనవిగా భావిస్తారు అశేష భక్తులు. చివరి రోజున త్రిశూలస్నానం, పంచమూర్తుల తిరువీధి ఉత్సవంతో ఇవి ముగుస్తాయి. భక్తులు ఇద్దరు గృహస్తులు కలిపి రూ. 500 చెల్లించి ఒక రోజు హోమంలో పాల్గొనవచ్చు. వారికి ఒక ఉత్తరీయం, రవికెతో పాటు అన్నప్రసాదం అందజేస్తారు. హోమాల్లో పాల్గొనే వారు తప్పనిసరిగా సంప్రదాయ వస్త్రధారణతో రావాల్సి ఉంటుంది. ఈ హోమ మహోత్సవాల్లో భాగంగా 15న శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారి కల్యాణోత్సవం జరుగుతుంది. 7న మాస శివరాత్రి సందర్భంగా శ్రీ శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఒక్కో కల్యాణోత్సవంలో ఇద్దరు గృహస్తులు పాల్గొనవచ్చు. శ్రీకపిలేశ్వరాలయంలో టీటీడీ 2012వ సంవత్సరం నుంచి ఈ హోమ మహోత్సవాలను నిర్వహిస్తూ వస్తోంది. ఏటా భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. హోమంలో పాల్గొనే వారి సంఖ్య కూడా పెరుగుతోంది. వ్యక్తిగతంగా ఈ హోమాలను నిర్వహించుకోవడం ఖర్చుతో కూడుకున్నది కావడంతో, సామాన్య భక్తులకు సైతం హోమ ఫలాన్ని పొందే అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో టీటీడీ సామూహికంగా వీటిని నిర్వహిస్తోంది.

తిరుమలలో స్మార్ట్ బస్టాప్ల నిర్మాణం!

ఉచిత ధర్మరథం బస్సులు ఆగే చోట్ల స్మార్ట్ బస్టాప్లు - మరింత సులభంగా, సౌకర్యవంతంగా మారనున్న భక్తుల రాకపోకలు

ప్రజా భూమి ప్రతినిధి – తిరుమల

తిరుమల గిరులపై భక్తుల రాకపోకలు మరింత సులభంగా, సౌకర్యవంతంగా మారనున్నాయి. ఉచిత ధర్మరథం బస్సులు ఆగే చోట్ల స్మార్ట్ బస్టాప్లు నిర్మించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ కార్యక్రమానికి రేమండ్స్ సంస్థ ముందుకు వచ్చి సహకారం అందించనుంది.ప్రస్తుతం తిరుమలలో ధర్మరథం బస్సులు ఆగే 21 పాయింట్లు ఉన్నాయి. వీటిలో ఐదు షెల్టర్లను ఆధునికీకరించి, మిగిలిన 16 చోట్ల కొత్తగా స్మార్ట్ బస్టాప్లు నిర్మించనున్నారు. మూడు దశల్లో ఈ పనులు జరుగుతాయి. మొదటి దశలో రాంభగీచా, లేపాక్షి కూడలి సమీపంలోని బస్టాప్లతో పాటు మరో ఒకటిని పెద్దగా, ఆధునికంగా తీర్చిదిద్దనున్నారు. తర్వాతి దశల్లో మిగిలినవి పూర్తి చేస్తారు.టీటీడీ ఇంజినీరింగ్ విభాగం ఇప్పటికే ఒక ఏఐ ఆధారిత స్మార్ట్ బస్టాప్ నమూనాను రూపొందించి రేమండ్స్ సంస్థకు పంపింది. ఈ కొత్త బస్టాప్లు కేవలం షెల్టర్లు మాత్రమే కాదు.



భక్తులు ఎండ, వర్షం, చలి నుంచి రక్షణ పొందేలా నిర్మిస్తారు. ప్రతి బస్టాప్లో డిజిటల్ డిస్ప్లేలు, సీసీ కెమెరాలు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, అత్యవసర సమయాల్లో ఉపయోగించుకునే ఎస్ఓఎస్ బటన్ వంటి సౌకర్యాలు ఉంటాయి. భక్తులకు అత్యంత ఉపయోగకరమైన అంశం క్యూఆర్ కోడ్ సౌకర్యం. ప్రతి బస్టాప్ వద్ద స్మార్ట్ క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేస్తారు. భక్తులు తమ మొబైల్ ఫోన్తో ఆ కోడ్ను స్కాన్ చేస్తే చాలు. వెంకటాద్రి యాప్ ద్వారా బస్సు రూట్ మ్యాప్, బస్సు ఎప్పుడు వస్తుంది, ఎంత సేపటికి గమ్యస్థానం చేరుకోవచ్చు వంటి వివరాలు వెంటనే తెలుస్తాయి. ఇప్పటికే తిరుమలలో 46 నుంచి 50 వరకు ఉచిత ఎలక్ట్రిక్ ధర్మరథాలు నడుస్తున్నాయి. రిలయన్స్, భారత్ బయోటెక్ వంటి సంస్థల విరాళాలతో ఈ సంఖ్య పెరిగింది. ప్రతి మూడు నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు. రోజుకు సుమారు 650 ట్రిప్స్ జరుగుతూ 85 వేల మంది భక్తులకు సేవలు అందుతున్నాయి. గతంలో భక్తులు ఆరుబయటే నిలబడి బస్సుల కోసం ఎదురుచూసేవారు. ఎండలో, వర్షంలో ఇబ్బంది పడేవారు. కొత్త స్మార్ట్ బస్టాప్లు వచ్చాక ఈ ఇబ్బంది తొలగిపోనుంది. ఒక్కో స్మార్ట్ షెల్టర్కు రూ.22 లక్షల నుంచి రూ. 30 లక్షల వరకు ఖర్చవుతుందని టీటీడీ అంచనా వేస్తోంది. రేమండ్స్ సంస్థ ప్రతినిధులు ఇటీవల తిరుమలకు వచ్చి ప్రస్తుత బస్ షెల్టర్లను పరిశీలించారు.ఎలక్ట్రిక్ బస్సుల వాడకం వల్ల తిరుమలలో కాలుష్యం గణనీయంగా తగ్గింది. ప్రైవేట్ వాహనాలపై ఆధారపడే పరిస్థితి కూడా మారుతోంది. భక్తులకు మరింత సౌకర్యం కల్పించే దిశగా టీటీడీ నిర్ణయం తీసుకుంది. త్వరలోనే ఈ స్మార్ట్ బస్టాప్లు రూపుదిద్దుకుని భక్తుల సేవలో నిలవనున్నాయి.

కాబోయే వధూవరులను ఆశీర్వదించిన భూమిరెడ్డి ఉమాదేవి

-హిమబిందు, సాయికుమార్ రెడ్డిల ఎంగేజ్‌మెంట్

ప్రజాభూమి, పులివెందుల

పులివెందుల పట్టణంలోని సాయి బృందావన్ ఫంక్షన్ హాల్లో బుధవారం జరిగిన ఎంగేజ్‌మెంట్ వేడుకకు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ గోపాల్ రెడ్డి సతీమణి భూమిరెడ్డి ఉమాదేవి హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు.లింగాల మండలం దొండ్లవాగు గ్రామానికి చెందిన చప్పిడి ప్రభాకర్ రెడ్డి, సంధ్యల కుమార్తె హిమబిందు, సాయికుమార్ రెడ్డిల ఎంగేజ్‌మెంట్ వేడుక ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా ఉమాదేవి వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, నూతన జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మహేశ్వర్ రెడ్డి, బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



జాతీయ స్థాయిలో 'సూపర్ స్వచ్ఛ లీగ్' అవార్డ్

సాధించిన తిరుపతి నగరపాలక సంస్థ

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా స్వచ్ఛ సర్వేక్షన్ 2025–26 జాతీయ పురస్కారాన్ని మంత్రి నారాయణ, ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, తిరుపతి నగరపాలక సంస్థ





కమిషనర్ ఎం.జయకృష్ణ బుధవారం అందుకున్నారు. కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ సర్వేలో తిరుపతి కి వరుసగా నాల్గవసారి కూడా జాతీయ స్థాయిలో అవార్డు దక్కించుకుంది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ జాతీయ పురస్కారాన్ని అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, ఈ విజయం నగర ప్రజల సహకారం, పారిశుధ్య కార్మికుల కష్టానికి, అధికారుల సమష్టి కృషి వల్లే దక్కిందని తెలిపారు. భవిష్యత్తులో నగరాన్ని మరింత సుందరంగా, శుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఇంటింటి చెత్త సేకరణ, మరుగుదొడ్ల నిర్వ హణ, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, డంపింగ్ యార్డుల్లో చెత్త నిల్వల్ని తగ్గించడం, ప్రభుత్వ గోడలపై బొమ్మలు, సుందరీకరణ, వ్యర్థాల నుంచి పరికరాల తయారీ, ఈ- వేస్ట్ సేకరణ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని స్వచ్ఛత పోటీల్లో అధికారులు చేసిన కృషి ఫలి తంగా ఈ అవార్డు దక్కింది. రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందు కోనుండడం తమ బాధ్యత మరింత పెంచిందని కమిషనర్ జయకృష్ణ చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ శారదా దేవి, డి.ఈ.రమణ, మస్తాన్, తదితరులు ఉన్నారు.

రానున్న పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో టిడిపి నేతల విస్తృత పర్యటన

- కూటమి అభ్యర్థుల విజయానికి సమన్వయంతో పనిచేయాలని పిలుపు

- టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి

ప్రజాభూమి, వేంపల్లె



రానున్న పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం గిడ్డంగి వారిపల్లె, బక్కన్నగారిపల్లె, టి. వెలమవారిపల్లె, తాళ్లపల్లి, అశోక్‌నగర్ గ్రామాల్లో టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి రవితేజ రెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని కూటమి నాయకులు, కార్యకర్తలను కలిసి ఎన్నికల ప్రచారం, కూటమి అభ్యర్థుల విజయానికి చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి, సీనియర్ నాయకులు మహమ్మద్ షఫీర్, బాలస్వామి రెడ్డి, మహమ్మద్, వీరభద్ర, నామా వేమకుమార్, వెంకటస్వామి, సుధాకర్ రెడ్డి, రామాంజనేయులు రెడ్డి, గణేష్ నాయక్, రాజా నాయక్, మోహన్, యాసిన్, గంగాధర్ రెడ్డి, మారుతి, రమణ, డక్కా రమేష్, శీను, గండికోట శివ, నాగేష్, బీజేపీ నాయకురాలు పుష్పలత నాయక్ తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాభూమి
జనరల్ 10
గురువారం 12 నవంబరు 2026

పల్లె పల్లెనా కూటమి జయకేతనం ఎగురవేయండి

గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం
ప్రతి పల్లెలో తెలుగుదేశం జెండా రెపరెపలాడాలి
- బీటెక్ రవి



ప్రజాభూమి, పులివెందుల :
పులివెందుల నియోజకవర్గంలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి, పల్లెల సమగ్ర అభివృద్ధికి బాటలు పరచాలని పులివెందుల నియోజకవర్గ తెలుగుదేశం ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి ప్రజలకు, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలోని ప్రతి వల్లెలో నూ తెలుగుదేశం పార్టీ జెండాను రెపరెపలాడించే విధంగా కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో కృషి చేయాలని కోరారు.రాష్ట్రంలో ఏర్పాటైన కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, గ్రామీణాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందని, గ్రామాల్లో మౌలిక వసతులు, రహదారులు, తాగునీరు తదితర సమస్యల పరిష్కారానికి కూటమి మద్దతుదారుల గెలుపు అత్యంత ఆవశ్యకమని స్పష్టం చేశారు.పంచాయతీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను, పథకాలను ప్రతి ఇంటికీ వివరించి ఓటర్ల మద్దతు కూడగట్టుకోవాలన్నారు

ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి

ప్రజాభూమి,వేముల
సహకార సంఘాల ఎన్నికల నేపథ్యంలో నల్లచెరువు పల్లె ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలోని సభ్యులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని నల్లచెరువు పల్లె సహకార సంఘం సీఈఓ నాగరాజ రావు తెలిపారు. ఈ-కేవైసీ పూర్తిచేయని సభ్య లను ఓటరు జాబితాలో అనర్హులుగా పరిగణించే అవకాశం ఉందని, కావున సభ్యులందరూ ఆలస్యం చేయకుండా తమ ఈ-కేవైసీ నల్లచెరువు పల్లె ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో పూర్తి చేసుకోవాలని తెలిపారు. నల్లచెరువు పల్లె ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో రూ.300పైన ఉన్న సభ్యులందరూ ఓట ర్లుగా అర్హత కలిగి ఉంటారని పేర్కొన్నారు. స్వల్ప కాలిక, దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న సభ్యులం దరూ వడ్డీలు చెల్లించాలని, తమ రుణాలను రెగ్యులర్ చేయించుకోవాలని ఆయన కోరారు

కలం, గళం, నాయకత్వంతో దేశ ప్రజల్లో చైతన్యం నింపిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్
- రాజంపేట పార్లమెంట్ జనసేన ఇన్ ఛార్జి
యల్లటూరు శ్రీనివాసరాజు

ప్రజా భూమి ప్రతినిధి - రాజంపేట
కలం, గళం, నాయకత్వంతో దేశ ప్రజల్లో చైతన్యం నింపిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని ఆయన ఆశయాలు, సేవలు, త్యాగాలు తరతరాలకు స్ఫూర్తి అని రాజంపేట పార్లమెంట్ జనసేన ఇన్ ఛార్జి యల్లటూరు శ్రీనివాసరాజు పేర్కొన్నారు. బుధవారం స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా యల్లటూరు శ్రీనివాసరాజు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సమరంలో తన కలంతో, గళంతో, నాయకత్వంతో దేశ ప్రజల్లో చైతన్యం నింపిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని, స్వాతంత్ర్యం కోసం పోరాడటమే కాకుండా, స్వతంత్ర భారతదేశ నిర్మాణంలో విద్య, విజ్ఞానం, మతసామరస్యం, జాతీయ సమైక్యతకు విశేష ప్రాధాన్యతనిచ్చిన దార్శనికుడని కొనియాడారు. విద్య అనేది ప్రతి ఒక్కరి హక్కు, మతం వేరైనా మనమంతా భారతీయులమే అనే సందేశాన్ని తన జీవితంతో చాటిచెప్పిన మహనీయుడని, కులమతాలకు అతీతంగా ఐక్యతతో జీవిస్తూ, భావితరాలకు విద్యను అందించి, దేశాభివృద్ధిలో భాగస్వాములవ్వడమే ఆ మహనీయుడికి మనం అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు అవగాహన
- శనగ, పత్తి పంటలపై రైతులకు అవగాహన కల్పించిన బాలగంగాధర్ రెడ్డి

ప్రజాభూమి, వేంపల్లె
రైతులు శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి ఈ. బాలగంగాధర్ రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని అలవలపాడు, ముతుకూరు గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఫార్మర్ ఫీల్డ్ స్కూల్ శిక్షణలో భాగంగా శనగ పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చీడపీడలు, తెగుళ్ల నివారణ పద్ధతులను బాలగంగాధర్ రెడ్డి వివరించారు. రబ్బరు పురుగు నివారణకు ఎకరాకు 80 గ్రాముల ఇమామెక్టిన్ బెంజోయేట్, ఎండు తెగులు నివారణకు లీటరు నీటికి 2 మి.లీ. హెక్సాకొనజోల్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే శనగ పచ్చపురుగు, మొదలుకుళ్లు తెగుళ్ల నివారణకు తగిన మందులను సూచించిన మోతాదులో ఉపయోగించాలని తెలిపారు. అనంతరం కపాస క్రాంతి పత్తి పథకంపై బాలగంగాధర్ రెడ్డి అవగాహన కల్పిస్తూ, పత్తి పంటలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. ప్రతి రైతు రైతు గుర్తింపు కార్డు (ఫార్మర్ ఐడీ) తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



హెలికాప్టర్ నడిపిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి
- కొండలు, నదుల మీదుగా జాలీ రైడ్ - పైలట్‌గా మారిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి

ప్రజాభూమి, - ధర్మవరం
వైఎస్సార్‌సీపీ నేత, ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి మరోసారి పైలట్‌గా మారారు. ఆయన స్వయంగా హెలికాప్టర్ నడిపి అదరగొట్టారు.. ప్రస్తుతం సోషల్ మీడియాలో వీడియో వైరల్ అవుతోంది. ఆయన విదేశీ పర్యటనలో భాగంగా హెలికాప్టర్‌ను నడిపినట్లు చెబుతున్నారు. ఫ్రాన్స్‌లోని రీయూనియన్ ద్వీపంలో హెలికాప్టర్ రైడ్‌ను ఎంజాయ్ చేసినట్లు తెలుస్తోంది. అలా పర్వతాల మధ్యలో నుంచి నదుల మీదుగా ఈ హెలికాప్టర్ రైడ్ కొనసాగింది. కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి మల్టీ టాలెంటెడ్ అంటూ వైఎస్సార్‌సీపీ కేడర్ వీడియోను ట్వీట్ చేస్తున్నారు.కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి గతేడాది మార్చి నెలలో ఓ వీడియోను ట్వీట్ చేశారు. కేతిరెడ్డి హైదరాబాద్‌లో ప్రైవేట్ జెట్‌ను స్వయంగా నడిపారు. 'కల నిజమైంది' జెట్‌ను నడిపిన వీడియోను ఆయన ట్వీట్ చేశారు. 'అధికారికంగా



పైలట్ అయ్యాను.. ఇది ప్రారంభం మాత్రమే. ఈ ప్రయాణంలో నాకు మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. రాబోయే రోజుల్లో ఇలాంటి సాహసాలు మరెన్నో ఉంటాయి' అంటూ కేతిరెడ్డి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇప్పుడు మరోసారి హెలికాప్టర్ రైడ్‌తో అదరగొట్టారు.. వెంకట్రామిరెడ్డి పైలట్ శిక్షణ తీసుకున్నారు. అప్పుడప్పుడు ఇలా ప్రైవేట్ జెట్, హెలికాప్టర్ వంటివి నడిపి వార్తల్లో నిలుస్తున్నారు. కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి 2006లో రాజకీయాల్లోకి వచ్చారు. తన తండ్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి నూర్యప్రతావరెడ్డి మరణం తర్వాత.. వెంకట్రామిరెడ్డి ఉద్యోగాన్ని వదిలి పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు. ఆయన 2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేసి గెలుపొంది.. తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. అనంతరం ఆయన వైఎస్సార్‌సీపీలో చేరి.. 2014లో జరిగిన ఎన్నికల్లో ధర్మవరం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం ధర్మవరం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా పని చేసి.. 2019లో జరిగిన ఎన్నికల్లో మళ్లీ ధర్మవరం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున మరోసారి ధర్మవరం నియోజకవర్గం నుంచి పోటీచేసి బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ చేతిలో ఓడిపోయారు. ఓవైపు రాజకీయాల్లో బిజీగా ఉంటూనే మరోవైపు ఇలా పైలట్‌గా అదరగొడుతున్నారు కేతిరెడ్డి.

విద్యారంగ అభివృద్ధికి ఆజాద్ సేవలు చిరస్మరణీయం.....
జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి....



ప్రజా భూమి ప్రతినిధి - కడప క్రైం
భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. దేశ విద్యారంగ అభివృద్ధికి ఆజాద్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఐఐటీ, యూజీసీ వంటి విద్యాసంస్థల ఏర్పాటుకు పునాదులు వేసి, ఉన్నత విద్యాభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆయన దేశానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. భారతరత్న పురస్కారం పొందిన ఆజాద్ జీవితం, ఆశయాలు నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. విద్య, జాతీయ సమైక్యతకు ఆయన అందించిన స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ కొనసాగించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లో లక్ష్యసాధనకు విద్యే పునాది - ఎంపీజే



ప్రజా భూమి ప్రతినిధి - ప్రొద్దుటూరు
విద్యార్థుల్లో విద్య పట్ల ఆసక్తి పెంపొందించి, మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలను తెలియజేసే లక్ష్యంతో బుధవారం ఎంపీజే ఆధ్వర్యంలో స్థానిక ఇస్లామిక్ హైస్కూల్‌లో జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప విద్యాశాఖ అధికారి శివప్రసాద్, మండల విద్యాశాఖ అధికారి శోభారాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే స్పష్టమైన లక్ష్యాలను ఏర్పరచుకుని క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. పదో తరగతిలో వందశాతం ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని, ఉపాధ్యాయులు విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలని కోరారు. ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం భాష విద్యా ప్రాముఖ్యతను వివరించగా, రాయలసీమ ఇన్‌చార్జి ఎండీ అయూబ్ ఖాన్ చదువుపై శ్రద్ధ చూపాలని, సెల్‌ఫోన్ల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. అనంతరం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవిత చరిత్రపై వ్యాసరచన, వ్యక్తిత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీజే జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రి, పట్టణ అధ్యక్షుడు హుస్సేన్ భాష, కార్యదర్శి మహమ్మద్ రఫీ, సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షాహిద్, కరస్పాండెంట్ ఉమర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయించి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలి



ప్రజా భూమి ప్రతినిధి - మైదుకూరు
విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యత ఇవ్వాలని డాక్టర్ సుప్రియ సూచించారు. జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం లెక్కలవారి పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఆధ్వర్యంలో విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుప్రియ మాట్లాడుతూ పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం, తగినంత నిద్రపోవడం, మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండటం, క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా విద్యార్థుల అభ్యున్నతికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కే. నరసింహులు, గణిత ఉపాధ్యాయురాలు చంద్రకళ, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గజ్జల వెంకటేశ్వర రెడ్డి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ చెల్లింపుల దిశగా ప్రొద్దుటూరు మున్సిపాలిటీ అడుగులు



ప్రజా భూమి ప్రతినిధి - ప్రొద్దుటూరు
మున్సిపల్ కార్యాలయంలో ప్రజలకు అందించే సేవలను మరింత సులభతరం చేసేందుకు చెల్లింపుల వ్యవస్థలో డిజిటల్ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కౌంటర్ల వద్ద పన్నులు, ఇతర రుసుముల వసూళ్లను నగదు రహిత విధానంలో నిర్వహించేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రస్తుతం నగదు రూపంలో జరుగుతున్న లావాదేవీలను క్రమంగా తగ్గించి, యూపీఐ, క్యూఆర్ కోడ్ వంటి ఆధునిక చెల్లింపు విధానాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. డిజిటల్ చెల్లింపులపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, ఆన్‌లైన్ ద్వారా రుసుములు చెల్లించడంలో ఇబ్బందులు ఎదుర్కొనే వారికి సహాయం అందించేందుకు ప్రతి కౌంటర్ వద్ద ప్రత్యేక సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. డిజిటల్ చెల్లింపుల విధానం అందరికీ సులభంగా అందుబాటులో ఉండేలా చూడాలని, అన్ని కౌంటర్లలో సాంకేతిక సదుపాయాలు నిరంతరం పనిచేసేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. నగదు రహిత లావాదేవీలతో సమయం ఆదా కావడమే కాకుండా, చెల్లింపుల్లో పారదర్శకత పెరిగి ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని పేర్కొన్నారు. మున్సిపల్ వ్యవహారాల్లో డిజిటల్ విధానాన్ని పటిష్టంగా అమలు చేసి, ప్రజలకు ఇబ్బందులు లేని సేవలు అందించడమే లక్ష్యమని కమిషనర్ తెలిపారు. నగదు రహిత చెల్లింపులకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

కడప నగర పాలక సంస్థ ఉప మేయర్ ఎన్నికకు నవంబర్ 23న ప్రత్యేక సమావేశం..!
- జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి...
- నవంబర్ 18న ఫారం ద్వారా ప్రత్యేక సమావేశానికి నోటీసుల జారీ...



ప్రజా భూమి ప్రతినిధి - కడప కలెక్టరేట్
రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నోటిఫికేషన్ మేరకు కడప నగర పాలక సంస్థ ఉప మేయర్ ఎన్నిక నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నవంబర్ 4, 2026న జారీ చేసిన నోటిఫికేషన్ నం.1474/ఎస్ఈసి-ఎఫ్1/2026-1 ప్రకారం కడప నగర పాలక సంస్థ ఉప మేయర్ పదవికి ఎన్నిక నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు నవంబర్ 18వ తేదీన జిల్లా కలెక్టర్ లేదా అధీకృత సంయుక్త కలెక్టర్ ద్వారా ఫారంలో ప్రత్యేక సమావేశానికి సంబంధించిన నోటీసులు జారీ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ నోటీసులను నగర మేయర్, ఎన్నికైన సభ్యులు, పదవీరీత్యా సభ్యులందరికీ అందజేయాలని సూచించారు. నవంబర్ 23వ తేదీన ఉదయం 11 గంటలకు కడప నగర పాలక సంస్థ ఉప మేయర్ ఎన్నికకు ప్రత్యేక సమావేశం నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. అనివార్య కారణాల వల్ల ఆ రోజు ఎన్నిక నిర్వహించలేని పక్షంలో నవంబర్ 24వ తేదీన ఉదయం 11 గంటలకు ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుందని, ఆ రోజు సెలవు దినమైనప్పటికీ ఎన్నిక నిర్వహణకు చర్యలు తీసుకోవాలని నోటిఫికేషన్‌లో స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. నవంబర్ 24వ తేదీన కూడా ఉప మేయర్ ఎన్నిక నిర్వహించడం సాధ్యం కాని పరిస్థితి ఏర్పడితే, తదుపరి తేదీ నిర్ణయం కోసం రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదించాల్సి ఉంటుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్ల చట్టం, 1955, 1994తో పాటు ఉప మేయర్ ఎన్నికల నిర్వహణ నిబంధనలు--2026 ప్రకారం ఎన్నికల ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ వివరించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ, రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం నోటీసుల జారీ, ప్రత్యేక సమావేశ నిర్వహణ తదితర చర్యలను విధిగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

విద్యా విస్తరణకు మౌలానా ఆజాద్ చేసిన సేవలు చిరస్మరణీయం



ప్రజా భూమి ప్రతినిధి - ప్రొద్దుటూరు
దేశంలో విద్యారంగ అభివృద్ధికి విశేష కృషి చేసిన భారత తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయమని విశ్రాంత ఉప విద్యాశాఖాధికారులు క్రిస్టోఫర్, చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన జయంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక ఉపాధ్యాయ సేవా కేంద్రంలో జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ విద్య అందించాలనే లక్ష్యంతో ఉచిత ప్రాథమిక విద్య, వయోజన విద్య, సాంకేతిక విద్య అభివృద్ధికి ఆజాద్ విశేష కృషి చేశారని తెలిపారు. యూజీసీ, ఐఐటీలు వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల అభివృద్ధికి పునాది వేయడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. అనంతరం మౌలానా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆడిటర్ సాధు గోపాలకృష్ణ, ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ టి.డి. వరుణ్ కుమార్ రెడ్డి, రచయిత జింకా సుబ్రహ్మణ్యం, ఇమామ్ హుస్సేన్, గౌస్ లాజం, డాక్టర్ పంజగల మధుసూదన్ బాబు, అల్తాఫ్, ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి, ఉపాధ్యాయులు డి. భాస్కర్ రావు, ప్రభాకర్ రెడ్డి, బోగా గంగాధర్, సుధాకర్, కె.పి. ఓబులరెడ్డి, కొండన్న, గోవింద్ మోరే, చంద్ర మౌళి, రాజామణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
పోలవరం
11
గురువారం 12 నవంబరు 2026

ఓజుబంధ అక్రమ క్వారీలు, పేలుళ్లపై సమగ్ర విచారణకు ఆదేశం

ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను



ప్రజాభూమి ప్రతినిధి-గంగవరం

గంగవరం మండలం జగ్గంపాలెం పంచాయతీ పరిధిలోని ఓజుబంధ గ్రామం మరియు పరిస ర ప్రాంతాలలో నిబంధనలకు విరుద్ధంగా ఆది వాసుల హక్కులను కాలరాస్తూ సాగుతున్న అక్రమ నల్లరాయి క్వారీలు మరియు పేలుళ్ల కార్యకలాపాలపై ప్రజల తరఫున తమ ఆదివా సి సంక్షేమ పరిషత్ చేస్తున్న పోరాటానికి జాతీ య స్థాయిలో స్పందన లభించిందని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను పత్రిక అన్నారు.ఈ మేరకు బుధ వారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా కుంజా తమ విజ్ఞప్తిని పరిశీ లించిన జాతీయ షెడ్యూల్ తెగల కమిష న్ ఆదేశాల మేరకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ స్పందించి అత్యవసరంగా సమగ్ర విచారణ జరపాలని అధికారికంగా ఆదేశాలు జారీ చేసిందన్నారు . షెడ్యూల్ ప్రాంతాలలో గ్రామ సభ అనుమతి లేకుండా స్థానిక ఆదివా సుల అభిప్రాయాన్ని బేఖాతరు చేస్తూ అడ్డగో లుగా మైనింగ్ లీజులు కొనసాగించడం రాజ్యాంగ విరుద్ధం ఎలాంటి పర్యావరణ అను మతులు మరియు భద్రతా ప్రమాణాలు పాటిం చకుం డా ఇష్టానుసారంగా నిర్వహిస్తున్న భారీ పేలుళ్ల వల్ల స్థానిక ఆదివాసుల ప్రాణాలకు ఇళ్లకు తీవ్ర ముప్పు వాటిల్లుతోంది ఆదివా సుల హక్కులను పరిరక్షించాల్సిన అధికారులు మాఫి యాతో కుమ్మక్కై సమాచారాన్ని దాటవేసే ప్రయత్నం చేస్తున్నప్పటికీ చట్టపరమైన పోరా టంతో ఈ అక్రమాల బండారం బయట పడు తోందని ఇప్పటికే ఈ అక్రమాలపై అడుగడు గునా అధికారుల తీరును నిలదీస్తూ సమాచార హక్కు చట్టం ద్వారా మరియు న్యాయస్థానాల ద్వారా వాస్తవాలను వెలికితీసే ప్రయత్నం చేస్తున్నా అధికారుల నుంచి పూర్తిస్థాయిలో స్పందన రాకపోయినా,మైనింగ్ మాఫియా చేస్తున్న అక్రమాలను చట్టపరంగా ఎదుర్కొం టూనే ఉన్నామన్నారు.బాధ్యులైన అది, కారుల నిర్లక్ష్యాన్ని మరియు అక్రమ క్వారీల నిర్వాహకుల ఆగడాలను ప్రజల ముందు ఎప్పటికీ ఎండగడుతూనే ఉంటామన్నారు .జాతీయ స్థాయి కమిషన్ ఆదేశాల నేపథ్యం లో,రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఓజుబంధ ప్రాంతంలో చట్టవిరుద్ధంగా నడు స్తున్న క్వారీ లీజులను తక్షణమే రద్దు చేయా లని బాధ్యులైన వారిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ తరఫున మేము గట్టిగా డిమాండ్ చేస్తున్నట్టు ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను పత్రిక పరంగా డిమాండ్ చేశారు అడవిని నేలను,ఆదివాసుల బతుకులను కాపాడుకోవ డం కోసం ఈ న్యాయపోరాటం నిరంతరం కొనసాగుతుంది కుంజా శ్రీను పేర్కొన్నారు.

పోలవరం జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ పదవి బీజేపీకి కేటాయించాలి!

- పురంధేశ్వరిని కలిసిన విలీన మండలాల నాయకులు.. పాయం వెంకన్నకు అవకాశం కల్పించాలని వినతి
- విలీన మండలాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి





ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.

పోలవరం జిల్లా పరిషత్ ఉపాధ్యక్ష పదవిని బీజేపీకి కేటాయించాలని కోరుతూ విలీన మండలాలకు చెందిన నాయకులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరిని కలిశారు. రాజమండ్రిలోని ఆమె నివాసంలో నామాల శ్రీనివాసరావు, కొమ్మోజి ఈశ్వరరావు, బొల్ల ప్రసాదరావు, తుర్రం వెంకట నారాయణ మర్యాదపూ ర్వకంగా సమావేశమై తమ అభ్యర్థనను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పోల వరం జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ పదవిని కూటమి తరఫున బీజేపీ నుంచి గెలుపొందిన ఏకైక జడ్పీటీసీ సభ్యుడు పాయం వెంకన్నకు కేటా యించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. జిల్లా లో మొత్తం 12 మండలాలు ఉండగా, దిగువ ప్రాంతానికి చెందిన ఎనిమిది మండలాల నుంచి జడ్పీ చైర్మన్ పదవికి ప్రాతినిధ్యం దక్కే అవకాశం ఉన్న నేపథ్యంలో, విలీన మండ లాలకు కూడా కీలక పదవిలో అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందని వారు వివరిం చారు. కూటమిలో భాగస్వామిగా ఉన్న బీజేపీ తరఫున విలీన మండలాల నుంచి పాయం వెంకన్న ఒక్కరే జడ్పీటీసీ సభ్యుడిగా విజయం సాధించినందున, ఆయనకు జడ్పీ ఉపాధ్యక్ష పదవి కేటాయించడం ద్వారా విలీన మండ లాల ప్రజలకు జిల్లా పరిషత్ పాలనలో తగిన ప్రాతినిధ్యం లభిస్తుందని పేర్కొన్నారు. పోలవరం జిల్లా పరిధిలోని విలీన మండలాల అభివృద్ధి, స్థానిక సమస్యలు, ప్రజల అవసరా లకు జిల్లా స్థాయిలో ప్రాధాన్యత లభించాలంటే అన్ని ప్రాంతాలకు సమాన ప్రాతినిధ్యం ఉం డాలని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో తమ విజ్ఞప్తిని పరిశీలించి పాయం వెంకన్నకు జడ్పీ వైస్ చైర్మన్ పదవి కేటాయిం చేలా సహకరించాలని పురంధేశ్వరిని కోరారు.

ఫైలేరియా వ్యాధి నిర్మూలనపై ప్రజల్లో విస్తృత అవగాహన పెంపొందించాలి

- ఫైలేరియా నిర్మూలన కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి.
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్.



ప్రజాభూమి ప్రతినిధి-కాకినాడ

ఫైలేరియా వ్యాధి నిర్మూలన కు సమష్టి కృషి చేయడంతో పాటు,వ్యాధి నివారణ, నియం త్రణ చర్యలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సూచించారు.జాతీయ ఫైలేరియా దినో త్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన ఎంపీహెచ్‌వోలు, ఫైలేరియా సిబ్బందికి ఫైలేరి యా వ్యాధి నిర్మూలన కార్యక్రమంపై శిక్షణ తరగతులు నిర్వహిం చారు.జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఫైలేరియా వ్యాధి నిర్మూలన, ముం దస్తు జాగ్రత్త చర్యలు, నివారణ చర్యలు, వ్యాధి నియం త్రణ విధానాలు, ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అంశాలతో ప్రత్యేకంగా రూపొందించిన అవగాహ న పుస్తకాన్ని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆవిష్కరించారు.ఫైలేరియా వ్యాధి నిర్మూలన లో క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది కీలక పాత్ర పోషించాలని, ప్రజలకు వ్యాధి లక్షణా లు, వ్యాప్తి, నివారణ మార్గాలపై అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా అధికా రులు సూచించారు.

శిక్షణలో పొందిన అంశాల ను క్షేత్రస్థాయిలో సమర్థవంతం గా అమలు చేస్తూ ఫైలేరియా నిర్మూలన లక్ష్య సాధనకు కృషి చేయాలని పేర్కొన్నారు.కార్యక్రమంలో డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ అనిత, డి సి హెచ్ ఎస్ డాక్టర్ మహేశ్వర రావు, జి జి హెచ్ ,ఆర్ ఎమ్ ఓ మెహర్ కుమార్, మరియు పుస్తకాన్ని రచించిన ఎఫ్. ఆర్.టీ.సీ డాక్టర్ ఎం. రవి, రంగరాయ మెడికల్ కాలేజీ కమ్యూనిటీ మెడిసిన్ విభాగానికి చెందిన డాక్టర్ రుక్మిణి దేవి సాపురి, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంజీవిని ప్రాజెక్టు అమలుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- ప్రజలకు ప్రాథమిక స్థాయి నుంచి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవల వరకు సమీకృత డిజిటల్ వైద్య సేవలు అందించాలి.
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్



ప్రజాభూమి ప్రతినిధి-కాకినాడ

రాష్ట్రప్రభుత్వంప్రతిష్టాత్మకం గా చేపడుతున్న సంజీవిని- టాటా డిజిటల్ ఇంటిగ్రేటెడ్ నెట్‌వర్క్ ఫర్ కేర్ (ణఱచీజ) ప్రాజెక్టును కాకి నాడ జిల్లా లో విజయవంతంగా అమలు చేసేందుకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. 2027 జనవరి 1వ తేదీ నుంచి రాష్ట్రవ్యా ప్తంగా ప్రాజెక్టు అమలు ప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ, రెవెన్యూ శాఖ, టాటా సం స్థ ప్రతిని ధులతో జిల్లా స్థాయి సన్నద్ధత, సమ న్వయ సమావేశం నిర్వహించారు.ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..., సంజీవిని ప్రాజెక్టు ద్వారా ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి జిల్లా ఆసుపత్రులు, ప్రభుత్వ వైద్య కళాశాలలు, జనరల్ ఆసు పత్రుల వరకు సమన్వయంతో కూడిన డిజిట ల్ వైద్య సేవలు అందుబాటులోకి వస్తా యని తెలిపారు. రోగులకు అవసరమైన వైద్య సలహా లు, స్పెష లిస్ట్ వైద్యులతో వర్చువల్ సంప్రదిం పులు, రిఫరల్ సేవలు,అపా యింట్ మెంట్లు, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులను ఒకే వ్యవస్థ ద్వారా అనుసంధానం చేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమన్నారు

జిల్లా స్థాయి సమన్వయ కమిటీ ఏర్పాటు.

సంజీవిని ప్రాజెక్టు అమలును నిరంతరం పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయి సంజీవిని సమ న్వయ కమిటీని ఏర్పాటు చేసి,అన్ని శాఖ ల అధికారులు సమన్వ యంతో పనిచేయాలని జిల్లాకలెక్టర్ సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, జిల్లా ఆరోగ్య సేవల సమన్వయకర్త, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మెడికల్ సూపరిం టెండెంట్, రెవెన్యూ డివిజనల్ అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారి, ఎగ్జిక్యూటివ్ ఇంజ నీర్, టాటా సంస్థ జిల్లా లీడ్ తదితరులు తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవం తంగా నిర్వహించా లని ఆదేశించారు. ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవల సమన్వయం, జిల్లా, ప్రాంతీయ ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో కార్యకలాపాల పర్యవేక్షణ, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో సేవల అనుసంధానం వంటి అంశాలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.శిక్షణా కార్యక్ర మాలకు అవసరమైన వేదికలు, వసతి, రవా ణా, ఇతర పరిపాలనా సౌకర్యాలను రెవెన్యూ అధికారులు సమకూర్చాలని తెలి పారు.

వైద్య సిబ్బందికి ప్రత్యేక శిక్షణ.

సంజీవిని ప్రాజెక్టు లక్ష్యా లు, విధివిధానాలు, డిజిటల్ సేవల వినియోగంపై వైద్యులు, స్టాఫ్ నర్సులు, పారామెడికల్ సిబ్బంది, ఇతర సం బంధిత ఉద్యోగులకు దశలవారీగా శిక్షణ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, డిప్యూటీ , జిల్లా ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ అధికా రులు , జిల్లా ప్రోగ్రామ్ అధికారులు, ఐటీ, ఎలక్ట్రా నిక్ హెల్త్ రికార్డులపై అవగాహన ఉన్న అధి కారులకు ప్రత్యేక శిక్షణ నిర్వహించాలన్నా రు.జిల్లాలోని 65 ఆరోగ్య కేంద్రాల్లో సంజీవిని సేవల అమలుకు అవసరమైన మానవ వనరులను గుర్తించి,బాధ్యతలు కేటాయించా లని సూచించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రా లు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పేషెంట్ కేర్ కోఆర్డినేటర్లను (సంజీవిని మిత్ర లు) నియమించి,రోగులకు మొదటి సంప్రదిం పు కేంద్రం గా సేవలు అందించేలా చర్యలుతీసుకోవాలన్నారు. వీరు పౌరుల నమోదు, ఐడీ సృష్టి, ధ్రువీకరణ, అపాయింట్ మెంట్ల బుకింగ్, వైద్య సేవలపై అవగాహన కల్పించడం వంటి బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపారు.అలాగే ద్వితీయ,తృతీయ స్థాయి ఆసుపత్రుల్లో వైద్యులు, స్టాఫ్ నర్సులు, పరిపా లనా సిబ్బందితో కూడిన యూజర్ ఛాంపి యన్ల ను గుర్తించి నామినేట్ చేయాలని, సంజీవిని సేవల అమలును క్షేత్రస్థాయిలో పర్యవేక్షిం చేందుకు పేషెంట్ కేర్ మేనేజర్లను నియమిం చాలని సూచించారు.

అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఆాదీనాా ఐడీ ఆధారిత డిజిటల్ ఆరోగ్య సేవలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. రోగుల ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులను వారి సంబంధిత ఆాదీనాా ఐడీలతో అనుసంధానం చేసేలా చర్యలు తీసు కోవాలని, ఈ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండ కూడదని ఆదేశించారు.ఆరోగ్య సిబ్బంది ద్వారా ప్రజలకు ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (ఆాదీనాా) ఐడీల ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలని, ఆాచీవీలు, మీనా లు, ఆశా కార్యక ర్తల సహకారంతో తెలి సిన పౌరుల నమోదు కార్యక్రమాన్ని విస్తృతం గా నిర్వహించాలని సూచించారు. పౌరుల సరైన సంప్రదింపు వివరాలను సేకరించి, ఆాదీనాా నంబర్లను సృష్టించి, సంబంధిత డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ తో అనుసం ధానం చేయాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో ఏర్పాటు చేసే కోడ్‌ల ద్వారా ప్రజలు అపాయింట్ మెంట్లు బుక్ చేసుకునే విధానంపై కూడా అవగాహన కల్పించాలని తెలిపారు.

వర్చువల్ వైద్య సంప్రదింపు లకు ప్రత్యేక ఏర్పాట్లు.

జిల్లాలో ఎంపిక చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో స్పెషలిస్ట్ వైద్యులతో వర్చువల్ సంప్రదింపులు నిర్వ హించేందుకు సౌకర్యాలను ఏర్పాటు చేయాలనిజిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఇందు కోసం ప్రత్యేక గదులను గుర్తించి, కంప్యూటర్లు,వెబ్ క్యామ్‌లు, స్పీకర్లు, హెడ్‌సెట్లు, ఇంటర్నెట్ కనెక్టివిటీ, విద్యుత్ సరఫరా,పవర్ బ్యాకప్, అవసరమైన ఫర్నిచర్, రోగులు కూర్చునేందుకు సీటింగ్ సదుపాయాలు కల్పించాలన్నారు. ఇందుకు సంబంధించిన ఐటీ మౌలిక సదుపాయాల నివేదికను సిద్ధంచేసిరాష్ట్రప్రభుత్వానికి పంపాలని సూచించారు.

మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి

ప్రాథమిక,ద్వితీయ స్థాయి ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన సివిల్, ఎలక్ట్రికల్ పనులు, వైద్య పరికరాల ఏర్పాటు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందు కోసం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించి, అవసరమైన పనులను గుర్తించి నివేదిక సమర్పించాలన్నారు.ప్రతి ాానజ, ఖానజలో సంజీవిని సేవల నిర్వహణ కు అవసరమైన ప్రాథమిక మౌలిక సదుపాయాల కోసం జాతీయ ఆరోగ్య మిషన్ క్రింద నిధులు కేటాయించాలన్నారు. కంప్యూటర్ మానిటర్, ఇంటర్నెట్ కనెక్టివిటీ వంటి సదుపాయాలను సమకూర్చ నుంద న్నారు.

ఉన్నత చదువులు పూర్తి చేసుకుని తిరిగివచ్చిన

డాక్టర్ భాస్కర్‌కు సీఐ గజేంద్ర కుమార్ సత్కారం



ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల

ఉన్నత చదువులు పూర్తి చేసుకుని అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రికి సివిల్ సర్జన్ గా అడ్డతీగలకు తిరిగి వచ్చిన డాక్టర్ భాస్కర్‌ను అడ్డతీగల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. గజేంద్ర కుమార్ బుధవారం మర్యాదపూర్వకంగా కలి శారు. ఈ సందర్భంగా డాక్టర్ భాస్కర్‌కు శాలువా కప్పి ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశా రు.అనంతరం ఇరువురు స్థానిక పరిస్థితులు, ప్రజలకు అందిస్తున్న సేవలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన సేవా కార్యక్రమాలపై పరస్పరం చర్చించుకున్నారు. ఈ మర్యాదపూర్వక భేటీ సుహృద్భావ వాతావరణంలో సాగింది.

మండల పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షునిగా

సింగోజి ప్రసన్నకుమార్ ఏకగ్రీవ ఎన్నిక



ప్రజాభూమి ప్రతినిధి-అడ్డతీగల

అడ్డతీగల మండల పాస్టర్ ఫెలోషిప్ నూతన కమిటీని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ నెల 10వ తేదీన పాస్టర్ వి. ఐజక్ సామ్యూల్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీ ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షునిగా సింగోజి ప్రసన్నకు మార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమానికి పోలవరం జిల్లా క్రైస్తవ నాయకులు బిష ప్ టీ. మోజేష్, బిషప్ ఎం. చంటిబాబు, రెవరెండ్ బి. సంతోష్, బిషప్ టీ. ప్రభుదాస్, బ్రదర్ మణికుమార్ తదితరులు హాజరయ్యారు. జిల్లా, మండల స్థాయి క్రైస్తవ నాయకులు పాల్గొని నూతన అధ్యక్షుడు సింగోజి ప్రసన్నకుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

గొరగుమ్మిలో సౌర విద్యుత్ దీపాల ఏర్పాటుకు పిసా గ్రామసభ

గ్రామ అవసరాలకు అనుగుణంగా లైట్ల ఏర్పాటు స్థలాలను పరిశీలించిన అంబుజా కంపెనీ ప్రతినిధులు



ప్రజాభూమి ప్రతినిధి-గంగవరం

గంగవరం మండలం గోరగుమ్మి గ్రామంలో పిసా గ్రామసభ అధ్యక్షుల సమక్షంలో అంబుజా కంపెనీ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామసభ నిర్వహించారు ఈ సంద ర్భంగా అంబుజా కంపెనీ గ్రామంలో ఏర్పాటు చేయనున్న సౌర విద్యుత్ (సోలార్) వీధి దీపాల గురించి కంపెనీ వాలంటీర్ కోసూరి సత్యవేణి గ్రామస్తులకు వివరించారు గ్రామంలో ప్రజలకు ఉపయోగకరంగా ఉండే విధంగా సౌర విద్యుత్ దీపాలను ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలనే విష యంపై గ్రామస్తుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు గ్రామ ప్రజల అవసరాలు,రాత్రి వేళల్లో రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అనువైన ప్రదేశాలను సూచించాలని కోరారు. అలాగే అంబుజా కంపెనీ గ్రామంలో చేపడుతున్న వివిధ కార్యక్రమాల గురించి వివరించారు అనంతరం పిసా అధ్యక్షులు శివశంకర్ రెడ్డి,కార్యదర్శి రాజారెడ్డి గ్రామ స్తులతో కలిసి సోలార్ లైట్లు ఏర్పాటు చేయాల్సిన ప్రదేశాలను కంపెనీ ప్రతినిధులకు చూపిం చారు ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ,అంబుజా కంపెనీ సహకారంతో గ్రామంలో ఇటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరమని,ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాల ద్వారా గ్రామాభివృద్ధికి తోడ్పడుతున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు భవిష్యత్తులో కూడా గ్రామ అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు

ఉపాధి హామీ పథకం పనుల లక్ష్యాలను

నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

అధికారులు, సిబ్బందికి ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. రాంప్రసాద్ ఆదేశాలు



ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల

మండలంలోని కంప్యూటర్ కేంద్రంలో ఉపాధి హామీ పథకం పనుల పురోగతి, కూలీల సంఖ్య పెంపుదలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. గౌరవ ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ (ణజెహీూ) అధికారి బి. రాంప్రసాద్ అడ్డతీగల, రాజమౌమ్మంగి, వై. రామవరం, గంగవరం మండలాలకు చెందిన ఉపాధి హామీ సిబ్బందితో సమావేశమై పలు అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, జేఈ/ఈసీలు, ఏపీఓలకు గ్రామ పంచాయతీల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో నిర్లక్ష్యం వహించే వారిపై తదుపరి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.అలాగే హైడెన్సిటీ ప్లాంటేషన్, ఉద్యానవన పంటలు సాగు చేస్తున్న రైతులకు వాచ్ అండ్ వార్డు సదుపాయం కల్పించాలని సూచించారు. కొత్తగా నియమితులైన ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను సిబ్బందిని వ్యక్తిగతంగా అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి తగిన సూచనలు అందించారు.ఈ సమావేశంలో నాలుగు మండలాల అదనపు కార్యక్రమ అధికారులు (ఏపీఓలు), ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, జేఈ/ఈసీలు, ఇతర సిబ్బందితో పాటు ణజెహీూ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాభూమి

జనరల్

గురువారం, నవంబర్ 12, 2026

12



మీర్ రిజ్వాన్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం ఆజాద్ 132వ జయంతి కార్యక్రమం

ప్రజా భూమి ప్రతినిధి అవనిగడ్డ

భారతదేశ ప్రథమ విద్యాశాఖమాత్యులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ 132వ జయంతి కార్యక్రమమును అవనిగడ్డ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు మీర్ రిజ్వాన్ ఆధ్వర్యంలో చల్లపల్లిలో ఘనంగా ముస్లిం సోదరులు కాంగ్రెస్ పార్టీ నాయకులు జయంతి కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రిజ్వాన్ మాట్లాడుతూ భారతదేశ ప్రథమ విద్యాశాఖ మాత్యులుగా ఎన్నో సంస్కరణను తీసుకువచ్చి దేశవ్యాప్తంగా విద్యా శాఖను బలోపేతం చేసిన మహోన్నతమైన వ్యక్తి అని భారతదేశానికి ఎన్నో అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి భారత దేశ అభివృద్ధికి కృషి చేసిన వ్యక్తి ఆజాద్ అని పేర్కొన్నారు ఈ జయంతి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండేటి భాస్కరరావు జగ్గవరపు బాబురావు ముస్లిం నాయకులు మహమ్మద్ అస్వర్ భాష షేక్ మహబూబ్ సుభాని సయ్యద్ జహీర్ మహమ్మద్ హుస్సేన్. మహమ్మద్ రషీద్ బాబు మహమ్మద్ షరీఫ్ తదితరులు పాల్గొని అబుల్ కలాం ఆజాద్ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

పారిశుద్ధ్యం పడకేసింది.! మురుగులో మచిలీపట్నం!

తుఫాన్లు దాటినా వీడని దుర్భర పరిస్థితులు.! వీధివీధినా పేరుకుపోతున్న చెత్తాచెదారం.! మురుగునీటితో నిండిన రహదారులు.. తొలగని చెత్త కుప్పలు.. విజృంభిస్తున్న దోమలు..



ప్రజారోగ్యంపై నగరవాసుల్లో ఆందోళన!

మచిలీపట్నం రీజనల్ రిపోర్టర్, ప్రజా భూమి

తుఫాన్లు వచ్చి వెళ్లిపోయాయి.. రోజులు గడిచిపోతున్నాయి.. కానీ నగరంలో పారిశుద్ధ్య పరిస్థితులు మాత్రం చక్కబడటం లేదు. ఆర్నాబు, మురసు తుఫాన్లు దాటిపోయి 15 రోజులు గడుస్తున్నా నగరంలోని పలు ప్రాంతాల్లో చెత్తాచెదారం తొలగకపోవడం, మురుగునీటి సమస్య పరిష్కారం కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

అడుగడుగునా మురుగునీటి మడుగులే!..నగరంలోని బైపాస్ రోడ్డు, గాంధీనగర్, జిల్లా పరిషత్ వెనుక రహదారి, ఈడేపల్లి, నిజాంపేట, టెంపుల్ కాలనీ తదితర ప్రాంతాల్లో రహదారులు మురుగు నీటితో నిండిపోయి దర్శనమిస్తున్నాయి. అడుగు తీసి అడుగు వేయాలన్నా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాలు తగ్గినా రోడ్లపై మురుగునీరు నిలిచిపోవడం, పారుదల వ్యవస్థ సక్రమంగా పనిచేయకపోవడం సమస్య తీవ్రతను తెలియజేస్తోంది.

చెత్త కుప్పలతో దోమల స్వైరవిహారం!..మరోవైపు వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం సకాలంలో తొలగకపోవడంతో పారిశుద్ధ్య లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నిల్వ ఉన్న మురుగు నీరు, పరిసరాల్లో పేరుకుపోయిన వ్యర్థాలతో దోమలు విపరీతంగా పెరిగే ప్రమాదం ఏర్పడుతోంది. ఇప్పటికే దోమల బెడదతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలుతాయేమోనన్న భయం ప్రజలను వెంటాడుతోంది.



ఆశయానికి అనుగుణంగా కార్యాచరణ ఏదీ?

మచిలీపట్నం నగరాన్ని భవ్యమైన, దివ్యమైన నగరంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో మంత్రి కొల్లు రవీంద్ర ముందుకు సాగుతున్న తరుణంలో, క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణ మరింత మెరుగు పడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నగర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన సమయం ఆసన్నమైంది.

ప్రజారోగ్యమే ప్రథమ ప్రాధాన్యం కావాలి!...నగరపాలక సంస్థ కమిషనర్ ఈ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. పారిశుద్ధ్య సిబ్బంది సేవలను సమర్థంగా వినియోగించుకుంటూ వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తక్షణమే తొలగించడం, మురుగునీటి పారుదలకు అడ్డంకులు లేకుండా కాలువలను శుభ్రపరచడం, నిల్వ నీటిని తొలగించడం వంటి చర్యలు చేపట్టాలి.అలాగే దోమల నివారణకు ఫాగింగ్, మందుల పిచికారీ, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలి.

అందరి ఆకాంక్ష.. పరిశుభ్రమైన మచిలీపట్నం!...పరిశుభ్రమైన వీధులు, పారుదల సమస్యలు లేని రహదారులు, ఆరోగ్యకరమైన పరిసరాలు ప్రతి నగరవాసి కోరుకునే కనీస సౌకర్యాలు. పారిశుద్ధ్యం అనేది ఒక్కరోజుతో ముగిసే కార్యక్రమం కాదు.. నిరంతరం కొనసాగాల్సిన బాధ్యత.అధికారులను తప్పుబట్టడం కంటే సమస్యను గుర్తించి పరిష్కార దిశగా అడుగులు వేయడం ఇప్పుడు ముఖ్యం. ప్రజల ఇబ్బందులను గుర్తించి నగరపాలక సంస్థ యంత్రాంగం తక్షణమే స్పందిస్తుందని, సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టి మచిలీపట్నాన్ని పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన నగరంగా తీర్చిదిద్దుతుందని నగరవాసులు ఆశిస్తున్నారు.

ప్రజల ఆకాంక్ష ఒక్కటే.. మురుగునీటి మడుగు నుంచి విముక్తి కల్పించి, చెత్తాచెదారం లేని పరిశుభ్రమైన మచిలీపట్నాన్ని ఆవిష్కరించాలి!

నామినేషన్ల ప్రక్రియలో అభ్యర్థులకు పూర్తి సహకారం అందిస్తూ,

పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలి

కలెక్టర్ డీకే బాలాజీ



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః రెండవ సాధారణ స్థానిక సంస్థల ఎన్నికలు–2026లో భాగంగా గ్రామపంచాయతీ ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాలను ప్రతి ఎన్నికల అధికారి తూచా తప్పకుండా పాటించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ స్పష్టం చేశారు.గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఉయ్యూరు డివిజన్ పరిధిలోని స్టేజ్–1 రిటర్నింగ్ అధికారులు, స్టేజ్–2 రిటర్నింగ్ అధికారులకు బుధవారం ఉదయం 9 గంటలకు మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎన్నికల విధుల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నామినేషన్ల స్వీకరణ, పోలింగ్ ఏర్పాట్లు, బ్యాలెట్ బాక్సుల నిర్వహణ తదితర అంశాలపై అధికారులకు పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.నామినేషన్ల స్వీకరణలో సమయపాలన, డిజిటల్ క్లాక్ తప్పనిసరినామినేషన్ల స్వీకరణ కేంద్రాల్లో తప్పనిసరిగా డిజిటల్ క్లాక్ ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. నిర్దేశిత గడువు ప్రకారం సాయంత్రం 5 గంటలలోపు మాత్రమే నామినేషన్లను స్వీకరించాలన్నారు. ప్రభుత్వ సెలవు దినాలు ఉన్నప్పటికీ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను తప్పనిసరిగా కొనసాగించాలని స్పష్టం చేశారు.నామినేషన్ల స్వీకరణ చివరి సమయంలో అభ్యర్థులు అధిక సంఖ్యలో వచ్చినప్పుడు ఎలాంటి గందరగోళానికి తావులేకుండా వ్యవహరించాలన్నారు. ఉదాహరణకు, సాయంత్రం 4.25 గంటలకు పది మంది అభ్యర్థులు నామినేషన్ల సమర్పణకు వచ్చినట్లయితే, గడువులోపు వచ్చిన వారందరి నామినేషన్ పత్రాలను స్వీకరించి, వారిని క్రమపద్ధతిలో కూర్చోబెట్టి, సీరియల్ నంబర్ల వారీగా ఒక్కొక్కరి నామినేషన్ పత్రాలను ప్రాథమికంగా పరిశీలించాలని సూచించారు. గడువులోపు వచ్చిన అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణలో సమయపాలనతో పాటు నిబంధనలను పాటించడం అత్యంత ముఖ్యమన్నారు.

ప్రాథమిక పరిశీలనతోనే నామినేషన్ లోపాలను సరిదిద్దాలి

నామినేషన్ పత్రాల ప్రాథమిక పరిశీలన అత్యంత కీలకమైన ప్రక్రియ అని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ దశలోనే అభ్యర్థులు సమర్పించిన పత్రాల్లో ఉన్న చిన్నచిన్న పొరపాట్లు, లోపాలను గుర్తించి, నిబంధనలకు అనుగుణంగా వాటిని సరిచేసుకునేందుకు అవసరమైన సూచనలు ఇవ్వాలని తెలిపారు.అభ్యర్థులతో సమర్థవంతమైన కమ్యూనికేషన్ ఏర్పాటు చేసుకునేందుకు వారి వాట్సాప్ నంబర్లను సేకరించాలని సూచించారు. నామినేషన్ల పరిశీలన తేదీ, సమయం తదితర వివరాలను అభ్యర్థులకు ముందుగానే స్పష్టంగా తెలియజేయాలన్నారు.నామినేషన్ల స్వీకరణ సమయంలో అభ్యర్థులకు అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తూ, నిబంధనలకు అనుగుణంగా నామినేషన్లు సమర్పించేందుకు సహకరించాలని తెలిపారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నామినేషన్లను మాత్రమే నిబంధనల ప్రకారం తిరస్కరించాలని, చిన్నచిన్న సాంకేతిక పొరపాట్ల కారణంగా అభ్యర్థులు అనవసరంగా ఇబ్బందులు పడకుండా ఎన్నికల నియమావళి పరిధిలో సాధ్యమైనంత వరకు సహకరించాలని అధికారులకు సూచించారు.

పోలింగ్ ఏజెంట్ల గుర్తింపు కార్డుల జారీలో నిబంధనలు పాటించాలి

పోలింగ్ ఏజెంట్లకు గుర్తింపు కార్డులు జారీ చేసే విషయంలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించాలని కలెక్టర్ సూచించారు. ఏజెంట్ల విద్యార్హతలు లేదా వృత్తి వంటి అంశాలను అనవసరంగా పరిగణనలోకి తీసుకోకుండా, నిబంధనల ప్రకారం వారి అర్హత, గుర్తింపు, ఇతర అవసరమైన వివరాలను పరిశీలించి గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్లకు కేటాయించిన స్థానాలు, వారి విధులపై ముందుగానే స్పష్టత కల్పించాలని సూచించారు.

ఓటర్ల రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు ఓటింగ్ కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేయాలి

గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఉదయం 6.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మాత్రమే పోలింగ్ నిర్వహించనున్న నేపథ్యంలో, నిర్ణీత సమయంలో ఓటింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఒకేసారి ఎక్కువ సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చినప్పుడు ఎలాంటి రద్దీ, జాప్యం ఏర్పడకుండా తగిన సంఖ్యలో ఓటింగ్ కంపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేయాలన్నారు. సాధారణంగా ఒక పోలింగ్ కేంద్రానికి ఒక ఓటింగ్ కంపార్ట్‌మెంట్ కేటాయించినప్పటికీ, ఓటు రహస్యతకు ఎలాంటి భంగం కలగకుండా అవసరాన్ని బట్టి రెండు లేదా మూడు ఓటింగ్ కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అదనపు కంపార్ట్‌మెంట్ల ఏర్పాటు ద్వారా ఓటర్లు వేగంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుందని, నిర్ణీత సమయానికి పోలింగ్ ప్రక్రియను పూర్తి చేయవచ్చని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటు రహస్యత, క్రమశిక్షణ, ఓటర్ల సౌకర్యం తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. పోలింగ్ సామగ్రి, బ్యాలెట్ బాక్సుల తనిఖీలో అప్రమత్తత అవసరంస్టేజ్–2 రిటర్నింగ్ అధికారులు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ సామగ్రిని స్వీకరించే సమయంలో చెక్‌లిస్ట్‌లో పేర్కొన్న ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా బ్యాలెట్ బాక్సులు సక్రమంగా పనిచేస్తున్నాయా, బ్యాలెట్ పేపర్లు సీరియల్ క్రమంలో ఉన్నాయా, వాటి నాణ్యత సరిగ్గా ఉందా అనే అంశాలను తనిఖీ చేయాలన్నారు. చిరిగిన, దెబ్బతిన్న బ్యాలెట్ పేపర్లను స్వీకరించకుండా వాటి స్థానంలో నాణ్యమైన బ్యాలెట్ పేపర్లు తీసుకోవాలని స్పష్టం చేశారు.పోలింగ్ సామగ్రి, బ్యాలెట్ బాక్సులతో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి బయలుదేరిన తర్వాత సిబ్బంది మధ్యలో ఎక్కడా ఆగకుండా నేరుగా తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఉయ్యూరు డివిజన్ పరిధిలోని ఎన్నికల అధికారులు, స్టేజ్–1 రిటర్నింగ్ అధికారులు, స్టేజ్–2 రిటర్నింగ్ అధికారులు, డీఎల్‌డీవో, డీఎల్‌పీవో, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, ఎంపీడీవో కార్యాలయాల ఎన్నికల కేస్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



హిందూ ముస్లిం సామరస్యం కోసం ఆజాద్ కృషి

-అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ

హిందూ ముస్లిం సామరస్యం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు అబుల్ కలాం ఆజాద్ అని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుధవారం అవనిగడ్డలోని ఎమ్మెల్యే స్వగృహంలో భారతదేశ తొలి విద్యా శాఖ మంత్రి స్వర్గీయ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు, జాతీయ విద్యా దినోత్సవం, జాతీయ మైనారిటీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, జనసేన పార్టీ నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వాతంత్ర సమరయోధునిగా, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షునిగా దేశ స్వతంత్రం కోసం మహోన్నత పోరాటం చేశారన్నారు.

మహాత్మా గాంధీకి అంత రంగిక అనుచరునిగా, గాంధేయవాదిగా ఆజాద్ ఖ్యాతి గడించారన్నారు. హిందూ ముస్లిం సామర స్యం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ఆజాద్ తన రచనల ద్వారా హిందూ ముస్లింల మధ్య సామ రస్యం సమైక్యత కోసం పడిన తపన సమాజానికి తెలియజేశారన్నారు. దేశంలో తొలి విద్యాశాఖ మంత్రిగా బాధ్యత చేపట్టిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశం స్వతంత్రం పొందిన తొలినాళ్లలో నెలకొని ఉన్న తీవ్ర నిరక్షరాస్యత రూపుమాపేందుకు అనేక విద్యాలయాలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల స్థాపనలో కీలక పాత్ర పోషించారన్నారు. వారు వేసిన పటిష్ట పునాదులపై ఏర్పడిన భారతదేశ విద్యా వ్యవస్థ దేశాన్ని ప్రపంచ స్థాయిలో నిలిపిందన్నారు. తద్వారా ప్రపంచానికి ఎంతోమంది మేధావులను అందించిన ఘనత మన దేశానికి దక్కిందన్నారు. పేదరిక నిర్మూలన, సామాన్యుడికి హోదా, సమాజంలో గౌరవం పిల్లల విద్యతోనే సాధ్యమని గుర్తించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ మహోన్నత ఆశయాలను ఆచరణలో పెట్టి దేశానికి అందించిన విద్యా వ్యవస్థ గర్వదాయకంగా నిలిచిందన్నారు. ఆయన కృషిని స్మరించుకునేందుకు ఆజాద్ జన్మదిన వేడుకలను భారత ప్రభుత్వం జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటుంది అన్నారు. హిందూ ముస్లిం సామరస్యం కోసం వారు చేసిన కృషిని నిత్యం స్మరించుకునేందుకు జాతీయ మైనారిటీ దినోత్సవం కూడా వారి పుట్టినరోజున ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఎమ్మెల్యేకు షుబ్లీ తరపున సత్కారం

రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ మహమ్మద్ ఫరూక్ షుబ్లీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా ఫరూక్ షుబ్లీ తరపున ఆజాద్ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాదును టీడీపీ జిల్లా మైనారిటీ సెల్ మాజీ అధ్యక్షులు ఎండీ హాఫిజ్ రెహమాన్ (ఏసీ బాబు) సత్కరించారు.

కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ షేక్ ఇబ్రహీం, టీడీపీ మైనారిటీ చల్లపల్లి మండల నాయకులు పఠాన్ కరీముల్లా ఖాన్, మహబూబ్ బాషా (చంద్రబాబు), మహమ్మద్ హుసేన్, వాహేదుల్లా, రాజశేఖర స్వామి దేవస్థానం చైర్మన్ ఘంటసాల రాజమోహన రావు (కన్నయ్య), రేపల్లె మాధవరావు, భోగాది బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జనగణన-2027 రెండో దశ జనాభా గణన ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

అధికారులకు దిశానిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః జనగణన–2027 రెండో దశకు సంబంధించి భారత జనగణన కార్యకలాపాల ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ జారీ చేసిన ఆదేశాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా జనాభా గణన ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా, సమర్థవంతంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు.జనగణన–2027 రెండో దశ జనాభా గణన ప్రక్రియ నిర్వహణలో భాగంగా జిల్లా మరియు ఛార్జ్ స్థాయి జనగణన అధికారులకు నవంబరు 11, 12 తేదీలలో రెండు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్‌లో నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై అధికారులకు పలు సూచనలు, దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ ఆదేశాల మేరకు జనగణన–2027 రెండో దశకు సంబంధించిన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనగణన ప్రక్రియకు సంబంధించి ఉన్నతాధికారులు జారీ చేసిన మార్గదర్శకాలు, నిబంధనలు, నిర్దేశిత విధానాలను ప్రతి అధికారి క్షుణ్ణంగా అవగాహన చేసుకోవాలన్నారు.జిల్లాలో జనగణన ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంలో మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బందిపై కీలక బాధ్యత ఉందన్నారు. ఈ శిక్షణలో అందించే ప్రతి అంశాన్ని శ్రద్ధగా నేర్చుకుని, జనగణనకు సంబంధించిన విధివిధానాలు, సాంకేతిక అంశాలు, మార్గదర్శకాలను పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవాలని సూచించారు.శిక్షణలో పొందిన అవగాహనను క్షేత్రస్థాయిలో పనిచేసే ఎన్యూమరేటర్లు, ఇతర సిబ్బందికి సమర్థవంతంగా బదిలీ చేయాలని, వారికి కూడా ఇదే స్థాయిలో సమగ్ర శిక్షణ అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి ఇంటికి, ప్రతి కుటుంబానికి సంబంధించిన జనాభా వివరాల సేకరణలో ఖచ్చితత్వం, పారదర్శకత, బాధ్యతాయుతమైన విధానం పాటించేలా సిబ్బందిని సిద్ధం చేయాలన్నారు.జనగణన అనేది అత్యంత ప్రాధాన్యత కలిగిన జాతీయ కార్యక్రమని, దీనికి సంబంధించిన ప్రతి దశను నిర్దేశిత కాలపరిమితిలో, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి, జనగణన–2027 రెండో దశ జనాభా గణనను కృష్ణా జిల్లాలో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మరియు జిల్లా జనగణన అధికారి, ముఖ్య ప్రణాళిక అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా అటవీ అధికారి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, సర్వే మరియు భూ రికార్డుల సహాయ సంచాలకులు, ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయ గణాంక అధికారి, ఎస్ఐసీ జిల్లా ఇన్ఫర్మాటిక్స్ అధికారి పాల్గొన్నారు.అలాగే జిల్లాలోని రెవెన్యూ డివిజనల్ అధికారులు / సబ్ డివిజనల్ జనగణన అధికారులు, మచిలీపట్నం నగరపాలక సంస్థ ప్రధాన జనగణన అధికారి మరియు కమిషనర్, అన్ని మున్సిపాలిటీల కమిషనర్లు, మండల తహసీల్దార్లు (ఛార్జ్ అధికారులు), ఎంపీడీవోలు (అదనపు ఛార్జ్ అధికారులు), అసిస్టెంట్ ఛార్జ్ జనగణన అధికారులు, జనగణన క్లర్కులు, సాంకేతిక సహాయకులు (ఏఎస్ఓలు) హాజరయ్యారు. ఏఎస్ఓలు అందుబాటులో లేని చోట సంబంధిత జూనియర్ అసిస్టెంట్లు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు.జిల్లాలో జనగణన–2027 రెండో దశను విజయవంతంగా నిర్వహించేందుకు అవసర మైన విధివిధానాలు, బాధ్యతలు, కార్యాచరణపై ఈ రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో అధికారులకు అవగాహన కల్పించనున్నారు.

నాగుల చవితి పర్వదిన ఏర్పాట్లను పరిశీలించిన అవనిగడ్డ డిఎస్పి అభిషేక్



ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ

ఈనెల 13వ తేదీ శుక్రవారం రోజున మోపిదేవిలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో నిర్వహించనున్న నాగుల చవితి పర్వదిన ఏర్పాట్లను అవనిగడ్డ డిఎస్పి అభిషేక్ పరిశీలించారు. డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు, చల్లపల్లి సిఐ కె ఈశ్వరరావు లతో కలిసి డి.ఎస్.పి అభిషేక్ ఏర్పాట్లపై చర్చించారు. నాగుల చవితి పర్వదినం సందర్భంగా శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రానున్న నేపథ్యంలో అన్ని రకాల జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నాగపుట్టలో పాలు పోసుకుని, భక్తులు శ్రీ స్వామి, శ్రీ అమ్మవార్లను దర్శించుకుని భక్తులు తిరుగు వెళ్లేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మోపిదేవి ఎస్ఐ పామర్తి గౌతమ్ కుమార్, ఆలయ సూపర్నెండెంట్ అచ్యుత మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.



Printed by MOHANEESWAR PUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at Y.S.R. and published at D.No.30-251, WARD NO.4, BUDDAYAPALLE VILLAGE, CHINNACHOWK editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1220.cell:9502116677.

ప్రజాభూమి

జనరల్ 13

గురువారం 12 నవంబర్ 2026

అయ్యప్పస్వామి మహాపడిపూజ మహోత్సవం మంచి శుభపరిణామం

- రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాభూమి ప్రతినిధి నూజీవీడు



నూజీవీడు మండలం రావిచర్ల గ్రామంలో మంగళవారం రాత్రి ఘనంగా పడిపూజ మహోత్సవంలో రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామానికి విచ్చేసిన మంత్రికి నిర్వాహకులు, గ్రామపెద్దలు మరియు అయ్యప్పభక్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక పడిపూజ, హోమకార్యక్రమాల్లో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పడిపూజను అత్యంత వైభవంగా నిర్వహించిన గురుస్వాములను, నిర్వాహకులను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. తీర్థప్రసాదాలు అందజేసి, మంత్రికి వేదాశీర్వచనాలు అందించారు.ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ మండల, మకరవిళక్కు దీక్షలు సమయంలో నిర్వహించే పడిపూజ ఎంతో విశిష్టమైనదని అన్నారు. కఠిన నియమనిష్ఠలతో క్రమశిక్షణతో 41 రోజులు పాటు దీక్షను ఆచరించడం ద్వారా భక్తులలో ఆధ్యాత్మిక చైతన్యం, మానసిక ప్రశాంతత మరియు సమాజసేవాభావం పెంపొందుతాయని అన్నారు. జిల్లా ప్రజలకు ముఖ్యంగాగురుస్వాములు, అయ్యప్ప మాలదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న అయ్యప్పస్వామి మహాపడిపూజ మహోత్సవం మంచి శుభపరిణామం అన్నారు. కులమతాలకు అతీతంగా గొప్ప సందేశాన్ని ప్రపంచానికి చాటిచెప్పే అయ్యప్పదీక్ష, సమాజంలో ఐక్యతను, సోదరభావాన్ని మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు. అయ్యప్పస్వామి దివ్యఆశీస్సులతో మన రాష్ట్రం పాడిపంటలతో, సుఖశాంతులతో విలసిల్లాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సకల ఐశ్వర్యాలు కలగాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నామని తెలిపారు. శబరిమల యాత్రకు వెళ్తున్న భక్తులందరి యాత్ర సుఖమయంగా, క్షేమంగా సాగాలని మంత్రి కొలుసు పార్థసారథి కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,గురుస్వాములు, అయ్యప్ప మాలదారులు వారి కుటుంబసభ్యులు, గ్రామప్రజలు, గ్రామనాయకులు, ఎక్కువ సంఖ్యలో మహిళలు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.



కాపా శ్రీనివాసరావు ముల్లంగి మోషెకి ఘనంగా సన్మానం

ప్రజాభూమి ప్రతినిధి నూజీవీడు

బోరవంచ కొన్నంగుంట, కొత్తూరు, రామన్నగూడెం గ్రామ ఎంపీటీసీగా 302 ఓట్ల తో ఘన విజయం సాధించిన టీడీపీ సీనియర్ నేత,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కాపా .శ్రీనివాసరావు మరియు రావిచెర్ల ఎంపీటీసీ గా గెలిచిన ముల్లంగి మోషే పాత రావిచెర్ల జనసేన నాయకులతో కలిసి ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి అండ్ నూజీవీడు నియోజకవర్గ సమన్వయకర్త మరీదు శివరామకృష్ణ ఘనంగా సత్కరించటము జరిగింది. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ ఉత్తమ సర్పంచ్‌గా చిన్న రావిచెర్ల ను మోడల్ గ్రామంగా అభివృద్ధి చేసిన దానికి ప్రతిఫలం గా సొంత ఊరు చిన్న రావిచెర్ల, పెద్ద రావిచెర్ల రెండు గ్రామాల కలిపి ఉన్న ఎంపీటీసీ అభ్యర్థి ముల్లంగి .మోషే (ఎస్సీ రిజర్విడ్) గారిని చరిత్ర తిరగరాసిన మెజారిటీ 471 ఓట్లతో రెండు గ్రామాల ప్రజలకు గెలిపించారని అన్నారు.ఈ గెలుపు కోసం కష్టపడిన మాజీ సర్పంచ్ బసవరాజు.నాగేష్ బాబు ప్రతి ఒక్క గ్రామ జనసేన ,టిడిపి, బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ జనసేన నాయకులు కొన్నంగుంట.రాంబాబు తోట.బలరాం ,కస్తూరి. అశోక్ కొన్నంగుంట శ్రీనివాసరావు అశోక్ చిన్నం. శ్యామ్ కస్తూరి. విజయ,పసుపులేటి విజయ్పసుపులేటి.సాధిక్ పాల్గొన్నారు.

ఆత్రేయపురం జడ్పీటీసీ గూడపాటికి అభినందనల వెల్లువ





- ర్యాలిలోని స్వగృహం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన పలువురు

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆత్రేయపురం మండల జడ్పీటీసీగా భారీ మెజారిటీతో విజయం సాధించిన గూడపాటి శ్రీనివాసరావుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా బుధవారం పలువురు ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ సంఘాల ప్రతినిధులు ర్యాలి గ్రామంలోని ఆయన స్వగృహానికి చేరుకుని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ర్యాలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది శ్రీనివాసరావును కలిసి అభినందనలు తెలిపారు. అదేవిధంగా రామకృష్ణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఆయనకు పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం స్థానిక నాయి బ్రాహ్మణ సంఘ నాయకులు కూడా ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పూల మాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా గూడపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ తనపై అభిమానం, నమ్మకం ఉంచి స్వయంగా వచ్చి శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

పంచాయతీ ఎన్నికలకు అధికార యంత్రాంగం సన్నద్ధం

- ఎన్నికల విధుల నిర్వహణకు అధికారుల నియామకం శుక్రవారం శిక్షణ



ప్రజా భూమి ప్రతినిధి ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండలంలో డిసెంబర్ 2న నిర్వహించనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఎంపీడీవో షేక్ అబ్దుల్ సలాం తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఈ నెల 19న ఎన్నికల షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం కార్యాచరణను సిద్ధం చేస్తోందని పేర్కొన్నారు. ఎన్నికల విధుల నిర్వహణ కోసం స్టేజ్-1, స్టేజ్-2 అధికారులను నియమించామని, వారికి శుక్రవారం నూజీవీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల విధులు, బాధ్యతలు, పోలింగ్ ప్రక్రియపై అధికారులకు అవసరమైన అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావులేకుండా, నిబంధనలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు సమన్వయంతో పూర్తి చేస్తామని ఎంపీడీవో స్పష్టం చేశారు.

ఐఐటీ, జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్డ్ ఎంట్రెన్స్ లపై నైపుణ్య శిక్షణ కార్యక్రమం

ప్రజాభూమి ప్రతి నిధి, పాలకొల్లు




ఛాంబర్స్ కళాశాలలో విద్యార్థులకు ఐఐటీ/జేఈఈ మెయిన్స్/ అడ్వాన్స్డ్/ ఎంసెట్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం మహారాష్ట్రలోని ప్రతిష్టాత్మక కోచింగ్ అకాడమీ అయిన 'దిశ అకాడమీ' డైరెక్టర్ శ్రీ శశిధర్ ఛాంబర్స్ విద్యార్థులకు అవగాహన మరియు నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా శశిధర్ మాట్లాడుతూ దేశంలోని ప్రతిష్టాత్మక ఐఐటి ఎన్ఐఐటీలో విద్యార్థులు చేరాలని ఆకాంక్ష నెరవేరాలంటే మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల సబ్జెక్టులపై లోతైన అవగాహనతో పాటుగా, నిరంతరం అభ్యసనం మాక్ ప్రాక్టీస్ టెస్టులకు హాజరగుట, సమయపాలన అత్యంత ముఖ్యమని తెలుపుతూ ఫిజిక్స్ ,మాథ్స్ ,కెమిస్ట్రీ సబ్జెక్టులలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన పూర్వపు ప్రశ్న పత్రాలలో మాదిరి ప్రశ్నలను కొన్నింటిని విపులంగా విద్యార్థులతో విశ్లేషించడం జరిగినది తదనంతరం విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు విపులంగా సమాధానాలు ఇవ్వడం జరిగినది.ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కె.వి.ఆర్ నరసింహారావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని అంకుటిత దీక్షతో ఇటువంటి ప్రతిష్టాత్మక పోటీ పరీక్షలలో ఉత్తీర్ణులై తమ తల్లిదండ్రుల కలలను నెరవేర్చేలా వారిని తమ కళాశాల తరుపున కృషి చేస్తామని అందులో భాగంగానే వివిధ ప్రాంతాల నుండి నిష్ణాతులను రప్పించి తమ విద్యార్థులకు శిక్షణ ఇప్పించుచున్నామన్నారు.

కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి. వెంకటేశ్వరావు మాట్లాడుతూ శ్రీ శశిధర్ చాంబర్స్ కళాశాల పూర్వ విద్యార్థి అవటం జాతీయ స్థాయిలో వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చే ప్రముఖుడుగా ఎదగడం తమ కళాశాల పేరు ప్రఖ్యాతలు పెరిగాయని అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కె.వి సీతారామరాజు, ట్రెజరర్ ఆర్ ప్రవీణ్ భాను, అకాడమిక్ అడ్వైజర్స్ డాక్టర్ ఏబీఎస్ మూర్తి, ఎన్ సీతారామరావు అధ్యాపకులు బి విజయలక్ష్మి శైలజ, సుమ, రవికుమార్ తదితరులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదం అంచున ప్రయాణం

మృత్యువుతో చెలగాటం



- తప్పని సరి పరిస్థితుల్లో ప్రయాణాలు
- శిథిలమైన అండ్రంగి డ్రైన్ పై రాకపోకలు..
- రంగుమారిన నీరుతో పొంగిపొర్లంతున్న అండ్రంగి డ్రైన్
- మండల కేంద్రానికి రాకపోకలకు అంతరాయం

ప్రజాభూమి ప్రతినిధి,కాజులూరు.



ద్విచక్ర వాహన

గొల్లపాలెం– కుయ్యేరు ప్రధాన రహదారిలో అండ్రంగి మేజర్ డ్రైన్ పై వంతెన శిథిలమై పలుచోట్ల కుంగిపోయి కూలడానికి సిద్ధంగా ఉంది. దీంతో ప్రమాదం పొంచి ఉందని తెలిసినా వేరేమార్గం లేక ద్విచక్ర వాహనదారులు ఆ వంతెన పైనుంచి ప్రయాణాలు చేస్తున్నారు.ఇక్కడ వంతెన ఒకవైపు కుంగిపోవడంతో పాదచారులకు ఎలక్ట్రికల్ పోల్స్ వేయడంతో దారులు ఆమార్గంలోనే వెళ్ళడం నిత్యం మృత్యుతో చెలగాటం ఆడే పరిస్థితి ఇక్కడ నెలకొంది . దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఇటీవల వరసగా రెండు తుఫాన్లు ప్రభావంతో అండ్రంగి డ్రైన్ పొంగి పొర్లడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది .శిథిలమైన వంతెనకు ప్రత్యామ్నాయంగా తూరలు వేసి రహదారిని నిర్మాణం చేపట్టినా అది మొత్తం మునిగిపోయి నీటి ప్రవాహంతో ఉండటంతో ప్రయాణకులకు అంతరాయం ఏర్పడింది. గత పది సంవత్సరాల క్రితమే ఇక్కడ వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నుండి అనుమతి లభించినప్పటికీ నేటికీ కార్యరూపం దాల్చకపోవడంతో మండల కేంద్రానికి చేరుకోవాల్సిన ప్రజలు అవస్థలు వర్ణనాతీతం. ముఖ్యంగా ఒక మాదిరి వర్షం పడితే చాలు ఇక్కడ ప్రత్యామ్నాయంగా నిర్మాణం చేపట్టిన రహదారి ప్రతిసారి మునిగి పోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడటం పరిపాటయింది. రెండు తుఫాన్లు కారణంగా ప్రస్తుతం డ్రైయిన్ లో రంగుమారిన నీరు కంపుకొడుతూ పొంగి పొర్లడంతో ఆయా ప్రాంతాల్లో ప్రజలు ముక్కు మూసుకుని వెళ్ళాల్సిన పరిస్థితి నెలకొంది.ముఖ్యంగా వారి పొలాలు మునిగిపోయి నీరు నిల్వ ఉన్న కారణంగా ఈ పరిస్థితి నెలకొంది.కాగా గొల్లపాలెం –కుయ్యేరు రహదారి నిర్మాణంతో పాటు ఇక్కడ వంతెన నిర్మాణం పూర్తి చేయాల్సి ఉండగా వంతెన కూలడానికి సిద్ధంగా ఉన్నా నేటికీ వంతెన పనులు ప్రారంభం కాకపోవడంలో ప్రయాణికులు నిత్యం అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా ఈ వంతెన పని నుండి అటు కాకినాడ ఇటు రామచంద్రపురం డిపోల నుండి ఆర్టీసీ బస్సులు ప్రతిరోజు వెళ్తూ వస్తూ ఉండేవి. ప్రస్తుతానికి ఆర్టీసీ కాజులూరు మండలానికి కనుమరుగయింది. దీంతో ఆయా ప్రధాన నగరాలకు వెళ్ళవలసిన ప్రయాణికులు ప్రత్యామ్నాయంగా ఆటోల ఆశ్రయించడం పరిస్థితి నెలకొంది. ప్రధానంగా కూటమి ప్రభుత్వ వచ్చిన తర్వాత కాజులూరు మండలం ఆర్టీసీ రాకపోకలు లేకపోవడంతో శ్రీ శక్తి పథకం కాజులూరు మండల మహిళలకు అందుబాటులో లేదు.ఇప్పటికైనా నేతలు, అధికారులు,స్పందించి వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టాలని కోరుతున్నారు.



పరిశ్రమల లాభాలే ముఖ్యం..

కార్మికుల ప్రాణాలకు విలువ లేదా?

- పరవాడ శ్రీ సాయి చందన ఫార్మా కంపెనీలో కాంట్రాక్ట్ కార్మికుడి మృతి!
- కార్మికుల భద్రత గాలిలో కలిసిందా? ప్రమాదాల నివారణ చర్యలు ఎక్కడ?
- ఘటనపై కార్మిక శాఖ, ఫ్యాక్టరీస్ అధికారుల సమగ్ర విచారణకు డిమాండ్!

ప్రజాభూమి ప్రతినిధి,పరవాడ:

పరిశ్రమల అభివృద్ధి పేరుతో కోట్లాది రూపాయల వ్యాపారాలు సాగుతున్నా.. అక్కడ పనిచేసే కార్మికుల ప్రాణాలకు భద్రత ఉందా? అన్న ప్రశ్న మరోసారి తెరపైకి వచ్చింది. అనకాపల్లి జిల్లా పరవాడ పారిశ్రామిక ప్రాంతంలోని శ్రీ సాయి చందన ఫార్మా కంపెనీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన సంజిత్ కర్దాకర్ (51) మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది.

అందిన సమాచారం ప్రకారం, గత నెల 24వ తేదీ నుంచి కంపెనీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న సంజిత్ మృతి చెందాడు. ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులపై పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది. అసలు కార్మికుడి మృతికి కారణమేంటి? విధుల నిర్వహణలో ప్రమాదం జరిగిందా? కంపెనీలో భద్రతా ప్రమాణాలు సక్రమంగా అమలవుతున్నాయా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?

పరిశ్రమల్లో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు రక్షణ పరికరాలు అందిస్తున్నారా? ప్రమాదకర విధులపై ముందస్తు శిక్షణ ఇస్తున్నారా? కార్మికుల భద్రతపై యాజమాన్యాలు తీసుకుంటున్న చర్యలను సంబంధిత శాఖల అధికారులు పర్యవేక్షిస్తున్నారా? అన్నది ఇప్పుడు కీలకంగా మారింది. ఒక కార్మికుడి ప్రాణం పోయిన తర్వాత స్పందించడం కంటే, ఇలాంటి ఘటనలు జరగకుండా ముందస్తు తనిఖీలు నిర్వహించడం అధికారుల బాధ్యత కాదా? అనే ప్రశ్నలు కార్మిక వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. కార్మికుడి మృతిపై సమగ్ర విచారణ జరిపి ఈ ఘటనపై కార్మిక శాఖ, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టరేట్ అధికారులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాని, ప్రమాదానికి గల అసలు కారణాలను గుర్తించడంతో పాటు భద్రతా నిబంధనల అమలుపై క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పరిశ్రమల అభివృద్ధి ముఖ్యం.. కానీ ఆ పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల ప్రాణాల కంటే ఏదీ ముఖ్యం కాదని పలువురు కార్మికులు చెబుతున్నారు.

ముగిసిన పోషణ్ బి

పడాయి బి శిక్షణ కార్యక్రమాలు



ప్రజాభూమి, బుట్టాయగూడెం

మండలంలో అంగన్వాడీ కార్యకర్తలకు చేపట్టిన పోషణ్ బి – పడాయి బి రెండు రోజుల శిక్షణ కార్యక్రమాలు ముగిశాయాని ఐసిడిఎస్ సిడిపిఓ యు వి. పద్మావతి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్లో జరుగుతున్న బుధవారం రెండో రోజు శిక్షణ కార్యక్రమాలకు అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్వైజర్లు హాజరైనట్లు చెప్పారు. అంగన్వాడి కేంద్రాల నిర్వహణలో మెరుగైన ఫలితాలను సాధించడానికి శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందని పద్మావతి అన్నారు. అంగన్వాడి కేంద్రంలో లబ్ధిదారులకు ప్రయోజనాలను సంపూర్ణంగా అందించే విధంగా అంగన్వాడీ కార్యకర్తలు బాధ్యత వహించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో అవగాహన కల్పించుకున్న అంశాలను విధి నిర్వహణలో పాటించి, అంగన్వాడీ కేంద్రాలను ఆదర్శవంతంగా నిర్వహించాలని కోరారు.

నిలువ నీడ లేక ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబం

- ఆదుకోవాలని తహసీల్దార్‌కు వినతి



ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి

తాళ్లపూడి మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వీచిన తుఫాన్ గాలులకు ప్రక్కిలంక గ్రామంలో ఓ పేద కుటుంబం నివసిస్తున్న పెంకుటిల్లు పైకప్పు పూర్తిగా దెబ్బతింది. గ్రామానికి చెందిన గొల్ల సుజాత కుటుంబం నివసిస్తున్న ఇంటి పైకప్పు ధ్వంసం కావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓవైపు ఇంటి చుట్టూ వర్షపు నీరు చేరడం, మరోవైపు పైకప్పు నుంచి వర్షపు నీరు ఇంట్లోకి రావడంతో నివసించేందుకు కూడా వీలులేని పరిస్థితి ఏర్పడిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

రెండు రోజుల పాటు ఇంట్లో ఉండలేక భయాందోళనల మధ్య గడిపామని తెలిపారు. పేదరికంలో ఉన్న తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, దెబ్బతిన్న ఇంటికి మరమ్మతులు చేయించుకునేందుకు తగిన సహాయం అందించాలని కోరుతూ గొల్ల సుజాత తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబం విజ్ఞప్తి చేస్తోంది.

ప్రజాభూమి

జనరల్ 14

గురువారం 12 నవంబర్ 2026



పోలవరంలో పాలం పిలుస్తోంది

ప్రజాభూమి ప్రతినిధి – చాట్రాయి

చాట్రాయి మండలంలోని పోలవరం గ్రామం నందు బుధవారం "పొలం పిలుస్తుంది" కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో వరి క్షేత్రాలను సందర్శించి రైతులకు చీడపీడల నివారణ పై తగు చర్యలు నిమిత్తం అవగాహన కల్పించడంతో పాటుగా ప్రకృతి వ్యవసాయం యొక్క విశిష్టతను వ్యవసాయ శాఖ అధికారి బి శివశంకర్ తెలియజేయడం జరిగినది. ఎల్నినో ప్రభావంతో రబీ సీజన్లో వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేయాలని సూచించడం జరిగినది. వరి పంట కోసిన రైతులను మొక్కజొన్న విత్తనాలను కొనేటప్పుడు ఖచ్చితముగా షాపు వద్ద బిల్లు పొందవలెనని సీడ్ మొక్కజొన్న వేసే రైతులు కచ్చితంగా కంపెనీ నుండి అగ్రిమెంటు పొందవలెనని రైతులకు తెలియజేయడం జరిగినది. వరి కోసిన రైతులు జీరో టిల్లేజ్ పద్ధతిలో పొలాన్ని దున్నకుండ సాగు చేయడం ద్వారా రైతులకు ఎకరానికి నాలుగు వేల రూపాయల ఆదా చేసుకోవచ్చని మొక్కజొన్న విత్తనాలను థయోమిథా కసం (19.8%) + సయానీ ట్రినీపోల్ (19.8%) ఇమిడా క్లోప్రిడ్ 48% మందులతో విత్తన శుద్ధి చేసుకోవడం ద్వారా 20 రోజులు వరకు ప్రధాన పంటలో పంటని చీడపీడల నుండి కాపాడుకోవచ్చని తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశ్రామిక రాయితీలు, నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత

- ఏపీలో పెట్టుబడులకు సానుకూల వాతావరణం : సీఎం చంద్రబాబు
- జపాన్ రాయబారి కెయిచీ ఓనోతో సీఎం చర్చ

ప్రజాభూమి ప్రతినిధి,విశాఖపట్నం

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక పెట్టుబడులను ప్రోత్సహించేందుకు పారదర్శకమైన రాయితీల విధానాన్ని అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. పరిశ్రమలకు అందించే రాయితీల కోసం ఎస్క్రో అకౌంట్ విధానాన్ని తీసుకొచ్చామని, రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తున్నామని వెల్లడించారు. విశాఖపట్నంలో జపాన్ రాయబారి కెయిచీ ఓనోతో జరిగిన సమావేశంలో పారిశ్రామిక పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి, కీలక ఖనిజాలు, ఉక్కు పరిశ్రమ, గ్రీన్ ఎనర్జీ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో యువత పెద్ద సంఖ్యలో ఉన్నారని, వారికి పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందిస్తే అత్యుత్తమ మానవ వనరులుగా తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు. ఈ దిశగా జపాన్ సంస్థలు సహకరించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన జపాన్ ప్రతినిధులు రాష్ట్రంలోని పరిశ్రమల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

రేర్ ఎర్త్ మినరల్స్ సరఫరాలో భాగస్వామ్యం

జపాన్‌కు రేర్ ఎర్త్ మినరల్స్ సరఫరాను స్థిరంగా కొనసాగించే అంశాన్ని జపాన్ ప్రతినిధులు ప్రస్తావించారు. కీలక ఖనిజాల సరఫరాలో భారత్--జపాన్ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఈ సహకారం దోహదపడుతుందని పేర్కొన్నారు. అలాగే, ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్ ఇండియా ఉక్కు ప్లాంట్‌కు సంబంధించి తుది దశ ప్రాసెసింగ్‌కు అవసరమైన సెమీ ఫినిష్డ్ ఉత్పత్తులను జపాన్‌లోని మాతృసంస్థ నుంచి నిరాటంకంగా దిగుమతి చేసుకునేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు అధిక సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్ల తయారీలో ఉపయోగించే అమార్ఫస్ మెటల్‌ను దేశంలో తొలిసారిగా తయారు చేయాలని ప్రొటీరియల్ ఇండియా లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రతినిధులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పారిశ్రామిక రాయితీలతో 2026 డిసెంబరులో శ్రీసిటీలో ఉత్పత్తి ప్రారంభించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు వివరించారు.

విశాఖలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్

భారతీయ నిపుణుల ప్రతిభను వినియోగించుకుంటూ, భారత్-జపాన్ సహకారంతో ఈ ఏడాది విశాఖపట్నంలో కొత్త గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) ప్రారంభించినట్లు జపాన్ ప్రతినిధులు తెలిపారు. భారతీయ నిపుణుల సామర్థ్యాన్ని అంతర్జాతీయ స్థాయిలో వినియోగించుకునేందుకు ఈ కేంద్రం దోహదపడుతుందని పేర్కొన్నారు. మరోవైపు కాకినాడ నుంచి ఐదేళ్ల పాటు ఏటా సుమారు 70 వేల టన్నుల గ్రీన్ అమ్మోనియా కొనుగోలు చేసేందుకు జపాన్‌కు చెందిన జెరా సంస్థ, ఏఎం గ్రీన్‌తో ప్రాథమిక ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రతినిధులు వెల్లడించారు. భారత్--జపాన్ మధ్య గ్రీన్ అమ్మోనియా సరఫరా వ్యవస్థ ఏర్పాటుకు ఇది కీలక ముందడుగని పేర్కొన్నారు.

వైయస్ జగన్‌ను కలిసిన అనంతపురం నూతన మేయర్ సి.రమేష్ గౌడ్

ప్రజాభూమి ప్రతినిధి, తాడేపల్లి

అనంతపురం నగర మేయర్‌గా ఎన్నికైన సి. రమేష్ గౌడ్ తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన మేయర్ రమేష్ గౌడ్‌ను వైయస్ జగన్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతపురం నగర ప్రజలు తనపై, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని రమేష్ గౌడ్‌కు వైయస్ జగన్ సూచించారు. ప్రజల పక్షాన నిలబడుతూ నగరాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని, అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. అధికార కూటమి శ్రేణులు ఎన్ని కుట్రలు, ప్రలోభాలు, బెదిరింపులకు పాల్పడినా వాటికి వెరవకుండా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచిన రమేష్ గౌడ్‌ను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి మేయర్‌గా అవకాశం కల్పించిన వైయస్ జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టర్ బాబ్జి సేవలు చిరస్మరణీయం

- పాలకొల్లు ప్రెస్ క్లబ్‌లో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాబ్జికి ఘన నివాళి

ప్రజాభూమి ప్రతినిధి,పాలకొల్లు:

ఇటీవల మృతి చెందిన పాలకొల్లు మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ వైద్యులు డాక్టర్ సీహెచ్సత్యనారాయణమూర్తి (బాబ్జి) సేవలు చిరస్మరణీయమని పాలకొల్లు ప్రెస్ క్లబ్ నాయకులు అన్నారు. ప్రెస్ క్లబ్ నూతన భవన నిర్మాణానికి డాక్టర్ బాబ్జి లక్ష రూపాయల విరాళం అందించి తన ఉదారతను చాటుకున్నారని కొనియాడారు. పాలకొల్లు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ భవనంలో బుధవారం నిర్వహించిన డాక్టర్ బాబ్జి సంతాప సభకు క్లబ్ అధ్యక్షుడు విన్నకోట వెంకటరమణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు డాక్టర్ బాబ్జి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం క్లబ్ సభ్యులంతా ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ ఐదు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ డాక్టర్ బాబ్జి మంచి మనసున్న వ్యక్తి అని, వైద్యునిగా ప్రజలకు విశేష సేవలందించడంతో పాటు సామాజిక కార్యక్రమాల్లోనూ తనదైన సేవాభావాన్ని చాటుకున్నారని అన్నారు. ప్రెస్ క్లబ్ నూతన భవన నిర్మాణానికి లక్ష రూపాయలు విరాళంగా అందించడం ఆయన దాతృత్వానికి నిదర్శనమన్నారు. నేడు ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, చేసిన సేవలు, మంచితనం అందరి హృదయాల్లో ఎప్పటికీ నిలిచిపోతాయని పేర్కొన్నారు. డాక్టర్ బాబ్జి ప్రజలకు అందించిన వైద్య సేవలను, ఆయన సేవాగుణాన్ని, నిరాడంబరమైన వ్యక్తిత్వాన్ని గుర్తుచేసుకున్నారు. ప్రజలతో ఆప్యాయంగా మెలుగుతూ, అవసరమైన వారికి అండగా నిలిచిన ఆయన లేని లోటు సమాజానికి తీరనిదని అన్నారు. ఈ సంతాప సభలో ప్రెస్ క్లబ్ ప్రతినిధులు ముత్యాల శ్రీనివాసరావు, పిటి వెంకటేశ్వరరావు, కాగిత సూర్యనారాయణ, మండేలా



అప్పలరాజు, మద్దా విజయ లాజరస్, కూనపురెడ్డి శ్రీనివాసరావు (చిన్ని), అడ్డాల నరేష్, కాపిశెట్టి గోపాలరావు, పడాల గోపికృష్ణ, శాంతి, మానాపురం సత్యనారాయణ, పప్పుల దుర్గేష్, రాఘవ, , జ్యోతి గోపి, గుమ్ములూరి భాస్కరరావు, నిమ్మల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

7,816వేల పట్టాదార్ పాస్తులు నవంబర్ నెలలో పంపిణీ లక్ష్యం



ప్రజా భూమి బ్యూరో ఏలూరు జిల్లా.

ఏలూరు జిల్లాలో నవంబర్ నెలలో 7 వేల 816 పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ లక్ష్యానికి గాను, 2 వేల 233 పుస్తకాలు పంపిణీ చేశామని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి రాష్ట్ర భూపరిపాలన శాఖ ముఖ్య కమీషనర్ జి. జయలక్ష్మి కి చెప్పారు. పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ, రీ సర్వే, మ్యూటేషన్స్ ఈ-కెవైసి, పబ్లిక్ పొజిటివ్ పెర్సెప్షన్ తదితర అంశాలపై రాష్ట్ర సచివాలయం నుండి బుధవారం రాష్ట్ర భూపరిపాలన శాఖ ముఖ్య కమీషనర్ జి. జయలక్ష్మి రాష్ట్రంలోని జిల్లాల కలెక్టర్లతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సిసిఎల్ఏ జయలక్ష్మి మాట్లాడుతూ నవంబర్ నెలలో పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీని నిర్దేశించిన సమయంలోగా పూర్తిచేయాలని, డిసెంబర్ నెలకు గాను పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీకి పటిష్టమైన ప్రణాళిక రూపొందించుకోవాలని, మ్యూటేషన్స్ ఈ-కెవైసి పనులు నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలన్నారు. రీ సర్వే పనులను నిర్దేశించిన లక్ష్యాల మేర పూర్తిచేయాలన్నారు. ప్రభుత్వ సేవల మరింత మెరుగైన రీతిలో ప్రజలకు అందించి ప్రజల సంతృప్తి స్థాయిని మరింత పెంచాలన్నారు. ఏలూరు కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి జూమ్ కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ నవంబర్ నెలలో జిల్లాలోని 18 గ్రామాలలో 7 వేల 816 పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ లక్ష్యానికి గాను, 2 వేల 233 పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. డిసెంబర్ నెలలో 56 గ్రామాలలో పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీకి గాను ఇంతవరకు 7975 పుస్తకాలు ముద్రణకు సిద్ధం చేశామని, మిగిలినవి ఈనెల 17వ తేదీలోగా ముద్రణకు చర్యలు తీసుకుంటామన్నారు. మ్యూటేషన్స్ ఈ-కెవైసి 12 వేల 414 లక్ష్యానికిగాను, 8384 పూర్తిచేశామని, మిగిలినవి నిర్దేశించిన సమయంలోగా పూర్తిచేస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ డా.ఎం.జె.అభిషేక్ గౌడ, నూజివీడు సబ్ కలెక్టర్ బి. వినూత్న, ఆర్డీఓలు లక్ష్మీప్రసన్న, రమణ, ప్రభృతులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ చెత్తతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం!

- పొలాల్లోకి చేరుతున్న చెత్త, వరద నీరు.. రైతుల ఆవేదన



ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి

అన్నదేవరపేట నుంచి వెంకటాయపాలెం వెళ్లే రహదారిలో పవర్ స్టేషన్ సమీపంలోని డంపింగ్ యార్డ్ సమస్య రైతులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. గత కొంతకాలంగా పంచాయతీ సిబ్బంది అక్కడ చెత్తను వేస్తుండటంతో పరిసర ప్రాంతాల్లోని రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై గతంలో కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు స్పందిస్తూ, ప్రజలు నిత్యం ప్రయాణించే రహదారిపై చెత్త వేయరాదని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, డంపింగ్ యార్డుకు ప్రత్యామ్నాయ స్థలాన్ని పరిశీలించాలని ఆదేశించినప్పటికీ ఆచరణలో మార్పు కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, కొవ్వాడ కాలువ వరద నీటి కారణంగా డంపింగ్ యార్డులోని చెత్త కొట్టుకుపోయి రైతుల పొలాల్లోకి, వ్యవసాయ నీటి మోటార్లలోకి చేరుతోందని తెలిపారు. దీంతో వ్యవసాయ పనులకు ఆటంకం కలగడమే కాకుండా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డంపింగ్ యార్డును ప్రత్యామ్నాయ ప్రదేశానికి తరలించాలని, పొలాల్లోకి చేరిన చెత్తను తొలగించి రైతులకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



మంత్రినిమర్యాదపూర్వకంగా కలిసి పూలబోకేలను అందించిన స్థానిక విజేతలు

ప్రజాభూమి ప్రతినిధి – నూజివీడు

విజయవాడతాడిగడపలోని క్యాంపుకార్యాలయంలో బుధవారంనూజివీడు స్థానిక సంస్థలు ఎన్నికల్లో గెలుపొందిన కూటమిపార్టీ అభ్యర్థులు రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథినిమర్యాదపూర్వకంగా కలిసి పూలబోకేలను అందించారు. నియోజకవర్గపరిధిలోని పలుమండలాల్లో నెలకొన్న ప్రజాసమస్యలు, పెండింగులో ఉన్న గ్రామీణ రహదారులు, తాగునీరు తదితర అభివృద్ధి పనులుపై మంత్రి సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజాసమస్యలు పరిష్కారానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. నూజివీడు నియోజకవర్గఅభివృద్ధికి అన్ని విధాలాగ సహాయ, సహకారం అందిస్తామని, గ్రామాల్లో మౌళిక వసతులు కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నూజివీడునియోజకవర్గానికి చెందిన గెలుపొందిన అభ్యర్థులు, పలువురు మండల స్థాయి నాయకులు,పార్టీ ముఖ్యశ్రేణులు మరియు కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మించారు.. గోతులు పూడ్చడం మరిచారు!

- రోడ్డు అంచున ప్రమాదకరంగా గోతులు.. రాత్రివేళ ప్రమాదాలు జరిగే అవకాశం



ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి

మండల కేంద్రమైన తాళ్లపూడిలో పాత ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్లే మార్గంలో ఇటీవల డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టారు. సీసీ రోడ్డు మధ్యలో డ్రైనేజీ నిర్మాణం చేపట్టడంతో కొంతకాలం పాటు ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. అభివృద్ధి పనులకు సహకరిస్తూ ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణాలు సాగించారు. ఎట్టకేలకు డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ, డ్రైనేజీ వెంబడి రోడ్డు అంచున తవ్విన గోతులను పూడ్చకుండా వదిలేయడం విమర్శలకు తావిస్తోంది. రోడ్డు అంచులు ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో గోతులు కనిపించకపోవడంతో రోడ్డు అంచున ప్రయాణించే వారు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. అభివృద్ధి పనులు చేపట్టడం ఎంత ముఖ్యమో, వాటి అనంతరం రహదారులను సురక్షితంగా పునరుద్ధరించడం కూడా అంతే ముఖ్యమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీ వెంబడి ఉన్న గోతులను పూడ్చి, రహదారిని ప్రయాణానికి అనువుగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

రామచంద్రపురం మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి జనసేనకే

- వైస్ చైర్మన్ అభ్యర్థిగా కవల నానాజీ?
- 32 వార్డులకు 27 వార్డులు కూటమి కైవసం
- 5 వార్డులకే పరిమితమైన వైకాపా

ప్రజాభూమి ప్రతినిధి,రామచంద్రపురం

త్వరలో జరగనున్న మున్సిపల్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారానికి రామచంద్రపురం మున్సిపాలిటీ పరిధిలో నేతలు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే డైరెక్ట్ ఓటింగ్ విధానంతో టిడిపి తరఫున మున్సిపల్ చైర్ పర్సన్ గా పట్టణానికి చెందిన మేడిశెట్టి శేషారావు భారీ మెజార్టీతో చైర్మన్ గిరి కైవసం చేసుకోగా, వైస్ చైర్మన్ పదవి జనసేనకు కేటాయించినట్లు సమాచారం కాగా 20 వార్డు నుంచి జనసేన తరఫున గెలుపొందిన కవల నారాయణమూర్తి (నానాజీ)పేరు తెరపైకి వచ్చింది. జనసేన తరఫున గెలుపొందిన 12 కౌన్సిలర్లలో ఎక్కువ మంది నానాజీని వైస్ చైర్మన్ గా బలపరుస్తున్నట్లు సమాచారం కాగా నారాయణమూర్తి 20వ వార్డులో జనసేన తరఫున పోటీ చేసి 748 ఓట్లు మెజార్టీతో ప్రత్యర్థి వైకాపా అభ్యర్థి గుండుబోగుల రమేష్ పై గెలుపొందారు . ఇది ఇలా ఉండగా రామచంద్రపురం మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 32 వార్డులకు గాను 14 వార్డుల్లో టిడిపి 12 వార్డుల్లో జనసేన 5 వార్డుల్లో వైకాపా అభ్యర్థులు గెలుపొందారు. దీంతో కూటమి తరపున 27 మంది కౌన్సిలర్లు ఆయా వార్డుల్లో గెలుపొందారు.

భారీ మెజారిటీతో మేడిశెట్టి శేషారావు చైర్మన్ గిరి కైవసం.

రామచంద్రపురం మున్సిపాలిటీలో మునుపెన్నడూ లేని విధంగా టిడిపి కి చెందిన చైర్మన్ అభ్యర్థి మేడిశెట్టి శేషరావు వైకాపా అభ్యర్థి చింతపల్లి నాగేశ్వరరావు పై 7840 ఓట్లు భారీ మెజార్టీతో గెలుపొంది చైర్మన్ గిరి కైవసం చేసుకున్నారు.దీంతో రామచంద్రపురం మున్సిపాలిటీ కి త్వరలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారానికి మేతల సన్నాహాలు చేస్తున్నారు.



రామచంద్రపురం మున్సిపల్ వైస్ చైర్మన్ అభ్యర్థిగా కవల నానాజీ



రామచంద్రపురం మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన మేడిశెట్టి శేషారావు

ప్రజాభూమి

జనరల్ 15

గురువారం 12 నవంబరు 2026

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

జడ్జి ఎం. మురళీధరరావు పిలుపు



ప్రజాభూమి ప్రతినిధి-రంపచోడవరం

రానున్న డిసెంబర్ 12వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రంపచోడవరం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ మరియు మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్ ఎం. మురళీధరరావు పిలుపునిచ్చారు.రంపచోడవరం న్యాయ స్థాన పరిధిలోని పోలీస్ అధికారులతో మరియు న్యాయవాదులు ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రానున్న జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు సూచించారు.పోలీస్ స్టేషన్ల పరిధిలో రాజీకి ఆస్కారం ఉన్న క్రిమినల్ కేసులు, మోటారు వాహన ప్రమాద పరిహార కేసులు (ఎంవీఏ), చెక్ బౌన్స్, సివిల్ తగాదాలు, వివాహ సంబంధిత కుటుంబ సమస్యలు తదితర కేసులను గుర్తించి, కక్షిదారులను లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకునేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు.ఇరుపక్షాల కక్షిదారులకు ముందస్తు సమాచారం అందించి, కౌన్సెలింగ్ ద్వారా రాజీ కుదిర్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లోక్‌అదాలత్ ద్వారా పరిష్కారమైన కేసులకు ఎటువంటి అప్పీల్ ఉండదని, దీనివల్ల సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు కోర్టులపై కేసుల భారం తగ్గుతుందని తెలిపారు.

టీబి ముక్తభారత్ అభియాన్ 3.0 అవగాహనా ప్రచారం



ప్రజాభూమి ప్రతినిధి-రంపచోడవరం

టిబి ముక్తభారత అభియాన్ 3.0 లో భాగంగా పోలవరం జిల్లాలో రంపచోడవరం మండలంలో గల సీతపల్లి పీహెచ్సీ నందు హ్యాండ్ హెల్డ్ ఎక్సరే ఏ విధంగా ఉపయోగించాలి అనే అంశంపై పోలవరం జిల్లాలో రంపచోవడం డివిజన్లో పనిచేయుచున్న ఎం .ఎల్ హెచ్ పి అందరికీ ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది. ఈ హ్యాండ్ హెల్డ్ ఎక్స్రే మిషన్ యొక్క ప్రత్యేకత ఏమిటి అంటే జిల్లాలో మారుమూల గ్రామాలలో ఉండే ప్రజలందరికీ వారి యొక్క గ్రామానికి వెళ్లి టిబి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయడం జరుగుతుంది. . గతంలో టిబి నిర్ధారణ కొరకు ఏరియా హాస్పిటల్ మరియు సిహెచ్ సిహెచ్ సి లకు వెళ్లి టీవీ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవలసి వచ్చేది. ఈ కార్యక్రమంలో పోలవరం జిల్లా డిఎంహెచ్వో పి సరిత గమరియు డాక్టర్ శ్రీహర్షిని మరియు ఎస్ టి ఎస్ గీతాంజలి రంపచోడవరం, ఎస్ టి ఎస్ లక్ష్మీ గారు అడ్డతీగల, ట్రైనర్ అనిల్ మరియు సీతపల్లి పీహెచ్సీ సిబ్బంది పాల్గొన్నారు.

బళ్లారి నగరంలో ఆధునిక వైద్య సేవలకు మరింత చేరువగా వేస్తా

-డయాగ్నస్టిక్ సెంటర్ ప్రారంభం కావడం సంతోషకరం.



ప్రజాభూమి ప్రతినిధి-అనంతపురం

కర్ణాటక రాష్ట్రం బళ్లారి హౌసింగ్ బోర్డ్ కాలనీ, ఇన్ఫంట్రీ రోడ్‌లో ఏర్పాటు చేసిన ఎవర్‌ఫ్ డయాగ్నస్టిక్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కుటుంబ మరియు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, హిందూపురం పార్లమెంట్ సభ్యులు పార్థసారథి, రాయదుర్గం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, బళ్లారి ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి, చైర్మన్ శ్రీ కేశవరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీ సంధిరెడ్డి శ్రీనివాస్ గారు, స్థానిక డిప్యూటీ మేయర్ జానకమ్మ, నాయకులు, కార్యకర్తలు, ఆసుపత్రి కమిటీ సభ్యులు మరియు ప్రజలు పాల్గొన్నారు. వేస్తా డయాగ్నస్టిక్ సెంటర్‌ను ఏర్పాటు చేసిన డాక్టర్ ఆకాష్ ని ఈ సందర్భంగా అభినందించాను. బళ్లారితో పాటు రాయదుర్గం, బొమ్మనహాళ్, డి.హిరేహాళ్, విడపనకల్లు తదితర సరిహద్దు ప్రాంతాల ప్రజలకు తక్కువ ఖర్చుతో ఆధునిక వైద్య పరీక్షలు అందుబాటులోకి రావడం ఎంతో ఉపయోగకరం. జు స్కాన్, అల్ట్రాసౌండ్, క్యాన్సర్ నిర్ధారణతో పాటు వివిధ రకాల ఆధునిక వైద్య పరీక్షలు అందుబాటులో ఉండటం వల్ల వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి, సకాలంలో చికిత్స పొందేందుకు ఈ కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంజీవని, ఆయుష్మాన్ భారత్ వంటి ఆరోగ్య పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. పేద, మధ్యతరగతి కుటుంబాలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వాలు నిరంతరం కృషి చేస్తున్నాయి. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ, అందుబాటులో ఉన్న వైద్య సేవలు మరియు ప్రభుత్వ ఆరోగ్య పథకాలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నాము.

వనవాసి కళ్యాణ ఆశ్రమం ఆధ్వర్యంలో

కుంకుమ పూజల నిర్వాహకులకు ఘన సత్కారం

గంగవరం బాపనమ్మ తల్లి ఆలయంలో సమావేశం బిర్సా ముండా జయంతి సందర్భంగా నివాళులు





ప్రజాభూమి ప్రతినిధి-గంగవరం

వనవాసి కళ్యాణ ఆశ్రమం,వనవాసి ధర్మ రక్షణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో దుర్గాష్టమి సందర్భంగా నిర్వహించిన నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని కుంకుమ పూజలు నిర్వహించారు సుమారు11మండలాల్లోని వివిధ గ్రామాల్లో దాదాపు 2,000 మంది మహిళలతో ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపా రు ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి గ్రామగ్రామాన తిరుగుతూ కృషి చేసిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ గంగవరం మండలంలోని బాపనమ్మ తల్లి ఆలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా కార్యక్రమాల నిర్వహణలో భాగస్వాములైన కార్యకర్తలను చిరు సత్కారాలతో గౌరవించారు. దీపావళి అనంతరం భగినీ హస్తం కార్యక్రమం ద్వారా కార్యకర్తలకు భోజన ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు అదేవిధంగా గిరిజనుల ఆత్మగౌ రవానికి ప్రతీకగా నిలిచిన స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా జయంతిని పురస్కరించుకొని వారోత్సవాల్లో భాగంగా చిన్న ర్యాలీ నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు దేశానికి గిరిజన సంస్కృతి పరిరక్షణకు బిర్సా ముండా అందించిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కార్యకర్తలు పాల్గొని నవరాత్రి మహోత్సవాల విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు

పవన్ విడాకులపై వైయస్ జగన్ మాట్లాడొద్దన్నాడు

- ఆయన గొప్ప సంస్కారం ఎంతో ఆదర్శనీయం
- జగన్‌ను చూసి చంద్రబాబు, పవన్ నేర్చుకోవాలి
- కానీ, కూటమి నేతలకు ఆ సంస్కారం లేదు
- జగన్‌గారి కుటుంబంపై దారుణ ట్రోలింగ్
- చివరకు వైయస్ భారతిగారిని కూడా వదల్లేదు
- సంస్కారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నైజం
- వ్యక్తిత్వ హననం వెన్నుపోటు పార్టీ కూటమి ధ్యేయం
- ఇకనైనా పద్ధతి మార్చుకొండి. మీ ధ్యేయం వీడండి
- కనీస సంస్కారంతో వ్యవహరించండి
- నందమూరి లక్ష్మీపార్వతి

ప్రజాభూమి ప్రతినిధి-తాడేపల్లి

జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మూడో భార్య అన్నా కొణిదల విడాకుల వ్యవహారంపై పార్టీలో ఎవరూ, ఎక్కడా ఏం మాట్లాడొద్దని చెప్పడం ద్వారా మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్, తన పార్టీ శ్రేణులకు అత్యంత సంస్కారయుతంగా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని పార్టీ ప్రధాన కార్యదర్శి నందమూరి లక్ష్మీ పార్వతి తెలిపారు. రాజకీయాలు వేరు, వ్యక్తిగత జీవితాలు వేరని బలంగా నమ్మే వ్యక్తి వైయస్ జగన్ అని ఆమె వెల్లడించారు. అందుకు పూర్తి భిన్నంగా చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ వ్యవహారం ఉంటుందని చెప్పారు. వారితో పాటు, ఎల్లో మీడియా సైతం దిగజారి, జగన్‌గారి కుటుంబ అంతర్గత వ్యవహారాలను, ఆస్తి వివాదాలను పట్టుకుని దుష్ప్రచారం చేశారని గుర్తు చేశారు. మరోవైపు వ్యాపారవేత్తగా, సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలుస్తున్న వైయస్ భారతిని కూడా సోషల్ మీడియాలో నీచంగా ట్రోల్ చేశారని చెప్పారు. ఇకనైనా కూటమి నేతలు బుద్ధి తెచ్చుకుని, మహిళల జోలికి రావడం మానుకోవాలని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన నందమూరి లక్ష్మీపార్వతి హెచ్చరించారు.

ప్రెస్‌మీట్‌లో నందమూరి లక్ష్మీపార్వతి ఇంకా ఏం మాట్లాడారంటే..

ఎవరి వ్యక్తిగత జీవితాల గురించి మనం మాట్లాడొద్దని మా పార్టీ అధ్యక్షుడు జగన్‌గారు మా అందరికీ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. రాజకీయాలు వేరు, వ్యక్తిగత జీవితాలు వేరని బలంగా నమ్మే వ్యక్తి మా నాయకుడు. పవన్ కళ్యాణ్ విడాకుల వ్యవహారం బయటకు రాగానే దానిపై ఎవరూ స్పందించవద్దని ఆదేశించి ఆయన తన ఉన్నతమైన సంస్కారాన్ని చాటుకున్నారు. రాజకీయాల్లో ఎలా హుందాగా, సంస్కారంగా వ్యవహరించాలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మా జగన్‌ని చూసి నేర్చుకోవాలి.

మరి చంద్రబాబు, పవన్ వ్యవహారం ఎలా ఉంది?:

దేశమంతా గర్వించదగ్గ ఉత్తమ ఇల్లాలు, ఎన్నో పరిశ్రమలను విజయవంతంగా నడుపుతూ, అన్నదానాలు, ఉచిత విద్యాదానాలు చేస్తూ సేవలందిస్తున్న వైయస్ భారతి పై గతంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఎంత నీచమైన విమర్శలు చేశారు? ఆమె వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ సినిమాలు తీయించి, ఎల్లో మీడియా, సోషల్ మీడియా పెయిడ్ ఆర్టిస్టులతో ఎంత పైశాచికంగా ట్రోలింగ్ చేయించారు? జగన్ గారి కుటుంబంలో ఉండే చిన్న చిన్న ఆస్తి వివాదాలను పట్టుకుని ఇంత దారుణంగా మాట్లాడిన మీరు ఒక్కసారైనా ఆత్మవిమర్శ చేసుకోవాలి.

మైకుల ముందుకు వస్తే మహిళల రక్షణే నా ప్రథమ కర్తవ్యం అని మాట్లాడే పవన్ కళ్యాణ్, నిజ జీవితంలో మహిళల పట్ల ఎలా ప్రవర్తిస్తున్నారో సమాజం అంతా గమనిస్తోంది. జనసేన పార్టీ ఎమ్మెల్యే ఒకరు బరితెగించి మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడితే పవన్ కనీస చర్యలు తీసుకోలేదు. మొక్కుబడిగా సస్పెండ్ చేసి మళ్లీ పక్కనే కూర్చోబెట్టుకున్నారు. మహిళా అధికారుల వెంటపడే కామాంధులు మీ పార్టీలో ఉంటే వారికి ఏం శిక్ష వేశారు? కూటమి పాలనలో వందలాది మంది మహిళలపై అత్యాచారాలు జరుగుతుంటే డిప్యూటీ సీఎంగా ఉన్న పవన్ ఎందుకు నోరు విప్పడం లేదు?

వైయస్.జగన్ పుణ్యమా అని నా జీవితంలో సొంత ఇల్లు వచ్చిందని అమాయకంగా సంతోషపడిన గీతాంజలి అనే పేద మహిళను టీడీపీ రాక్షసులు వేధించి ఆత్మహత్య చేసుకునేలా చేశారు. ఆమె కళ్లల్లో ఆనందం చూడలేక అర్ధరాత్రి వేళల్లో కూడా అసభ్యకర మెసేజ్‌లు పంపి చంపేశారు. మా మాజీ మంత్రులు రోజా, విడదల రజిని క్యారెక్టర్లను అసాసినేట్ చేస్తూ మీ ఐటీడీపీలో పైశాచిక ఆనందం పొందారు. ఇతర పార్టీల మహిళలకు కుటుంబాలు, పిల్లలు, ఆత్మగౌరవం ఉంటాయన్న స్పృహ మీకు లేదా? తిరుమల లడ్డూల విషయంలో చంద్రబాబు పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తే, పవన్ కళ్యాణ్ దాన్ని భుజాన వేసుకుని మెట్లు కడిగి పెద్ద డ్రామా చేశారు. అయోధ్యకు లక్షల కల్తీ లడ్డూలు వెళ్లాయంటూ తిరుమల పవిత్రతను, వెంకటేశ్వర స్వామి ప్రసాదాన్ని ప్రపంచవ్యాప్తంగా అపహాస్యం చేశారు. జగన్ గారిపై 'క్రిస్టియన్' అంటూ ముద్ర వేసి తిరుమలలో డిక్లరేషన్ పేరిట రభస సృష్టించారు. తన రాజకీయ స్వార్థం కోసం విదేశీ భార్య అన్నా కొణిదలను తిరుమలకు పంపి, తలనీలాలు తీయించి వీడియోలతో పబ్లిసిటీ చేసుకున్న వ్యక్తి పవన్ కళ్యాణ్.

సొంత చెల్లెలికి వందల కోట్ల ఆస్తులు ఇచ్చిన ఉదార హృదయం వైయస్ జగన్ గారిది. మరి చంద్రబాబు నాయుడు తన సొంత చెల్లెళ్లకు కనీసం తలదాచుకోవడానికి ఇల్లు ఇవ్వకుండా, ఒక్క పూట అన్నం పెట్టకుండా రోడ్డున పడేసింది వాస్తవం కాదా? అలాంటి చంద్రబాబు జగన్ గారి కుటుంబం గురించి మాట్లాడటం హాస్యాస్పదం. ఆడవాళ్లను అడ్డం పెట్టుకుని ఎదిగిన చంద్రబాబుకు తప్పకుండా అదే ఆడవాళ్ల ఉసురు తగులుతుందని నందమూరి లక్ష్మీపార్వతి అన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులలో ఆంధ్రప్రదేశ్‌కు అరుదైన గుర్తింపు

- ఢిల్లీలో మంత్రి పొంగురు నారాయణ వెల్లడి
- ఆంధ్రప్రదేశ్‌కు 6 స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు
- దేశవ్యాప్తంగా అవార్డులు పొందిన 24 మునిసిపాలిటీల్లో 6 (25 శాతం)ఆంధ్ర ప్రదేశ్‌కు చెందినవే

ప్రజాభూమి ప్రతినిధి-న్యూఢిల్లీ

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డులలో ఆంధ్రప్రదేశ్ కు అరుదైన గుర్తింపు దక్కిందని రాష్ట్ర మున్సిపల్ మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగురు నారాయణ పేర్కొన్నారు.జాతీయ స్థాయిలో 25 శాతం అవార్డులను ఆంధ్రప్రదేశ్ దక్కించుకుందని మంత్రి తెలిపారు.ఢిల్లీలోని ఏపీ భవన్ గురజాడ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం అధికారులతో కలిసి మంత్రి విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రానికి దక్కిన వివిధ అవార్డులు, మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి ఆయన వివరించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26 అవార్డుల వివరాలు

గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులలో ఆంధ్రప్రదేశ్ మెరుగైన ప్రతిభ కనబరిచిందన్నారు. గత సంవత్సరంలో జాతీయ స్థాయిలో ఇచ్చిన 78 అవార్డులకు గాను ఏపీకి 5 అవార్డులు మాత్రమే దక్కగా, ఈ సంవత్సరం 60 అవార్డులు ప్రకటించగా అందులో ఆంధ్రప్రదేశ్‌కు 6 అవార్డులు లభించాయన్నారు.వివిధ కేటగిరీలు హిల్ స్టేషన్స్, రివర్స్ సిటీస్, కోస్టల్ సిటీస్ వారీగా ఈ అవార్డులను కేటాయించారు.గత ఏడాది రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలకు గాను ఎలిజిబిలిటీ పోటీలో 39 అవార్డులు రాగా, అందులో 5 కైవసం చేసుకున్నాం ఇది సుమారు 12.5% శాతం. అదే ఈసారి 60 నేషనల్ అవార్డులు ఇస్తే, అందులో ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న 123 మున్సిపాలిటీలు పోటీ పడగా 24 అవార్డులకు ఎలిజిబిలిటీ వచ్చింది. ఆ 24 అవార్డులలో పోటీ పడి ఏపీకి 6 అవార్డులు వచ్చాయి. నేషనల్ లెవెల్‌లో ఇచ్చిన వాటిలో 25% ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీలు కైవసం చేసుకున్నాయి.

ఆరు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు - నగరాల వారీగా వివరాలు:

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్: స్వచ్ఛ షెహర్ 1వ ర్యాంక్

విజయవాడ: జాతీయ స్వచ్ఛ నగరాల జాబితాలో 3వ ర్యాంక్

గుంటూరు: స్వచ్ఛ్ షెహర్ 3వ ర్యాంక్

రాజమండ్రి: రాష్ట్రంలోనే మొదటి స్వచ్ఛ నగరంగా ప్రత్యేక గుర్తింపు (ప్రామిసింగ్ స్వచ్ఛ షెహర్)

తిరుపతి: స్వచ్ఛ్ షెహర్ జోడి విభాగంలో 3వ ర్యాంక్

కుప్పం: స్వచ్ఛ్ షెహర్ జోడి విభాగంలో 3వ ర్యాంక్

ఈ విధంగా మొత్తం 6 అవార్డులు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చాయని మంత్రి తెలిపారు. ఈ అవార్డులు రావడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ప్రత్యేకంగా ప్రతి నెల 'స్వచ్ఛ భారత్ - స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, ప్రతి నెల మూడో శనివారం ఏదో ఒక జిల్లాకు వెళ్లి ఈ కార్యక్రమం చేయడం, ప్రజల్లో అవగాహన తేవడం ప్రధాన కారణమని చెప్పారు. అంతేకాకుండా ప్రిన్సిపల్ సెక్రటరీ, సీడీఎంఏ డైరెక్టర్, చైర్మన్లు, మిగతా అధికారులందరూ ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లారని ప్రశంసించారు.



ఏపీ 'లెగసీ ఫ్రీ స్టేట్' - చెత్త నిర్వహణ

రాష్ట్రంలో గత ప్రభుత్వం దిగిపోయేనాటికి 153 లక్షల టన్నుల లెగసీ చెత్త ఉండేదని, ఈ ప్రభుత్వం వచ్చిన మొదటి సంవత్సరంలోనే దాదాపు 85 లక్షల టన్నుల చెత్తను తొలగించామని మంత్రి వెల్లడించారు. ఆటోమేటిక్‌గా ఆలోస్ట్ 153 లక్షల టన్నులు పూర్తిగా తొలగించడంతో ఈరోజు ఆంధ్రప్రదేశ్ "లెగసీ ఫ్రీ స్టేట్" గా అవతరించిందని తెలిపారు. వచ్చిన చెత్తను ఎప్పటికప్పుడు ప్రాసెస్ చేయడానికి 106 ప్లాంట్లను శాంక్షన్ చేయగా, దాదాపు 60 ప్లాంట్లు ఏర్పాటు చేశామని, మరో 20 ప్లాంట్లు త్వరలో ఏర్పాటు చేయబోతున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన దేశాల చైనా, జపాన్, సింగపూర్ మాదిరిగా సాలిడ్ వేస్ట్ ప్లాంట్లు ఏర్పాటు చేసి ఎలక్ట్రిసిటీ ప్రొడ్యూస్ చేసే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు.

ద్రవ వ్యర్థాల శుద్ధి - హరిత వనాలు

ప్రతి ఇంటి బాత్‌రూమ్, కిచెన్, టాయిలెట్ల నుంచి వచ్చే మురుగు నీటిని ట్రీట్ చేసి బయటికి పంపడానికి ప్రతి మున్సిపాలిటీలో ఎస్టీపీ (ఝా) ప్లాంట్లు శాంక్షన్ చేయడం జరిగిందని, రాబోయే 6 నెలల్లో ఇవి పూర్తి కానున్నాయని మంత్రి తెలిపారు. అలాగే రాష్ట్రంలో 2047 నాటికి 50% ఏరియా గ్రీనరీ ఉండాలనే లక్ష్యంతో ప్రతి 5 మీటర్లకు ఒక ట్రీ ప్లాంటేషన్ చేసేలా వర్క్ అవుట్ చేస్తున్నామని చెప్పారు. పార్కులు మరియు వాటర్ పాండ్స్‌కు హై ప్రయారిటీ ఇస్తూ 'హేమ్' అనే ప్రాజెక్ట్ కింద రూ. 900 కోట్లు శాంక్షన్ చేశామని వెల్లడించారు.

తాగునీరు - మౌలిక వసతుల కల్పన

రాష్ట్రంలో ప్రతి ఇంటికి రాబోయే రెండు సంవత్సరాల్లో ట్యాప్ ద్వారా స్వచ్ఛమైన ట్రీటెడ్ తాగునీరు అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని మంత్రి తెలిపారు. ఏషియన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ూ××దీ), అమృత ధార, యూఐడీ ధార, హ్యామ్ ప్రాజెక్ట్ ద్వారా అనేక ప్రాజెక్టులతో ఈ కార్యక్రమం జరుగుతోందన్నారు. రోడ్లలో డస్ట్ రాకుండా ఉండేందుకు ఎండ్-టు-ఎండ్ రోడ్లు, స్ట్రీట్ లైట్ల స్థానంలో ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు వంటి మున్సిపల్ కార్పొరేషన్లు, కౌన్సిళ్లు, నగర పంచాయతీల బేసిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రూ. 50,000 కోట్లతో పనులు జరుగుతున్నాయని మంత్రి పొంగురు నారాయణ స్పష్టం చేశారు. ఈ విలేకర్ల సమావేశంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె. పట్టాభిరామ్,హీఖణ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్., మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ ఽ డైరెక్టర్ పి. సంపత్ కుమార్,, ఏపీ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండీ బి. సునీల్ కుమార్ రెడ్డి ,విశాఖపట్నం మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్, ఐ.ఎ.ఎస్., మున్సిపల్ కమిషనర్ విజయవాడ ధ్యాన్ చంద్ర, .,మున్సిపల్ కమిషనర్ తిరుపతి జయ కృష్ణ, .,మున్సిపల్ కమిషనర్ రాజమండ్రి రాహుల్ మీనా,,మున్సిపల్ కమిషనర్ గుంటూరు మయూర్ అశోక్, మున్సిపల్ కమిషనర్ కుప్పం,శ్రీనివాస్ రావు అధికారులు పాల్గొన్నారు.